గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# డిసెంబర్ 2013

# కథలు




రిటైర్డ్ రఘునాధం గారు హత్య చేయబడ్డారు.

సంచలనం సృష్టించిన ఆ హత్య ఎవరు చేశారో? ఎందుకు చేశారో? విచారణ చేస్తున్న ఇన్ స్పెక్టర్ కి అంతు చిక్కడం లేదు. కేసు ఛేదించడం లో ఆలస్యం అవుతున్నందుకు పైనుంచి ఒత్తిడెక్కువవుతోంది. అందుకే ఆ కేసుని డిటెక్టివ్ వేణుకి అప్పగించబడింది.డిటెక్టివ్ వేణు. మనిషి స్ఫుర ద్రూపి. అతను టేకప్ చేసిన ఏ కేసూ ఇంతవరకూ పరిష్కరించకుండా పెండింగ్ లో లేదు. అతనంటే పోలీస్ డిపార్ట్ మెంట్ కి గొప్ప నమ్మకం.

రఘునాధం గారింట్లో ఆయన భార్య.. ఇద్దరు కొడుకులు. .ఐదేళ్ళ క్రితం పనికని వచ్చి వాళ్ళింట్లోనే వుండిపోయిన శ్రీరామ్ వున్నారు. అందరూ కలిసే వుంటారు. ఇద్దరు కొడుకులకి పెళ్ళిళ్లయిపోయాయి. పెద్దవాడు ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండోవాడి ఉద్యోగం పోయి ఆర్నెళ్ళుగా ఉద్యోగ వేటలో వున్నాడు. ఇద్దరు కొడుకులూ..శ్రీరామ్ అనుమానితులుగా ఏం అనిపించడం లేదు. కోడళ్ళు కూడా మంచి వాళ్ళే! రఘునాధం గారు నిద్రలో వుండగా ముఖం మీద దిండులో నొక్కి హత్య చేశారు. అది బయట వాళ్ళ పని కాదు. ఎందుకంటే వేసిన తలుపులు వేసినట్టేవున్నాయి. అలా అని ఇంట్లోవాళ్ళూ అలా చేశారనిపించడం లేదు. పోనీ బయట వాళ్ళెవరికన్నా చంపడానికి సహాయంచేసి మళ్ళీ తలుపులు గడియ పెట్టేశారా? అదీ తెలియడం లేదు. మరెవరు?

వేణుని కూడా తికమక పెట్టింది కేసు. అతని అనుమానం ఆ ఇంటిలో రక్త సంబంధం లేని శ్రీరామ్ మీదకి మళ్ళింది. అప్పటికే

పోలీసులు అతడిని ఇంటరాగేట్ చేసి అతడికీ ఆ హత్యకి సంబంధం లేదని రిపోర్ట్ తయారు చేశారు. కానీ సాధారణంగా ఇలాంటి కేసుల్లో గనక ప్రొఫెషనలిజం వుండి, తొణకని బెణకని మనస్థత్వం వున్న అపరాధులుంటే పరిష్కరించడం కాస్త జటిలంగానే వుంటుంది. అందుకే ముందుగా వేణు ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించాడు. అతని తల్లి గుంటూరులోని ఒక ఆశ్రమంలో వుండేదని.. శ్రీరామ్ కూడా ఆ ఇంటికి వచ్చేముందు అక్కడే వుండేవాడని తెలుసుకుని అక్కడికి వెళ్ళాడు.

**************************************************************

కళా కాంతి లేని ఆ ఆశ్రమంలోకి అడుగుపెడుతూ సేవా ధృక్పథంతో ప్రారంభించబడిన ఆ ఆశ్రమం డొనేషన్లు లేక పతనావస్థకి చేరుకుంటోందని అర్థం చేసుకున్నాడు.

లోపలికెళ్ళి అక్కడ కూర్చుని వున్న సుమారు ముప్పయ్యేళ్ళుండే వ్యక్తికి ముందుగా తనని తను పరిచయం చేసుకుని శ్రీరామ్ తల్లికి సంబంధించిన వివరాలడిగాడు.

"సార్, అప్పటి సంగతులంటే మా నాన్నగారే చెప్పాలి. మీకేం అభ్యంతరం లేక పోతే కాస్త లోపలికొస్తే ఆయన్ని చూపిస్తాను. మంచం మీద నుండి లేవలేని పరిస్థితి ఆయనది."అన్నాడు.

వేణు అతడితో లోపలికెళ్ళాడు. అదో రకమైన కమురువాసన వస్తోంది అక్కడి పరిసరాలనుండి. కుక్కి మంచం మీద పడుకుని వున్నాడాయన.

కొద్దిదూరంలో వున్న చెక్క స్టూల్ ని మంచం దగ్గరగా లాగి వేణుని కూర్చోమని..తండ్రిని లేపి  పరిచయం చేసి అతడు వెళ్ళిపోయాడు."బాబూ! శారద  ప్రేమలో మోసపోయిన పిల్ల. కడుపుతో వుండగా ఈ ఆశ్రమపు తలుపు తట్టింది. తనని నా కన్న కూతురిలా చూసుకున్నాను. శ్రీరామ్ పుట్టాడు. శ్రీరామ్ కూడా తల్లిలాగానే మృదు స్వభావి. అతడు పెద్దవాడయ్యాక పట్నంలో ఏదన్నా ఉద్యోగం చూసుకోమని శారద పంపించింది. పోయిన సంవత్సరం అనారోగ్యంతో పిచ్చిది కన్నుమూసింది. తనవాళ్ళెవరో..ఎక్కడుంటారో ఎప్పుడూ చెప్పలేదు. అదిగో అది ఆమె పెట్టె" అని దూరంగా అల్మార మీద వున్న పెట్టె ని చూపించాడు.

వేణు వెళ్ళి దాన్ని తెరచి పరిశీలించాడు. లోపల రెండు చీరలు జాకెట్లు.. విబూది పొట్లాం.. శ్రీరామ్ ప్యాంటు షర్టు తప్ప ఏమీ లేవు.

నిరాశగా పెట్టె మూత వేసేయబోతున్నంతలో పెట్టె అడుగున వేసిన పేపరు కనిపించింది. దాన్ని తీశాడు ఆ పేపరు మడతలోంచి బయట పడిన ఫోటో చూసి ఆశ్చర్యపోయాడు. అందులో శారదా రఘునాధం వున్నారు. వేణుకి కేసు సాల్వ్ అయిపోయినంత ఆనందం కలిగింది.

ఆ ముసలాయనకి కృతజ్ఞతలు చెప్పి బయల్దేరాడు.

'తనకి ముందు ఎవరన్నా వచ్చి పెట్టె చూశారా?' అని అడిగుంటే మరో విషయం తెలిసుండేది వేణుకి. ఎంతటి ప్రొఫెషనల్స్ అయినా చిన్న చిన్న పొరబాట్లు చేస్తుంటారు.

************************************************************

'శారద రఘునాధాన్ని ప్రేమించి మోసపోయింది కాబట్టి. కొడుకుని ఆయన మీద కోపంతో విషనాగులా పెంచి..వాళ్ళింట్లో తిష్ట వేయించింది. అవకాశం రాగానే కస్సున కాటేశాడు.' ఆ ఆలోచనతో కేసుకి పట్టిన మబ్బులు విడిపోతున్నట్టుగా అనిపించింది.

సిటీకి రాగానే పోలీస్ ఇన్స్పెక్టర్ తో చెప్పి శ్రీరామ్ ని పోలీస్ స్టేషన్ కి పిలిపించాడు.

ఎన్ని రకాలుగా ప్రశ్నించినా శ్రీరామ్ నుండీ తనకు అనుకూలమైన సమాధానాలు రాబట్టలేకపోయాడు, చివరికి తన జేబులోంచి ఫోటో తీసి చూపించాడు. శ్రీరామ్ ఆశ్చర్యపోయాడు. అదెలా వేణు చేతికొచ్చిందని కాదు. ఫోటోలో తన తల్లిని రఘునాధం గారి పక్కన చూసి.

"ఇప్పుడు నిజం చెప్పు..మీ అమ్మని రఘునాధం గారు మోసం చేశారని. . తండ్రిగా ఆయన నీకేం చేయలేదని ఆయన్ని కసితో నువ్వు హత్య చేశావు కదూ" అన్నాడు.

కళ్ళ నీళ్ళతో దిగ్గున తలెత్తాడు." ఆయన దేవుడు. నిజంగా మీరు ఈ ఫోటో చూపించే వరకూ వాళ్ళిద్దరికీ సంబంధం వుందన్న విషయం నాకు తెలియదు. నన్ను మాత్రం రఘునాధం గారి అడ్రసు ఇచ్చి 'ఆయన చాలా మంచివారు ఎలాగైనా వాళ్ళింట్లో పనికి చేరమని' చెప్పి పంపింది మా అమ్మ. నేను వచ్చి ఆయన్ని పని అడగంగానే వెంటనే ఒప్పుకుని నన్ను కన్న కొడుకులా

చూసుకున్నారు. పెట్టిన చేతినే కాటేసే కసాయిని కాదు. అయినా హత్యలు చేసే రక్తం నాలో లేదు" అని కుమిలి కుమిలి ఏడ్చాడు. ఎన్ని విధాలుగా అడిగినా అదే సమాధానం. శ్రీరామ్ మాటల్లో నిజాయితీ ధ్వనిస్తోంది.

కేసు మళ్ళీ మొదటికొచ్చింది.

'ఆయన కొడుకుల్లో రెండోవాడు అనిరుధ్ అగ్రెసివ్. దొరికిన ప్రతి ఉద్యోగాన్నీ నోటి దురుసులోనో.. ఎదుటివాళ్ళ మీద చెయ్యెత్తడంలోనో పోగొట్టుకున్నాడు. తండ్రీ కొడుకుల మధ్య ఏవన్నా గొడవలున్నాయేమో? అవే ఆయన హత్యకి దారి తీశాయేమో.. కానీ తండ్రిని చంపుతాడా? ఏమో?' వేణు ఆలోచనలు పరి పరి విధాల సాగుతున్నాయి.అనిరుధ్ ని పోలీస్ స్టేషన్ కి పిలిపించుకున్నాడు.

అనిరుధ్ ప్రవర్తనని అతనికే ఒకసారి విశదీకరించి.."చెప్పు..మీ నాన్నని హత్య చేయడానికి కారణమేమిటో?" అన్నాడు. మిన్నాగు కాటేసినట్టుగా విలవిలలాడిపోయాడు. "సార్..ఎంత మాటన్నారు?..మా నాన్నంటే పంచ ప్రాణాలు. ఆయన్ని చంపడం కాదు కదా కనీసం ఒక్క సారైనా ఆయనకి ఎదురుచెప్పలేదు. ఎవరన్నా తప్పు చేస్తే సహించను..అది నా బలహీనత. నేను చెయ్యెత్తడంలో ఎక్కడన్న తప్పుంటుందేమో చూడండి." బాధగా అన్నాడు.

నిజమే! అతడికి షార్ట్ టెంపర్ అని ఉద్యోగం తీసేస్తున్నారు కాని జరిగిన ఏ సంఘటనలో అతని తప్పు కనిపించలేదు.

పెద్ద కొడుకు..ఊహూ.. అతని ప్రవర్తనా..కదలికలు..చెప్పే సమాధానాలు అనుమానాస్పదంగా ఏం లేవు. కోడళ్ళని కూడా ప్రశ్నించాడు. వాళ్ళూ కాదని రూఢీ అయింది. ఆయన భార్య? వాళ్ళిద్దరిదీ అన్యోన్య దాంపత్యం అని అందరూ చెప్పారు. ఎప్పుడూ గొడవ పడిన దాఖలా లేదు. అయినా ఆయన చనిపోయినప్పటి నుండి నిద్రాహారాలు మానేసిందావిడ. పోనీ బయట వాళ్ళా అంటే.. వేసిన తలుపులు వేసినట్టే వున్నాయి. ఇంట్లో వున్న సభ్యులు కాకపోతే ఎవరు? ఎవరు చంపారు? వేణు తలపట్టుకున్నాడు.

మొట్టమొదటి సారి వేణుకి ఛాలేంజ్‌గా అనిపించింది.

అనుమానం లేకపోయినా, కాదని తెలిసినా..ఆయన భార్యని ప్రశ్నించాలి..తప్పదు.

"అమ్మా..మీరే మీ ఆయన్ని చంపేశారని కొన్ని క్లూస్ తెలియజేస్తున్నాయి. దయచేసి మీరు ఒప్పుకుంటే.. మా పని సులువవుతుంది. లేదంటే.." ఆవిడ వంక చూశాడు.

ఆవిడ తలదించుకుని వుంది.

"అమ్మా..మిమ్మల్నే..నేను చెప్పింది విన్నారని నాకు తెలుసు.."మాటల్లో కాస్త కాఠిన్యం కలిపాడు.

"నేనే... నేనే ఆ రాక్షసుడిని చంపాను." ఆవిడ మాటకి.. వేణూతో సహా అందరూ షాక్ అయ్యారు. వేణూ చీకట్లో రాయేశాడు తప్ప..నిజానికి అతని దగ్గర ఏ క్లూస్ లేవు.

"ఎందుకు?"

"చెబుతాను.."

************************************************************

మాది అరెంజ్డ్ మ్యారేజ్.

ఆయన గవర్నమెంట్ ఉద్యోగి.. జీవితం సాఫీగా సాగిపోతుందని ఆయనకి నన్నిచ్చి పెళ్ళి చేశారు. తను నాకేం అన్యాయం చేయలేదు.. ఏ లోటు చేయలేదు.. కాని.. కానీ ఆయనకో బలహీనత వుంది. ఆయనో ఉమనైజర్. తన స్టాఫ్ లోని ఆడవాళ్ళని.. వాళ్ళ వాళ్ళ బలహీనతల్ని తన గుప్పిట్లో పెట్టుకుని లోబర్చుకునేవాడు. నాకు నెలలు నిండుతున్నప్పుడు సాయంగా వచ్చిన నా చెల్లెల్ని కూడా లోబర్చుకున్నాడు. విచిత్రమేమిటంటే ఇవన్నీ నాకు తెలియకుండా చాలా జాగ్రత్తగా మేనేజ్ చేసేవాడు. అందరితో మంచిగా వుంటూ.. సహాయ సహకారాలు అందిస్తుండడంతో ఆయన మంచితనాన్ని నా అదృష్టంగా భావించేదాన్ని. ఇల్లాలిగా పొంగిపోయేదాన్ని. కానీ ఒకసారి ఒక స్త్రీ ఆయన్ని కలవడానికి ఇంటికొచ్చింది. అదే మొదలు ఒక ఆడది ఆయన్ని

కలవడానికి ఇంటికి రావడం.     యాధృచ్ఛికంగా నాకు స్తంబం అడ్డుగా వుంది. ఆయన మొహంలో కలవరం..ఆపై కోపంతో జేవురించడం చూశాను. ఆయనలోని భిన్నమైన వ్యక్తిని చూసేసరికి హడలిపోయాను. ఎవరైనా వున్నారేమోనని చుట్టూ చూసి, ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక   "మా ఇంటికి రావద్దని    చెప్పానా.   చంపేస్తాను.. ఏమనుకున్నావో.. నువ్వెళ్ళు.. నేనే వీలైనప్పుడు వచ్చి కలుస్తాను." అని పంపించేశాడు

దాంతో ఆయన నిజ రూపాన్ని తెలుసుకోవాలని ఆయన ఊళ్ళో లేనప్పుడు ఆయనకి సంబంధించిన బీరువా మారు తాళాలతో తీయించి స్థాణువై పోయాను. మా ఆయనో నయవంచకుడు. ఒకరా.. ఇద్దరా ఎంతోమంది ఆయన కామ దాహానికి బలైపోయారు. అన్నీ చక్కగా ఒక పుస్తకంలో రాసుకున్నాడు. ఎవరితో ఏ రకమైన సుఖమందిందీ..వివరం.." చెబుతూ ఏడ్చేసింది. అలా చాలాసేపు ఏడ్చి.. ఏడ్చి.. మళ్ళీ ప్రారంభించింది. నేను ఒక్కో స్త్రీ దగ్గరకెళ్ళి నా భర్త చేసిన దురాగతానికి కాళ్ళు పట్టుకుని క్షమించమని వేడుకుని ఆయనలోని సగభాగంగా పాప ప్రక్షాళన చేసుకున్నాను.

ఇదిలా వుండగా మా ఇంట్లో పని చేయడానికి శ్రీరామ్ కుదిరాడు. శ్రీరామ్ కుదురైన అబ్బాయి. నాకైతే మూడో కొడుకే! అతనికి నిదానంగా మా ఇంట్లోని ఆస్తులు..నగలు..నగదు వివరాలు తెలుస్తున్నాయి. ఆ విషయాల్లో అతడిని ఎంతవరకూ నమ్మచ్చు? అని అతనికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి వాళ్ళమ్మ వుండే ఆశ్రమానికి వెళ్ళాను. వాళ్ళమ్మ చనిపోయిందని తెలిసింది. అయితే అక్కడున్న ఆవిడ పెట్టె గురించి తెలుసుకుని తెరిచి చూసి ఆశ్చర్యపోయాను. ఆ పెట్టెలో ఒక మూలగా వున్న ఫోటోలో... మా ఆయనతో శారద. అంటే ఇంట్లో పనివాడిగా వుంటున్నది ఆయన కొడుకే. ఇంటికొచ్చి శ్రీరామ్ ని అడిగాను వాళ్ళమ్మ 'మా ఆయన గురించి ఏవన్నా చెప్పిందా?' అని. ఏమీ చెప్పలేదన్నాడు. కాని 'ఆయన మంచివాడు..ఎలాగైనా ఆయనింట్లోనే పనికి కుదరమని' చెప్పిందట. బహుశా తన అనారోగ్యం గురించి ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడి, కొడుకుని తండ్రి ఇంటిలోనే కనీసం పనివాడిగానన్నా వుండేలా చేసింది. నిజంగా ఆమె దేవత. నా భర్త కిరాతకుడు.

అంతేకాదు నా చెల్లెలు పెళ్ళి చేసుకోనని ఇంట్లో మొరాయించింది, తన జీవితం నాశనమయిపోతోందని చివరికి మా నాన్న బలవంతంగా ఒక సంబంధాన్ని ఖాయం చేశాడు. అంతే అది ఉరేసుకుని చనిపోయింది. తర్వాత దానికి బాగా దగ్గరి స్నేహితురాలు నాతో విషయాలన్నీ వివరంగా చెప్పింది. నాతో నా భర్త విషయం చెబితే ఎక్కడ నా కాపురం కూలిపోతుందో అని తన జీవితాన్ని ముగించుకుంది అభం శుభం తెలియని పిచ్చిపిల్ల. ఆయనంటే అసహ్యం ఎక్కువ కాసాగింది. అది ఎంతంటే ఆయన ఉనికిని భరించలేనంత. ఈ మధ్య ఆయన వికృత చేష్ట పరాకాష్టకి చేరింది. రిటైరయ్యాడు కాబట్టి.. ఏదైనా వ్యాపకం వుండాలని.. కన్సల్టెన్సీ పెడదామనుకున్నాడు.     కాని అందులో పనిచేయడానికి పాతికేళ్ళ లోపు వయసున్న స్త్రీలే కావాలని పేపర్లో అడ్వర్టైజ్ మెంట్ ఇచ్చాడు. ఆయన వినాశకాలం విపరీతమవుతోంది. నాకేం చేయాలో పాలుపోవడం లేదు. స్త్రీల మీద మగాళ్ళ అకృత్యాలు ఎక్కువైపోయాయి. పసికందు అని లేదు..కన్న కూతురని లేదు..వావి వరసల్లేవు..వయసు తేడా లేదు. ఆడపిల్ల కనిపించిందంటే ఆబోతులైపోవడమే. పేపర్లలో కనిపిస్తున్న దారుణాలకి నేనెటువంటి పరిష్కారం చూపలేను. కాని నా ఇంట్లో తుదముట్టించగలననిపించింది. అందుకే తెల్లవారుఝామున మనసు దిటవుచేసుకుని ఆయన్ని చంపేశాను.అది బయట వాళ్ళు చేసిన పని అని నమ్మించడానికి తలుపులు బార్లా తీసిపెడదామనుకున్నాను. .కాని అప్పుడే నా పెద్ద కొడుకు వాకింగ్ కి లేచాడు.

నేను గబ గబ వెళ్ళి పడుకున్నాను. వాడు రోజూ వాళ్ళ నాన్నకి గుడ్ మార్నింగ్ చెప్పి వెళ్లడం అలవాటు.. అలాంటిది ఆయన ఎంతకి లేవకపోయేసరికి.. ఆయన చనిపోయిన విషయం తెలిసిపోయింది. నా మనసుకి ఒక కీచకుడు. .రావణుడు చనిపోతే ఎంత శాంతిగా వుంటుందో.. అలా వుంది. నేను తప్పు చేశానని కూడా అనిపించడం లేదు. కాని సమాజంలో ఇది నేరంగా పరిగణిస్తారు

కాబట్టి.. లొంగిపోతున్నాను. నాకు ఎటువంటి బాధ్యతలూ లేవు. ఈ వయసులో ఒక మంచి పని చేసి సమాజం నుండి నిష్క్రమిస్తున్నందుకు సంతోషంగా వుంది." అంటూ లొంగిపోయింది.

మొట్టమొదటిసారి వేణు కళ్ళలో కన్నీటిపొర కనిపించింది. ఇన్నాళ్ళూ కేసుల్లో కక్షలు..స్వార్థం.. ఆశ..ద్రోహం లాంటివి కనిపిస్తుండేవి..కాని నిష్కామంగా కామపిశాచికి కొన్ని జీవాలు బలికాకుండా కాపాడింది ఆవిడ. ‘తల్లీ..నీకు హేట్సాఫ్’ అని మనసులో అనుకున్నాడు. మొట్టమొదటిసారి కేసు ఆ రకంగా సాల్వ్ అయినందుకు బాధపడ్డాడు.




పూర్వం మర్పల్లి గ్రామంలో మణెమ్మ, మారయ్య దంపతులు నివసించే వారు. వారికి సంతానం లేక సకల దేవతలకు పూజలు పునస్కారాలు చేయసాగారు. రోజులు గడుస్తూ వున్నాయి. ఈడు మీరి పోతోంది. ఆందోళన అధికం సాగింది.

ఓ శుభ సమయాన ఆ ఊరి చివర జ్ఞానేశ్వరుడనే మునీశ్వరుడు బస చేసాడని తెలిసి అతడి దర్శనార్థం వెళ్ళారు. తమ బాధను వెల్లబోసుకున్నారు. ఆ దంపతులను చూడగానే జ్ఞానేశ్వరునికి వారి భవిష్యత్తు కాలం అంతా గోచరించింది. దానిని వారికి

వివరించాడు. అయినా వారు వెనుకంజ వేయలేదు.    ప్రత్యమ్నాయంగా మరో కోరిక కోరుకున్నారు. వారి కోరిక జ్ఞానేశ్వరునికి అమితమైన ఆశ్చర్యం కల్గించింది. వారి అభ్యర్థన మేరకు అనుగ్రహించక తప్పలేదు.

“అభీష్ట సిద్ధిరస్తు..” అని దీవించి వారికి ఒక మామిడి పండు ప్రసాదించాడు.

ఇంటికి వెళ్ళి అది ఆరగించిన వెంటనే మారయ్య దంపతులు జ్ఞానేశ్వరుడు చెప్పినట్లు గతాన్ని మర్చి పోయారు.

మణెమ్మ గర్భం ధరించింది.. వారి ఆనందానికి అవధులు లేవు.

పుట్టబోయే బిడ్డకు సకల సౌకర్యాలు కలిగించాలి అనే తపనతో మారయ్య అదనంగా కష్ట పడసాగాడు. మారయ్యకు ‘నా’ అన్న వాళ్ళు ఎవరూ లేరు.మణెమ్మకు చేదోడు వాదోడుగా విధవరాలైన తన అత్తగారు వరమ్మను పిలిపించాడు. మణెమ్మ భర్తకు కృతజ్ఞతలు తెలుపుకుంది.    మణెమ్మ పురుడు పోసుకుంది. పండంటి అబ్బాయికి జన్మనిస్తూనే భవిష్యత్తు కాలాన్ని జ్ఞానేశ్వరుడు వివరించినట్లుగా మణెమ్మ తనువు చాలించింది. అదే సమయంలో తన పుత్రుణ్ణి చూడకుండానే అడవిలో మారయ్య కట్టెలు కొడ్తూ ప్రమాదవశాత్తు కన్ను మూసాడు.    వరమ్మ ఆవేదన వర్ణణాతీతం.. కాని విధి రాతకు తల వంచక తప్పదు.. కాలం తన పని తాను చేసుకుంటూ వెళ్తోంది..

పుట్టుకతోనే తల్లి దండ్రులను కోల్పోయిన ఆ పసికందుకు లోకేశ్వర్ అని నామకరణం చేసింది వరమ్మ.

ఆ మరునాడు తెల్లవారు ఝామున పెరట్లోకి వెళ్ళిన వరమ్మ ఆశ్చర్యపోయింది..

అపురూపంగా పెనవేసుకొని వున్న రెండు చెట్లు కనపడ్డాయి. అందులో ఒక దానికి కొన్ని మామిడి పండ్లు మరొక దానికి ఒకే ఒక పనస పండు కాయడం విస్తుపోయింది.

దేవుడు తమకు బతుదెరువు చూపించాడని వరమ్మ సంబర పడింది.

పనస పండు కోస్తుంటే ఘల్లుమని ఒక బంగారు నాణెం పళ్ళెంలో పడింది. కాసేపు కొయ్యబారి పోయింది.. ఇదంతా తన మనుమని అదృష్టమని లోకేశ్వర్‌ను ఎత్తుకొని మురిసిపోయింది. నాణాన్ని కళ్ళకద్దుకుంది. దేవుని ముందు నాణెం దక్షిణ సమర్పించింది. రెండు మామిడి పండ్లు నైవేద్యం పెట్టి దీపారాధన చేసింది. జీవనయానం సాఫీగా సాగిపోతోంది..

లోకేశ్వర్ పెరిగి పెద్దవాడయ్యాడు. ఇంట్లో దినుసులు నిండుకునే సరికి చెట్టుకు పనస పండు ప్రత్యక్షమౌతోంది. దాన్ని కోస్తుంటే ఒక బంగారు నాణెం.. సరేసరి. మామిడి పండ్లు లేని రోజు లేనే లేదు.

వరమ్మ బంగారు నాణెం రహస్యం రహస్యంగా వుంచినా మామిడి పండ్ల వింత ఊరూరా పాకి పోయింది. జనం తండోపతండాలుగా వచ్చి చూడసాగారు.

ఒక రోజు జ్ఞానేశ్వరుడు మహాముని మనసునకేదో కీడు శంకించింది. వెనువెంటనే ఆనాడు తన దీవెనలు పొందిన మారయ్య దంపతుల కోరిక ఫలించినవైనాన్ని తిలకించడానికి లోకేశ్వర్ ఇంటికి వచ్చాడు.

ఆ సమయంలో గొడ్డలి ఎత్తి పనస చెట్టు మొదలంటా నరకడానికి సిద్ధంగా వున్నాడు లోకేశ్వర్. ఎప్పుడో అప్పుడు ఒకే ఒక కాయ కాసే పనస చెట్టు వుండి దండగ.. విరివిగా పూసే కాసే మామిడి చెట్టుకు అడ్డంకిగా వుంది అని ఈ నిర్ణయం తీసుకున్నాడు లోకేశ్వర్. వరమ్మకు కూడా చెప్పలేదు.

“నీ తండ్రి గారిని నరికేద్దామనుకుంటున్నావా బిడ్డా..! ” అన్నాడు జ్ఞానేశ్వర్ మహాముని.

ఎత్తిన గొడ్డలి తక్కున కింద పడవేసి ఆశ్చర్యపోయాడు లోకేశ్వర్. ఇంతలో వరమ్మ పరుగెత్తుకుంటూ వచ్చింది. వరమ్మ, లోకేశ్వర్‌లు మహాముని పాదాలపై పడ్డారు.

“అవును నాయనా ఆ మామిడి, పనస చెట్లు నీ తల్లిదండ్రులు” అంటూ గత వృత్తాంతాన్ని చెప్పసాగాడు..

“నీ తల్లిదండ్రులు ఆనాడు నావద్దకు వచ్చినప్పుడు వారి భవిష్యత్తు గురించి చెప్పాను. సంతానం యోగం వుంది.. ఒక పుత్రుడు పుడ్తాడు కాని వెనువెంటనే మీరిరువురు కాలగర్భంలో కలిసి పోతారు.. సంతానం వద్దనుకుంటే నిండు నూరేళ్ళు బతుకుతారు అని

వివరించాను. సంతు లేని జీవితం నిరర్థకం.. అని వారు పుత్ర వాత్సల్యంతో చావుకు సిద్ధపడ్డారు.. ”

వరమ్మ, లోకేశ్వర్‌లు గజ గజ వణుకుతూ కన్నీళ్ళు పెట్టుకోసాగారు.

జ్ఞానేశ్వరుడు కాసేపు మౌనముద్ర వహించి మళ్ళీ చెప్ప సాగాడు.

“ఆ పుణ్యదంపతులు ఒక కోరిక కోరారు. బిడ్డ పుట్టగానే వాడి బాగోగులు చూడకుండా మేము కన్ను మూస్తున్నాం కనుక మా పుత్రుని యెడల మా కర్తవ్యం నెరవేర్చుకోడానికి అవకాశం కలిగించుమని వేడుకున్నారు. ప్రతీ ఆత్మకు మరణం లేదు.. పాత వస్త్రాన్ని విడిచి నూతన వస్త్రాన్ని ధరించినట్లే ఆత్మ తన భౌతిక రూపాన్ని మార్చుకుంటుంది...

నేను దివ్య దృష్టితో చూశాను. మారయ్య మణెమ్మలు అడవిలో మ్రానులుగా జన్మించే అవకాశం వుంది. అది మారయ్య అడవిలో కట్టెలు కొట్టినందుకు పాపపరిహారం...

నేను నా తపశ్శక్తితో వారిని ఈ ఇంటిలో ఫలప్రద మ్రానులుగా ఉద్భవింపజేశాను. అవి తమ కన్న కుమారుని జీవితం మోడుబారకుండా కాపాడుకుంటున్నాయి.. వాని బాధ్యత త్వరలో తీరబోతోంది.. పునర్జన్మకు సన్నాహం చేసుకుంటున్నాయి..” అంటూ జ్ఞానేశ్వరుడు తన బసకు బయలుదేరుటకు సిద్ధమయ్యాడు.

“మునీశ్వరా.. నా తప్పిదనాన్ని మన్నించండి. నేను తెలియక ఒడిగట్టిన మహా పాపానికి పరిహారం చెప్పండి.. నా తల్లిదండ్రుల ఋణం తీర్చుకునే మార్గాన్ని సెలవియ్యండి” అంటూ కన్నీరుమున్నీరయ్యాడు లోకేశ్వర్.

జ్ఞానేశ్వరుడు మహాముని ప్రసన్నుడయ్యాడు.

“లోకేశ్వర్..! నీ పేరును సార్థకం చేసుకో.. లోకమంతా తిరుగుతూ ప్రజల చేత లక్షలాది మొక్కలు నాటించు. చెట్లు లేనిదే మనిషికి మనలేడని వివరించు. పర్యావరణాన్ని పరిరక్షించు. అలా లోక కళ్యాణ ప్రచారంతో నీ తల్లిదండ్రుల ఋణం తీర్చుకున్న వాడివి అవుతావు” అంటూ దీవించాడు జ్ఞానేశ్వర మహాముని.

“తమరి ఆజ్ఞ శిరసావహిస్తాను..” అంటూ కార్యోన్ముఖుడయ్యాడు లోకేశ్వర్. వరమ్మ ‘నేను సైతం’ అన్నట్లుగా మనుమని వెంట నడిచింది.




“వెలుగున్నప్పుడు అన్నీ కనిపిస్తాయి, వెలుగు ఉన్నా లేకపోయినా కనిపించేది హృదయం మాత్రమే”

అలాంటి హృదయం వాళ్ళకు ఉంది కాబట్టే , పాతికేళ్ళ వాళ్ళ వైవాహిక జీవితంలో ఎలాంటి అరమరికలూ లేవు. నిజంగా ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటల జీవితాలలో కూడా అంత సంతోషం కనిపించదేమో, అంత సంతోషంగా ఉండరేమో... కానీ మానస, రఘురామ్ లు ఇద్దరూ ఒకరిని మించి ఒకరు, ఒకరిమీద ఒకరు ప్రేమ చూపించుకునే వారు. కారణం ఒక్కటే, “ప్రేమించే గుణం వారిలో ఉండటం, దొరికినదానితో సంతృప్తి పడటం, జరిగేదంతా మన మంచికే అనుకోవడం.” భర్త ముఖం చూడనిదే నిద్ర లేచేది కాదు భార్య. భార్య అనుమతి లేనిదే బయటకి వెళ్లే వాడు కాదు భర్త.

“ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తుంటారు” అనే వాక్యాన్ని రఘురామ్ బాగా నమ్ముతాడు.అలానే “పతియే ప్రత్యక్ష దైవం” అనే వాక్యాన్ని బాగా నమ్ముతుంది మానస. వీరు నమ్మిన ఆ వాక్యాల్లోని భావాన్ని జీవితానికి అన్వయించుకొని చుట్టుపక్కల వాళ్ళలో, బంధువులలో ఆదర్శ దంపతులైపోయారు. ఏకంగా ఆ కాలనీలో వాళ్ళు

ఉత్తమ భార్య, ఉత్తమ భర్త అనే బిరుదులు కూడా ఇచ్చేశారు.

“బొట్టూకాటుక,పూవులు గాజులు,పసుపుకుంకుమలు ఒకజంట

సీతారాములు, శివ పార్వతులు, రాధాకృష్ణులు ఒకజంట....”

ఎక్కడో దూరంగా పాత పాట వినిపిస్తుంది. శక్తి సినిమా. భార్య భర్తల అన్యోన్యాన్ని తెలిపే ఆ పాట చాలా బావుంది. ఆ పాటలో “మానస రఘురామ్ లు ఒకజంట” అనే పదాలు కూడా చేరిస్తే ఇంకా బావుంటుంది అనిపిం చింది.సీతారాముల్లో, శివ పార్వతుల్లో, రాధాకృష్ణుల్లో అయినా లోపాలు ఉండవచ్చేమో, కానీ ... వీరి దాంపత్యంలో మాత్రం ఎలాంటి లోపాలు లేవనేది అందరి నమ్మకం. ఒకవేళ ఉన్నా సర్దుకుపోయే స్వభావం ఇద్దరిలోనూ ఉంది కాబట్టే అంత అన్యోన్యంగా ఉంటున్నారని ఆ కాలనీ వాసుల అభిప్రాయం.

*****

సంక్రాంతి .... అది అందరికి పెద్ద పండుగ

ఊరంతా సందడి సందడిగా ఉంది.

బూజులు దులుపుకోవడం, ఇల్లు కడుక్కోవడం,

పరిసరాలని, పశువులని శుభ్రం చేసుకోవడం,

అయిన వాళ్లందరికి, ముఖ్యంగా కొత్త అల్లుళ్ళకి పండక్కి రమ్మని కబురు పెట్టడం,

అప్పటికే వచ్చిన వాళ్ళంతా...

“పిన్ని బావున్నావా”, “బాబాయి బావున్నావా”,

“సీత ఎప్పుడు వస్తుంది”, “రాణి నెలతప్పిందట కదా”,

ఇంతకీ “అరిసెలు,చక్రాలువండావా!? మొత్తం మీరే తింటారా?! మాకేమన్నా పెడతారా?!” ఇలా పలకరింపుల తో, పులకరింపులతో ఆ కాలనీ అంతా కొత్త సొగసులు దిద్దుకుంది.

మానస,రఘురామ్ లు కూడా తొందరపడుతున్నారు.

ఇల్లంతా శుభ్రం చేసుకుంటున్నారు...

పిండి వంటలు వండుతున్నారు...

పాపం ఇద్దరే కదా ఎవరున్నారని చేయడానికి....

అలా అని ఎవరూ లేరని కాదు,

కొడుకు బెంగుళూరులో జాబు, కూతురు కూడా అక్కడే...

ఒకే కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు గా పనిచేస్తున్నారు. పండక్కని వాళ్ళు కూడా వస్తున్నారు. వాళ్ళ కోసమే మానస పిండి వంటలు చేస్తుంది. సిటీలో ఉద్యోగం చేసేవాళ్ళు కదా! సుఖానికి అలవాటు పడిన వాళ్ళు మరి ఈ చిన్న చిన్న ఇళ్ళలో సుఖంగా ఉంటారో ఉండరోనని వాళ్ళ కోసమే రఘురామ్ ఇల్లు శుభ్రం చేస్తున్నాడు. నిన్న మొన్నటి వరకు ఇక్కడే పెరిగారన్న

సంగతి మరచి...

“ఇల్లు శుభ్రం చేస్తున్న రఘురామ్ చెయ్యి తగిలి పైన ఎక్కడో ఉన్న పాత పుస్తకాల బస్తా ఒకటి పొరపాటున జారి క్రింద పడింది. తీసి పక్కన పడేద్దామనుకున్నాడు. కానీ అందులో మానస పేరు మీద ఉన్న ఉత్తరం రఘురామ్ కి కనిపించింది. రఘురామ్ తీసుకెళ్లి మానసకే ఇద్దామనుకున్నాడు. కానీ దాని మీద ఉన్న చేతిరాత ఎక్కడో చూసినట్టుగా అనిపించింది.... ఎందుకో చదవాలనిపించింది. అందులో ఏముందో తెలుసుకోవాలనిపించింది. ఉత్తరాన్ని చేతిలోకి తీసుకున్నాడు. ఎక్కడి నుంచి వచ్చిందోనని వెనక్కి తిప్పి చూశాడు.” గుండెపగిలినంత పనైంది. నిశ్చేష్టుడై పోయాడు. ఉత్తరం చదవడం మొదలుపెట్టాడు....*****

నా ప్రియమైన మానసకి,

నీ ప్రియమైన నేను , నీ నుంచి అంతులేని ప్రేమను ఎదురుచూసే నేను వ్రాయునది, ఇన్నాళ్ళు, ఇన్నేళ్లు... ఇన్నేళ్ల నా జీవితం నువ్వు లేకపోవడం వల్ల వ్యర్థమైంది. నీ గురించి వింటున్న ఆక్షణమే నా హృదయం ద్రవీభవించింది , నా ప్రాణానికి కూడా విలువుందని తెలిసింది. అమ్మ అప్పుడప్పుడు నన్ను తిట్టేది ఎందుకు పుట్టావురా నా కడుపున అని? అప్పుడు నాకార్థం కాలేదు, కానీ ఇప్పుడు తెలుస్తుంది నేను ఎందుకు పుట్టానో... నేను పుట్టింది నీ కోసమే, నా ఈ జీవితం నీ కోసమే. అవును ప్రియా! నన్ను నమ్ము. “ఈ భూమ్మీద అన్నిటికంటే దు:ఖకరమైన విషయం ఆడపిల్లగా పుట్టడం అంటారు.” కానీ అది నాకు వరం. ఎందుకంటే నువ్వు ఆడపిల్లగా పుట్టింది నాకోసమే... నా ప్రేమను అంగీకరించు. నీరూపం నాకు తెలియకపోవచ్చు, కానీ నిన్ను అపురూపంగా చూసుకుంటాను. అలా అని నిన్ను పూవుల్లో పెట్టి చూసుకుంటాను, దేవతలా పూజించుకుంటాను అని చెప్పను, కానీ నాకున్నంతలో మహారాణిలా చూసుకుంటాను. నీ గురించి విన్నప్పుడు జీవితంలో పెళ్లంటూ చేసుకుంటే నిన్నే చేసుకోవాలనుకున్నాను. నీ తోడుగా ఉండాలనుకున్నాను. నీ చూపు నా నవ్వుగా మారాలి, నా ఊపిరి నువ్వై పోవాలి, మనమిద్దరం ఒకటవ్వాలి. నిన్ను ఇంతవరకూ చూడలేదు ఇకపై కూడా చూడకపోతే నా చూపు ఎడారైపోతుంది. నీకు నా భావాలు తెలపకపోతే నా గుండె మోడైపోతుంది. అందుకే మా స్నేహితుని దగ్గర నీ చిరునామా తీసుకొని నేను నీకు మొదటిసారిగా ప్రేమలేఖ రాస్తున్నాను. చిరునామా తీసుకున్న వాడిని నీ ఫోటో కూడా తీసుకోవచ్చు. కానీ నీ మంచితనం తెలుసుకున్నాక ఆ మంచితనాన్నే నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. అందుకే నీ ఫోటో చూడటంలేదు. నువ్వు నా ప్రేమను ఒప్పుకుంటే పెళ్లి పీటల మీద మాత్రమే నిన్ను చూస్తాను. నువ్వు ఎలా ఉన్నా నేను నిన్ను పెళ్లి చేసుకుంటాను. నువ్వు చూడాలనుకుంటే నన్ను చూడొచ్చు. నువ్వు నా ప్రేమను అంగీకరిస్తే ఈ చిరునామాకి లేఖ రాయమని అర్థిస్తున్నాను. అది ప్రేమలేఖ అయితే నా ఊపిరికి ఊతమిచ్చినవాళ్లవుతారని ఆశిస్తున్నాను.

”“వసంత కాలంలో చెట్లు చిగురిస్తాయి అనే మాట ఎంత నిజమో! నీ గురించి వినగానే నా మనసు చిగురించిందనే మాట కూడా అంతే నిజం!”

“వసంతం ఏడాదికి ఒకసారే వస్తుంది.కానీ నువ్వు నాతో ఉంటే నాకు ప్రతీక్షణం వసంతమే…”

“ఏ పనీ పాట లేని నీకు పిల్లనెవరిస్తారురా?” అనే వాళ్ళకు

బంగారాన్ని పెళ్లి చేసుకున్నానురా! అని చెప్పే అవకాశం ఇస్తారని ఆశిస్తున్నాను.

ఈ దినం నుంచి అనుదినం… నా మదివనం…

నీ ప్రేమ కొరకు ప్రయాణం చేస్తుందని మనవి చేస్తూ

నిలువెల్లా కన్నులు చేసుకొని నిరీక్షిస్తూ …. నీ , నేను…”

*****

ఈ ప్రేమలేఖ చదవగానే రఘురామ్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తను ఎంతగానో నమ్మిన, ప్రేమించిన మానస ఇలా చేస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఇద్దరి మధ్య ఈ పాతికేళ్లలో ఎలాంటి దాపరికాలు లేవు. కానీ మానస తన దగ్గర ఈ విషయం ఎందుకు దాచిందో అర్థం కాలేదు. గుండు సూది కొనే దగ్గరి నుంచి గుడికి వెళ్లే వరకు తనకు చెప్పకుండా చేయని మానస, అంతులేని స్వేచ్ఛ ఇచ్చినా ఏ రోజూ దుర్వినియోగం చేయని మానస , మౌనంలో కూడా మహామహా భావాలను పలికించగల మానస మరి ఈ ప్రేమలేఖ విషయాన్ని తన మదిలోనే పాతికేళ్లు ఎలా పదిలంగా దాచుకోగలిగింది. శివుడు గరళాన్ని కంఠంలో దాచినట్టుగా తను కూడా ఈ గరళాన్ని తనలోనే ఉంచుకొని మదన పడకుండా, అలా అని బయటపెట్టకుండా కంఠంలోనే దాచుకుందా!? ఆడవాళ్ళకు నచ్చకపోతే మన్మథుడు వచ్చినా మనసంగీకరించదంటారు కదా! అంటే మానసకు ఇది గరళం కాదు అమృతం. అందుకే ప్రేమలేఖ ని కూడా పదిలంగా దాచుకుంది. అని లోలోపల మదన పడ్డాడు, వేదన పడ్డాడు.మానసను పిలిచి అడుగుదామనుకున్నాడు. కానీ ఏమని అడగాలి…ఎవర్నో ప్రేమించి నన్నెందుకు పెళ్లి చేసుకున్నావని అడగాలా?ఈ ప్రేమలేఖను ఇన్నాళ్ళు ఎందుకు పదిలంగా దాచుకున్నావని అడగాలా?

ఏ దాపరికాలు లేని మన మధ్య ఇది మాత్రం ఎందుకు దాచావని అడగాలా ?

ఏమని అడగాలో... ? ఎలా అడగాలో... ?

రఘురామ్ కి అర్ధం కావడంలేదు. కానీ అడగాలి... అదే...ఎలా ? ఎలా ? తనకు అర్ధం కావడంలేదు.

అడిగితే.... ఉత్తమ భర్తగా,ఉత్తమ భార్యగా, ఆదర్శ దంపతులుగా ఎలాంటి అరమరికలు లేక సాఫీగా సాగిపోతున్న వీరి జీవిత ప్రయాణంలో అన్నీ ప్రమాదాలే జరుగుతాయి. పెళ్లిడుకొచ్చిన పిల్లలు, పదిమందిలో లో ఉన్న గౌరవం, మర్యాద అన్నీ ఒక్కసారిగా కోల్పోవల్సి వస్తుంది. ఈ పాతికేళ్లలో మానస తనకు కానీ , తన కుటుంబానికి కానీ ఏ విషయంలోనూ లోటు చేయలేదు. అలాంటప్పుడు "గతాన్ని కావాలని తవ్వుకొని ఎందుకు తను బాధపడటం , మానసని బాధ పెట్టడం" అందుకే ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయాలను కున్నాడు.

*****

పిల్లలు వచ్చారు. వాతావరణం అంతా మారిపోయింది. ఆ ఇంటికి కొత్త కళ వచ్చింది. కానీ రఘురామ్ లో ముఖంలో కళ పోయింది. అందరూ ఎంతో సంతోషంగా ఉన్నారు. కానీ రఘురామ్ మనసును మాత్రం "ఆ ప్రేమలేఖ పురుగులా తొలిచేస్తుంది." అయినా పైకి సంతోషంగా ఉన్నట్టు నటిస్తున్నాడు. అతని తీరుని గమనించిన మానస విషయం ఏమిటో తెలుసుకోవాలని అడిగినా మాట దాటేశాడు రఘురామ్. భోగి తలకలు పోసుకున్నారు. పిల్లలిద్దరూ స్నేహితులని కలుద్దామని అలా ఊళ్ళోకి వెళ్లారు. మానస భర్తకు తలంటు తుండగా....

*****

సంక్రాంతిని తీసుకురావాలని సూర్యుడు తెగ సంబరపడిపోతున్నాడు అందుకే మరుసటి రోజుని పంపించడం కోసం ఆ రోజు చాలా త్వరగా గడిచిపోయింది. చీకటి పడింది. అందరూ పడుకున్నారు. మానస, రఘురామ్ కూడా... కానీ రఘురామ్ కి నిద్ర పట్టడం లేదు. అందుకే లోలోపల ఉన్న ఆ అనుమానాన్ని తొలగించుకోవాలనుకున్నాడు.

“మానస, ఎవరతను ?” అని ధైర్యం చేసి అడిగేశాడు.

“మానస విని, విననట్టుగా ఉంది... మళ్ళీ అడిగాడు రఘురామ్ ,”

“మానసా... నిన్నే ఎవరతను” అని మళ్ళీ అడిగాడు...

“అతనంటే ?” అడిగింది మానస...

“అదే... పాతికేళ్ళ క్రితం నీకు ప్రేమ లేఖ రాసి పేరు రాయకుండా “నీ నేను” అని వదిలేశాడే అతను?”

“ఓ... అందుకేనా మీరు అదోలా ఉన్నారు... ఆ లేఖ మీకు ఇన్నాళ్లకు దొరికిందన్నమాట...”

“అన్నమాట కాదు ... ఉన్నమాటే... చెప్పు ఇంతకీ ఎవరతను”

“అవును...పాతికేళ్ళ క్రితం రాసిన ప్రేమలేఖ అన్నారు కదా, అయినా...అది పాతికేళ్ళ క్రితం రాసిందని మీకెలా తెలుసు?”
రఘురాం లో మౌనం !....

“చెప్పండి !?”

“అది పాతికేళ్ళ క్రితం రాసిందని మీకెలా తెలుసు?”

“మన పెళ్ళయి పాతికేళ్ళయ్యింది కదా! ఇలాంటి ప్రేమ వ్యవహారాలన్నీ పెళ్ళికి ముందే ఉంటాయి కదా! అందుకే పాతికేళ్ళయ్యిందన్నాను.”“సరే చెప్పు ఎవరతను?”

కాసేపాగి...

“మీరే...” అని సమాధానం ... చెప్పింది.

“నేను అడిగేది. పాతికేళ్ళ క్రితం నీకు ప్రేమలేఖ రాసిన “నీ నేను” గురించి.”

“నేను చెప్పింది కూడా పాతికేళ్ళ క్రితం నాకు ప్రేమలేఖ రాసిన “నీ నేను” గురించే.”

“ ఆ “నీ నేను” మీరే కదా? మీరు కాదా?!”

“అయితే చెప్పండి ఈ క్షణమే నేను మిమ్మల్ని వదిలి నా రఘు దగ్గరికి వెళ్లిపోతాను.” అని మానస అనడంతో రఘుకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. కాని అలా ప్రశ్నించిన రఘురామ్ ని చూసి మానస ముళ్ళకంచెలో చిక్కుకు పోయిన మల్లెతీగలా విలవిలలాడి పోయింది.

“పాతికేళ్ళ క్రితం మీరు రాసిన ప్రేమలేఖని పదిలంగా దాచుకున్నందుకు మీరు ఇంత మదన పడుతున్నారే, మరి అదే పాతికేళ్ళ క్రితం మానస రాసిన ప్రేమలేఖలను మీరెలా దాచుకున్నారు. అందుకు నేను బాధపడటం లేదు, మానస మీద ఇంకా మీకు ప్రేమ ఉన్నందుకు, ఆ మానస నేనే అయినందుకు సంతోషపడుతున్నాను. మీకు ప్రేమలేఖ రాసిన మానస, మీరు పెళ్లి చేసుకున్న మానస ఇద్దరూ ఒకటే. ఆ విషయం మీకు ఇప్పుడే తెలిసింది. కాని నన్ను చూడకుండానే నాకు ప్రేమలేఖ రాసి అందులో పేరు రాయడం మరిచిపోయిన లేక కావాలనే రాయకుండా వదిలేసిన రఘు , నేను పెళ్లి చేసుకున్న రఘురామ్ ఇద్దరూ ఒకటే...”

“నాకోసమే పుట్టానన్న మీరు, నేను లేకుండా బ్రతకలేనన్న మీరు, బంగారాన్ని పెళ్లి చేసుకున్నానని చెప్పాలనుకున్న మీరు చివరకు పరిస్థితులకు తలవంచి మీ ఇంట్లో వాళ్ళు చూసిన సంబంధాన్ని చేసుకోవడానికి సిద్ధపడ్డారు. మీరు నాకు రాసిన లేఖలో కావాలంటే మీరు నన్ను చూడొచ్చు అని రాశారు. కాని చిరునామా మీ స్నేహితుడిది రాశారు. నేను మీకు మొదటి ప్రేమలేఖ రాయడానికి ముందే చూశాను, చూసిన తరువాతే రాశాను. మీ ఇంట్లో వాళ్ళు చూసిన సంబంధం అమ్మాయి ఎవరో కాదు మా పిన్నిగారమ్మాయి. చివరి నిముషంలో మీకు ఏ ఉద్యోగం, సద్యోగం లేదని పిల్లనివ్వనంటే అప్పుడు మా నాన్న గారితో జరిగిన

విషయం చెప్పి ఇంట్లో వాళ్ళని ఒప్పించి మిమ్మల్ని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాళ్ళు కాదనుకున్న సంబంధాన్ని మేము చేసుకు న్నందుకు మా వాళ్ళతో కానీ, నాతో కానీ మా పిన్ని వాళ్ళు మాట్లాడరు. మీ కోసం మా వాళ్ళనందరిని నేను వదిలేసుకో వలసిన పరిస్థితి నాకు ఏర్పడింది. అయినా మీ ప్రేమలేఖ చదివి, మిమ్మల్ని ప్రేమించి మీరే కావాలనుకుని ఇష్టపడి మరీ మిమ్మల్ని పెళ్లి చేసుకున్నాను."

"ప్రేమించడం, ప్రేమను సాధించడం… ఈ ప్రయాణం అంతా ముళ్లబాటలోనే సాగిపోతుంది, ఆ ప్రేమను సాధించుకున్న తరువాత బ్రతుకంతా పూలబాటే…" నాకు ఇన్నాళ్లూ పూలబాటలానే అనిపించింది కానీ మీరు ఇలా ప్రశ్నిస్తుంటే మొదటిసారిగా చివుక్కుమంది మనసు. ఎక్కడో హృదయాంతరాళాల్లో పదునెక్కిన ముల్లు పదిలంగా ప్రాణాన్ని తొలిచినట్టు…"

"మీరు నాకు రాసిన ప్రేమలేఖ ఇన్నేళ్ల తరువాత మీరే చదివినప్పుడు అంతులేని సంతోషంతో గంతులేస్తూ నాదగ్గరికి వచ్చి నన్ను గట్టిగా వాటేసుకొని, ఎత్తుకొని మీరు ప్రేమించిన మానస మీద పాతికేళ్లుగా కురిపించలేని ప్రేమ ఒక్కసారిగా కురిపిస్తారనుకున్నాను" కానీ ఇలా…నిలదీస్తారనుకోలేదు.

నన్ను పెళ్లి చేసుకున్నందుకు… నన్నే పెళ్లి చేసుకున్నందుకు మీకు సంతోషం ఉందో, లేదో నాకు తెలియదు. కానీ, "మానస నన్ను కాకుండా ఎవర్ని పెళ్లి చేసుకున్నా ఇలానే ఉండేది కదా!? ఆ ప్రేమలేఖ నేను కాకుండా ఇంకెవరు రాసినా ఇలానే దాచేది కదా?!" అనే ఆలోచన మిమ్మల్ని తొలిచేస్తుందని నాకు తెలుసు. "మీకు ప్రేమించడానికి ఒకరు కావాలి, పెళ్లి చేసుకోవడానికి ఒకరు కావాలి. ఉత్తమ భర్తైనా… మీరూ మగాడే కదా! మగ బుద్ధి పోనిచ్చుకోలేదు."

*****

రఘురామ్ కళ్ళల్లో కన్నీళ్ళు…

మానస కాళ్ళ మీదా అవే కన్నీళ్లు…

ఆ తరువాత వారిద్దరి మధ్య కౌగిళ్లు…

సూర్యుడి కిరణాలు పడిన వాకిళ్ళు...

సంక్రాంతి గొబ్బిళ్ళు...

ఒకరినొకరు అర్ధం చేసుకొని సర్దుకుపోతే ఆ జీవితాల్లో అనుక్షణం పండగ పరవళ్ళు...

"వెలుగున్నప్పుడు అన్నీ కనిపిస్తాయి, వెలుగు ఉన్నా లేకపోయినా కనిపించేది హృదయం మాత్రమే"

అలాంటి హృదయం వాళ్ళకు ఉంది కాబట్టే , పాతికేళ్ళ వాళ్ళ వైవాహిక జీవితంలో ఎలాంటి అరమరికలూ లేవు. నిజంగా ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటల జీవితాలలో కూడా అంత సంతోషం కనిపించదేమో, అంత సంతోషంగా ఉండరేమో... కానీ మానస, రఘురామ్ లు ఇద్దరూ ఒకరిని మించి ఒకరు, ఒకరిమీద ఒకరు ప్రేమ చూపించుకునే వారు. కారణం ఒక్కటే, "ప్రేమించే గుణం వారిలో ఉండటం, దొరికినదానితో సంతృప్తి పడటం, జరిగేదంతా మన మంచికే అనుకోవడం." భర్త ముఖం చూడనిదే నిద్ర లేచేది కాదు భార్య. భార్య అనుమతి లేనిదే బయటకి వెళ్లే వాడు కాదు భర్త.

"ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తుంటారు" అనే వాక్యాన్ని రఘురామ్ బాగా నమ్ముతాడు.అలానే "పతియే ప్రత్యక్ష దైవం" అనే వాక్యాన్ని బాగా నమ్ముతుంది మానస. వీరు నమ్మిన ఆ వాక్యాల్లోని బావాన్ని జీవితానికి అన్వయించుకొని చుట్టుపక్కల వాళ్ళల్లో, బంధువులలో ఆదర్శ దంపతులైపోయారు. ఏకంగా ఆ కాలనీలో వాళ్ళు ఉత్తమ భార్య, ఉత్తమ భర్త అనే బిరుదులు కూడా ఇచ్చేశారు.

"బొట్టూకాటుక,పూవులు గాజులు,పసుపుకుంకుమలు ఒకజంట

సీతారాములు, శివ పార్వతులు, రాధాకృష్ణులు ఒకజంట...."

ఎక్కడో దూరంగా పాత పాట వినిపిస్తుంది. శక్తి సినిమా. భార్య భర్తల అన్యోన్యాన్ని తెలిపే ఆ పాట చాలా బావుంది. ఆ పాటలో "మానస రఘురామ్ లు ఒకజంట" అనే పదాలు కూడా చేరిస్తే ఇంకా బావుంటుంది అనిపిం చింది.సీతారాముల్లో, శివ పార్వతుల్లో, రాధాకృష్ణుల్లో అయినా లోపాలు ఉండవచ్చేమో, కానీ ... వీరి దాంపత్యంలో మాత్రం ఎలాంటి లోపాలు లేవనేది అందరి

నమ్మకం. ఒకవేళ ఉన్నా సర్దుకుపోయే స్వభావం ఇద్దరిలోనూ ఉంది కాబట్టే అంత అన్యోన్యంగా ఉంటున్నారని ఆ కాలనీ వాసుల అభిప్రాయం.

*****

సంక్రాంతి .... అది అందరికి పెద్ద పండుగ

ఊరంతా సందడి సందడిగా ఉంది.

బూజులు దులుపుకోవడం, ఇల్లు కడుక్కోవడం,

పరిసరాలని, పశువులని శుభ్రం చేసుకోవడం,

అయిన వాళ్లందరికి, ముఖ్యంగా కొత్త అల్లుళ్ళకి పండక్కి రమ్మని కబురు పెట్టడం,

అప్పటికే వచ్చిన వాళ్ళంతా...

"పిన్ని బావున్నావా", "బాబాయి బావున్నావా",

"సీత ఎప్పుడు వస్తుంది", "రాణి నెలతప్పిందట కదా",

ఇంతకీ "అరిసెలు,చక్రాలువండావా!? మొత్తం మీరే తింటారా?! మాకేమన్నా పెడతారా?!" ఇలా పలకరింపుల తో, పులకరింపులతో ఆ కాలనీ అంతా కొత్త సొగసులు దిద్దుకుంది.

మానస,రఘురామ్ లు కూడా తొందరపడుతున్నారు.

ఇల్లంతా శుభ్రం చేసుకుంటున్నారు...

పిండి వంటలు వండుతున్నారు...

పాపం ఇద్దరే కదా ఎవరున్నారని చేయడానికి....

అలా అని ఎవరూ లేరని కాదు,

కొడుకు బెంగుళూరులో జాబు, కూతురు కూడా అక్కడే...

ఒకే కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు గా పనిచేస్తున్నారు. పండక్కని వాళ్ళు కూడా వస్తున్నారు. వాళ్ళ కోసమే మానస పిండి వంటలు చేస్తుంది. సిటీలో ఉద్యోగం చేసేవాళ్ళు కదా! సుఖానికి అలవాటు పడిన వాళ్ళు మరి ఈ చిన్న చిన్న ఇళ్ళలో సుఖంగా ఉంటారో ఉండరోనని వాళ్ళ కోసమే రఘురామ్ ఇల్లు శుభ్రం చేస్తున్నాడు. నిన్న మొన్నటి వరకు ఇక్కడే పెరిగారన్న సంగతి మరచి...

"ఇల్లు శుభ్రం చేస్తున్న రఘురామ్ చెయ్యి తగిలి పైన ఎక్కడో ఉన్న పాత పుస్తకాల బస్తా ఒకటి పొరపాటున జారి క్రింద పడింది. తీసి పక్కన పడేద్దామనుకున్నాడు. కానీ అందులో మానస పేరు మీద ఉన్న ఉత్తరం రఘురామ్ కి కనిపించింది. రఘురామ్ తీసుకెళ్లి మానసకే ఇద్దామనుకున్నాడు. కానీ దాని మీద ఉన్న చేతిరాత ఎక్కడో చూసినట్టుగా అనిపించింది.... ఎందుకో చదవాలనిపించింది. అందులో ఏముందో తెలుసుకోవాలనిపించింది. ఉత్తరాన్ని చేతిలోకి తీసుకున్నాడు. ఎక్కడి నుంచి వచ్చిందోనని వెనక్కి తిప్పి చూశాడు." గుండెపగిలినంత పనైంది. నిశ్చేష్టుడై పోయాడు. ఉత్తరం చదవడం మొదలుపెట్టాడు....*****

నా ప్రియమైన మానసకి,

నీ ప్రియమైన నేను , నీ నుంచి అంతులేని ప్రేమను ఎదురుచూసే నేను వ్రాయునది, ఇన్నాళ్ళు, ఇన్నేళ్లు... ఇన్నేళ్ల నా జీవితం నువ్వు లేకపోవడం వల్ల వ్యర్థమైంది. నీ గురించి వింటున్న ఆక్షణమే నా హృదయం ద్రవీభవించింది , నా ప్రాణానికి కూడా విలువుందని తెలిసింది. అమ్మ అప్పుడప్పుడు నన్ను తిట్టేది ఎందుకు పుట్టావురా నా కడుపున అని? అప్పుడు నాకార్థం కాలేదు, కానీ ఇప్పుడు తెలుస్తుంది నేను ఎందుకు పుట్టానో... నేను పుట్టింది నీ కోసమే, నా ఈ జీవితం నీ కోసమే. అవును ప్రియా! నన్ను నమ్ము. "ఈ భూమ్మీద అన్నిటికంటే దు:ఖకరమైన విషయం ఆడపిల్లగా పుట్టడం అంటారు." కానీ అది నాకు వరం. ఎందుకంటే నువ్వు ఆడపిల్లగా పుట్టింది నాకోసమే... నా ప్రేమను అంగీకరించు. నీరూపం నాకు తెలియకపోవచ్చు, కానీ నిన్ను అపురూపంగా చూసుకుంటాను. అలా అని నిన్ను పూవుల్లో పెట్టి చూసుకుంటాను, దేవతలా పూజించుకుంటాను అని చెప్పను, కానీ నాకున్నంతలో మహారాణిలా చూసుకుంటాను. నీ గురించి విన్నప్పుడు జీవితంలో పెళ్లంటూ చేసుకుంటే నిన్నే చేసుకోవాలనుకున్నాను. నీ తోడుగా ఉండాలనుకున్నాను. నీ చూపు నా నవ్వుగా మారాలి, నా ఊపిరి నువ్వై పోవాలి, మనమిద్దరం ఒకటవ్వాలి. నిన్ను ఇంతవరకూ చూడలేదు ఇకపై కూడా చూడకపోతే నా చూపు ఎడారైపోతుంది. నీకు నా భావాలు తెలపకపోతే నా గుండె మోడైపోతుంది. అందుకే మా స్నేహితుని దగ్గర నీ చిరునామా తీసుకొని నేను నీకు మొదటిసారిగా ప్రేమలేఖ రాస్తున్నాను. చిరునామా తీసుకున్న వాడిని నీ ఫోటో కూడా తీసుకోవచ్చు. కానీ నీ మంచితనం తెలుసుకున్నాక ఆ మంచితనాన్నే నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. అందుకే నీ ఫోటో చూడటంలేదు. నువ్వు నా ప్రేమను ఒప్పుకుంటే పెళ్లి పీటల మీద మాత్రమే నిన్ను చూస్తాను. నువ్వు ఎలా ఉన్నా నేను నిన్ను పెళ్లి చేసుకుంటాను. నువ్వు చూడాలనుకుంటే నన్ను చూడొచ్చు. నువ్వు నా ప్రేమను అంగీకరిస్తే ఈ చిరునామాకి లేఖ రాయమని అర్థిస్తున్నాను. అది ప్రేమలేఖ అయితే నా ఊపిరికి ఊతమిచ్చినవాళ్లవుతారని ఆశిస్తున్నాను.

""వసంత కాలంలో చెట్లు చిగురిస్తాయి అనే మాట ఎంత నిజమో! నీ గురించి వినగానే నా మనసు చిగురించిందనే మాట కూడా అంతే నిజం!"

"వసంతం ఏడాదికి ఒకసారే వస్తుంది.కానీ నువ్వు నాతో ఉంటే నాకు ప్రతీక్షణం వసంతమే..."

"ఏ పని పాట లేని నీకు పిల్లనెవరిస్తారురా?" అనే వాళ్ళకు

బంగారాన్ని పెళ్లి చేసుకున్నానురా! అని చెప్పే అవకాశం ఇస్తారని ఆశిస్తున్నాను.

ఈ దినం నుంచి అనుదినం...    నా మదివనం...

నీ ప్రేమ కొరకు ప్రయాణం చేస్తుందని మనవి చేస్తూ

నిలువెల్లా కన్నులు చేసుకొని నిరీక్షిస్తూ ....    నీ ,    నేను..."

*****

ఈ ప్రేమలేఖ చదవగానే రఘురామ్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తను ఎంతగానో నమ్మిన, ప్రేమించిన మానస ఇలా చేస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఇద్దరి మధ్య ఈ పాతికేళ్లలో ఎలాంటి దాపరికాలు లేవు. కానీ మానస తన దగ్గర ఈ విషయం ఎందుకు దాచిందో అర్ధం    కాలేదు. గుండు సూది కొనే దగ్గరి నుంచి గుడికి వెళ్లే వరకు తనకు చెప్పకుండా చేయని    మానస, అంతులేని స్వేచ్ఛ ఇచ్చినా ఏ రోజూ దుర్వినియోగం చేయని    మానస , మౌనంలో కూడా మహామహా భావాలను పలికించగల మానస మరి ఈ ప్రేమలేఖ విషయాన్ని తన మదిలోనే పాతికేళ్లు ఎలా పదిలంగా దాచుకోగలిగింది. శివుడు గరళాన్ని కంఠంలో దాచినట్టుగా తను కూడా    ఈ గరళాన్ని తనలోనే ఉంచుకొని మదన పడకుండా, అలా అని బయటపెట్టకుండా కంఠంలోనే దాచుకుందా!? ఆడవాళ్ళకు నచ్చకపోతే మన్మథుడు వచ్చినా మనసంగీకరించదంటారు కదా! అంటే మానసకు ఇది గరళం కాదు అమృతం. అందుకే ప్రేమలేఖ ని కూడా పదిలంగా దాచుకుంది. అని లోలోపల మదన పడ్డాడు, వేదన పడ్డాడు.మానసను పిలిచి అడుగుదామనుకున్నాడు. కానీ ఏమని అడగాలి...ఎవర్నో ప్రేమించి నన్నెందుకు పెళ్లి చేసుకున్నావని అడగాలా?ఈ ప్రేమలేఖను ఇన్నాళ్ళు ఎందుకు పదిలంగా దాచుకున్నావని అడగాలా?

ఏ దాపరికాలు లేని మన మధ్య ఇది మాత్రం ఎందుకు దాచావని అడగాలా ?

ఏమని అడగాలో... ? ఎలా అడగాలో... ?

రఘురామ్ కి అర్ధం కావడంలేదు. కానీ అడగాలి... అదే...ఎలా ? ఎలా ? తనకు అర్ధం కావడంలేదు.

అడిగితే.... ఉత్తమ భర్తగా,ఉత్తమ భార్యగా, ఆదర్శ దంపతులుగా    ఎలాంటి అరమరికలు లేక    సాఫీగా సాగిపోతున్న వీరి

జీవిత ప్రయాణంలో అన్నీ ప్రమాదాలే జరుగుతాయి. పెళ్లిడుకొచ్చిన పిల్లలు, పదిమందిలో లో ఉన్న గౌరవం, మర్యాద అన్నీ ఒక్కసారిగా కోల్పోవల్సి వస్తుంది. ఈ పాతికేళ్లలో మానస తనకు కానీ , తన కుటుంబానికి కానీ ఏ విషయంలోనూ లోటు చేయలేదు. అలాంటప్పుడు "గతాన్ని కావాలని తవ్వుకొని ఎందుకు తను బాధపడటం , మానసని బాధ పెట్టడం" అందుకే ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయాలను కున్నాడు.

*****

పిల్లలు వచ్చారు. వాతావరణం అంతా మారిపోయింది. ఆ ఇంటికి కొత్త కళ వచ్చింది. కానీ రఘురామ్ లో ముఖంలో కళ పోయింది. అందరూ ఎంతో సంతోషంగా ఉన్నారు. కానీ రఘురామ్ మనసును మాత్రం "ఆ ప్రేమలేఖ పురుగులా తొలిచేస్తుంది." అయినా పైకి సంతోషంగా ఉన్నట్టు నటిస్తున్నాడు. అతని తీరుని గమనించిన మానస విషయం ఏమిటో తెలుసుకోవాలని అడిగినా మాట దాటేశాడు రఘురామ్. భోగి తలకలు పోసుకున్నారు. పిల్లలిద్దరూ స్నేహితులని కలుద్దామని అలా ఊళ్ళోకి వెళ్లారు. మానస భర్తకు తలంటు తుండగా....

*****

సంక్రాంతిని తీసుకురావాలని సూర్యుడు తెగ సంబరపడిపోతున్నాడు అందుకే మరుసటి రోజుని పంపించడం కోసం ఆ రోజు చాలా త్వరగా గడిచిపోయింది. చీకటి పడింది. అందరూ పడుకున్నారు. మానస, రఘురామ్ కూడా... కానీ రఘురామ్ కి నిద్ర పట్టడం లేదు. అందుకే లోలోపల ఉన్న ఆ అనుమానాన్ని తొలగించుకోవాలనుకున్నాడు.

"మానస, ఎవరతను ?" అని ధైర్యం చేసి అడిగేశాడు.

"మానస వినీ, విననట్టుగా ఉంది... మళ్ళీ అడిగాడు రఘురామ్ ,"

"మానసా... నిన్నే ఎవరతను" అని మళ్ళీ అడిగాడు...

"అతనంటే ?" అడిగింది మానస...

“అదే… పాతికేళ్ళ క్రితం నీకు ప్రేమ లేఖ రాసి పేరు రాయకుండా “నీ నేను” అని వదిలేశాడే అతను?”

“ఓ… అందుకేనా మీరు అదోలా ఉన్నారు… ఆ లేఖ మీకు ఇన్నాళ్లకు దొరికిందన్నమాట…”

“అన్నమాట కాదు … ఉన్నమాటే… చెప్పు ఇంతకీ ఎవరతను”

“అవును…పాతికేళ్ళ క్రితం రాసిన ప్రేమలేఖ అన్నారు కదా, అయినా…అది పాతికేళ్ళ క్రితం రాసిందని మీకెలా తెలుసు?”
రఘురాం లో మౌనం !….

“చెప్పండి !?”

“అది పాతికేళ్ళ క్రితం రాసిందని మీకెలా తెలుసు?”

“మన పెళ్ళయి పాతికేళ్ళయ్యింది కదా! ఇలాంటి ప్రేమ వ్యవహారాలన్నీ పెళ్ళికి ముందే ఉంటాయి కదా! అందుకే పాతికేళ్ళయ్యిందన్నాను.”“సరే చెప్పు ఎవరతను?”

కాసేపాగి…

“మీరే…” అని సమాధానం … చెప్పింది.

“నేను అడిగేది. పాతికేళ్ళ క్రితం నీకు ప్రేమలేఖ రాసిన “నీ నేను”      గురించి.”

“నేను చెప్పింది కూడా పాతికేళ్ళ క్రితం నాకు ప్రేమలేఖ రాసిన “నీ నేను” గురించే.”

“ ఆ “నీ నేను” మీరే కదా? మీరు కాదా?!”

“అయితే చెప్పండి ఈ క్షణమే నేను మిమ్మల్ని వదిలి నా రఘు దగ్గరికి వెళ్లిపోతాను.” అని మానస అనడంతో రఘుకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. కానీ అలా ప్రశ్నించిన రఘురామ్ ని చూసి మానస ముళ్ళకంచెలో చిక్కుకు పోయిన మల్లెతీగలా విలవిలలాడి పోయింది.

“పాతికేళ్ళ క్రితం మీరు రాసిన ప్రేమలేఖని పదిలంగా దాచుకున్నందుకు మీరు ఇంత మదన పడుతున్నారే, మరి అదే పాతికేళ్ళ క్రితం మానస రాసిన ప్రేమలేఖలను మీరెలా దాచుకున్నారు. అందుకు నేను బాధపడటం లేదు, మానస మీద ఇంకా మీకు ప్రేమ ఉన్నందుకు, ఆ మానస నేనే అయినందుకు సంతోషపడుతున్నాను. మీకు ప్రేమలేఖ రాసిన మానస, మీరు పెళ్లి చేసుకున్న మానస ఇద్దరూ ఒకటే. ఆ విషయం మీకు ఇప్పుడే తెలిసింది. కానీ నన్ను చూడకుండానే నాకు ప్రేమలేఖ రాసి అందులో పేరు రాయడం మరిచిపోయిన లేక కావాలనే రాయకుండా వదిలేసిన రఘు , నేను పెళ్లి చేసుకున్న రఘురామ్ ఇద్దరూ ఒకటే…”

“నాకోసమే పుట్టానన్న మీరు, నేను లేకుండా బ్రతకలేనన్న మీరు, బంగారాన్ని పెళ్లి చేసుకున్నానని చెప్పాలనుకున్న మీరు చివరకు పరిస్థితులకు తలవంచి మీ ఇంట్లో వాళ్ళు చూసిన సంబంధాన్ని చేసుకోవడానికి సిద్ధపడ్డారు. మీరు నాకు రాసిన లేఖలో కావాలంటే మీరు నన్ను చూడొచ్చు అని రాశారు. కానీ చిరునామా మీ స్నేహితుడిది రాశారు. నేను మీకు మొదటి ప్రేమలేఖ రాయడానికి ముందే చూశాను, చూసిన తరువాతే రాశాను. మీ ఇంట్లో వాళ్ళు చూసిన సంబంధం అమ్మాయి ఎవరో కాదు మా పిన్నిగారమ్మాయి. చివరి నిముషంలో మీకు ఏ ఉద్యోగం, సద్యోగం లేదని పిల్లనివ్వనంటే అప్పుడు మా నాన్న గారితో జరిగిన విషయం చెప్పి ఇంట్లో వాళ్ళని ఒప్పించి మిమ్మల్ని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాళ్ళు కాదనుకున్న సంబంధాన్ని మేము చేసుకు న్నందుకు మా వాళ్ళతో కానీ, నాతో కానీ మా పిన్ని వాళ్ళు మాట్లాడరు. మీ కోసం మా వాళ్ళనందరిని నేను వదిలేసుకో వలసిన పరిస్థితి నాకు ఏర్పడింది. అయినా మీ ప్రేమలేఖ చదివి, మిమ్మల్ని ప్రేమించి మీరే కావాలనుకుని ఇష్టపడి మరీ మిమ్మల్ని పెళ్లి చేసుకున్నాను.”

“ప్రేమించడం, ప్రేమను సాధించడం… ఈ ప్రయాణం అంతా ముళ్లబాటలోనే సాగిపోతుంది, ఆ ప్రేమను సాధించుకున్న తరువాత బ్రతుకంతా పూలబాటే…” నాకు ఇన్నాళ్లూ పూలబాటలానే అనిపించింది కానీ మీరు ఇలా ప్రశ్నిస్తుంటే మొదటిసారిగా చివుక్కుమంది మనసు. ఎక్కడో హృదయాంతరాళల్లో పదునెక్కిన ముల్లు పదిలంగా ప్రాణాన్ని తొలిచినట్టు…”

“మీరు నాకు రాసిన ప్రేమలేఖ ఇన్నేళ్ల తరువాత మీరే చదివినప్పుడు అంతులేని సంతోషంతో గంతులేస్తూ నాదగ్గరికి వచ్చి నన్ను గట్టిగా వాటేసుకొని, ఎత్తుకొని మీరు ప్రేమించిన మానస మీద పాతికేళ్లుగా కురిపించలేని ప్రేమ ఒక్కసారిగా కురిపిస్తారనుకున్నాను” కానీ ఇలా...నిలదీస్తారనుకోలేదు.

నన్ను పెళ్లి చేసుకున్నందుకు... నన్నే పెళ్లి చేసుకున్నందుకు మీకు సంతోషం ఉందో, లేదో నాకు తెలియదు. కానీ, “మానస నన్ను కాకుండా ఎవర్ని పెళ్లి చేసుకున్నా ఇలానే ఉండేది కదా!? ఆ ప్రేమలేఖ నేను కాకుండా ఇంకెవరు రాసినా ఇలానే దాచేది కదా?!” అనే ఆలోచన మిమ్మల్ని తొలిచేస్తుందని నాకు తెలుసు. “మీకు ప్రేమించడానికి ఒకరు కావాలి, పెళ్లి చేసుకోవడానికి ఒకరు కావాలి. ఉత్తమ భర్తైనా... మీరూ మగాడే కదా! మగ బుద్ధి పోనిచ్చుకోలేదు.”

*****

రఘురామ్ కళ్ళల్లో కన్నీళ్ళు...

మానస కాళ్ళ మీదా అవే కన్నీళ్లు...

ఆ తరువాత వారిద్దరి మధ్య కౌగిళ్లు...

సూర్యుడి కిరణాలు పడిన వాకిళ్ళు...

సంక్రాంతి గొబ్బిళ్ళు...

ఒకరినొకరు అర్థం చేసుకొని సర్దుకుపోతే ఆ జీవితాల్లో అనుక్షణం పండగ పరవళ్ళు...




“మానాన్న కు అమ్మ కాబట్టి నాకు నానమ్మ అయ్యింది. మా అమ్మకు అమ్మ కాకపోయినా అమ్మలా చూసుకునే ది కనుక నాకు అమ్మమ్మ కూడా అయ్యింది. కాని ఏమాటకామాట చెప్పుకోవాలంటారు... అందుకే చెప్తున్నా ఆవిడ నాకు నానమ్మా కాదు! అమ్మమ్మా కాదు ....! నాన్న + అమ్మ. నాకు అన్నీ తానే.... ఇప్పుడు నాకున్న అన్నిటా తానే...”

“ఆవిడకి ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. అందరికీ పెళ్లిళ్లు చేసింది. ముగ్గురు కొడుకుల్లో మానాన్న పెద్దవాడు. నేనొక్కడినే మనవడిని. వంశాన్ని నిలబెట్టే వారసుడిననో, ఆ వంశంలో పుట్టిన మొదటివాడిననో... తెలియదు కాని నేనంటే మా నానమ్మకు అంతులేని ప్రేమ. నన్ను మాత్రం నేల మీద నడవనిచ్చేది కాదంట... ఎప్పుడూ ఎత్తుకునే తిప్పేదట. ఇప్పుడంటే ఏదో కాస్త చదువుకొని ఉద్యోగం చేసుకుంటూ సమయానికి నాలుగు మెతుకులు కడుపులో వేసుకుంటూ కాస్త ఆరోగ్యంగా ఉన్నా... కాని చిన్నప్పుడెప్పుడూ రోగాలేనట. నానమ్మ భుజాన వేసుకొని ధర్మాసుపత్రికి పరిగెత్తేదట. అవన్నీ నాకు జ్ఞాపకం లేవు కాని చేసిన ఇంజక్షన్ లు మాత్రం జ్ఞాపకం ఉన్నాయి. నాకోసం ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపిందట. నాకోసం ఎన్నో ఉపవాసాలు చేసి పస్తులుండేదట. గుళ్ళు, గోపురాలు, చెట్లు, పుట్టలు... నేను బావుండాలని ఎందరు దేవుళ్ళకో మొక్కేదట.” అవన్నీ తెలియదు కాని “జ్వరమొచ్చి పడుకున్నప్పుడు దేవుని కుంకుమ నుదుటిమీద పెట్టి గుండెలకు హత్తుకున్న క్షణాలు మాత్రం గుండెచప్పుడులా ఇప్పటికీ నన్ను అంటి పెట్టుకునే ఉన్నాయి.”

“అందరికీ జొన్న బువ్వ పెట్టి నాకు మాత్రమే వరి అన్నం పెట్టేదట. ఒక్కమాటలో చెప్పాలంటే ఆవిడకు నేను ప్రత్యేకం... నేనే ఆవిడకు లోకం...”

*****

ఆరనీకు మా ఈ దీపం కార్తీక దీపం ... చేరనీ నీ పాద దీపం కర్పూర దీపం ...."

మా నానమ్మ పాడే పాట ఇది. ఎప్పుడూ ఈ పాట మా నానమ్మ నోట్లో నానుతూ ఉంటుంది. కార్తీక మాసం వచ్చిందంటే చాలు చన్నీటి స్నానాలు... కోనేటి దీపాలు... కార్తీక సోమవారాలు ... ఉపవాసాలు ... అబ్బో ఎప్పుడూ హడావుడిగా ఉండేది. అంత హడావుడిలో కూడా నన్ను మాత్రం నిర్లక్ష్యం చేసేది కాదు. అన్నీ జ్ఞాపకం లేవు కానీ కొన్ని కొన్ని అలా హృదయ ఫలకం మీద లిఖించబడిపోయాయి. "ఆ రోజు కార్తీక సోమవారం రెండు మామిడి అంట్లు తీసుకొచ్చి ఇంటి దగ్గర ఒకటి, తోటలో ఒకటి... నాచేయి, చెల్లి చేయి పట్టుకొని తనే నాటింది." ఎందుకు నానమ్మ ఇవి... అంటే మీకోసమే నాన్న... పెద్దైనాక దీనికి కాయలు కాస్తాయి. అప్పుడు మీరు వాటిని కోసుకొని తినొచ్చు. భలే రుచిగా ఉంటాయి అని చెప్పిందట. మొక్కలు నాటిన జ్ఞాపకం ఉంది కానీ అప్పుడు మాట్లాడిన మాటలు మాత్రం జ్ఞాపకం లేవు.తోటలో నాటిన మొక్కకి రోజూ తాతయ్య వెళ్ళి నీళ్ళు పోసేవాడు. ఇంటి దగ్గర నాటిన మొక్కకి నానమ్మే నీళ్ళు పోసేది. కడుపున పుట్టిన బిడ్డల్లా ఎంత బాగా చూసుకునే వారో మామిడి మొక్కల్ని....

కాలం గడిచిపోతుంది. మేము ఎదుగుతున్నాం... మాకు తెలియకుండానే మా శరీరంలో ... మా మనసులో ... మా ఆలోచనా విధానంలో మార్పులు సంభావిస్తున్నాయి. మొక్కల్లో కూడా.... అది మాకు తెలుస్తుంది.

నాటినప్పుడు పసిపాపలా ఉంది. ఇప్పుడు పరిగెత్తే పాపాయిలా ఉంది. కాస్త గాలి తోలిందంటే చాలు ఓ... ఓ... ఓ... అంటూ ఊగిపోతుంది. నీకు నడకొచ్చిన మొదట్లో ఎలా అయితే చెంగుచెంగున పరిగెత్తే వాడివో అలా ఊగి పోతోంది రా...! ఇది. అని దానికి నిలువాటి వెదురు గుంజ ఒకటి పాతి దానికేసి కట్టారు. ఎందుకు మామ్మా ఇలా... అంటే పెద్దయ్యాక తెలుస్తుందిలేరా అని నన్ను ఎత్తుకొని అక్కడి నుంచి బయటకు తీసుకెళ్లింది. పాపం అప్పటి నుంచి అది ఎదిగే వరకూ అలానే ఉండిపోయింది.

***

ఎదుగుతున్న, ఎదిగిన మొక్కల్ని..... అభివృద్ధి చెందుతున్న మనం రోడ్లకు, బిల్డింగులకు, ఫ్యాక్టరీలకు, అపార్టు మెంట్లకు... అడ్డుగా వస్తున్నాయని నిర్దయగా నరికేస్తున్నాం. పక్కింటివాళ్ల మీద కోపాన్ని, ఎదురింటి వాళ్ళ మీద కోపాన్ని చెట్ల మీద పుట్ల మీద జంతువుల మీద చూపించడం సహజంగా జరుగుతుండే విషయమే.... మాకూ అదే జరిగింది.

మాకు, మాకు సంబంధించిన వేరే వాళ్ళకు ఊళ్ళో గొడవ జరిగింది. వాళ్ళు మమ్మల్ని ఏమీ చేయలేకపోయా రు. అందుకే మేము తోటలో పెంచుకునే మామిడి మొక్కను నరికేశారు. ఎవరో చెప్తే మాకు ఆ విషయం తెలిసింది. మా నానమ్మ ఏడ్చుకుంటూ పరిగెత్తిన విషయం నాకు బాగా జ్ఞాపకం. నాకు తెలిసి మా నానమ్మ నన్ను వదిలి వెళ్ళడం అదే మొదటిసారనుకుంట. వెనకే మావాళ్లు అందరూ వెళ్లారు. నన్ను కూడా తీసుకెళ్లారు.

ఏ కొమ్మకాకొమ్మ విడదీశారు... చిందరవందరగా పడేశారు... మొదలు సగం వరకు నరికేశారు... మామీద ఉన్న కోపాన్ని పచ్చని మొక్క మీద పచ్చిపచ్చిగా చూపించారు. నానమ్మ హృదయం ముక్కలైంది. గుండె కన్నీటి సంద్ర మైంది. ఎంతగా ఏడ్చిందో... నరికిన వాళ్ళకు ఎన్ని శాపనార్థాలు పెట్టిందో... వాళ్ళ అంతు చూసే వరకు నిద్రపోనని మంగమ్మ శపథాలు చేసింది.

ఏడ్చి... ఏడ్చి... వాటన్నింటిని మోపు కట్టి ఇంటికి తీసుకొచ్చారు. శవాన్నైతే ఊరి బయటికి తీసుకెళ్తారు, కానీ చెట్టుకదా ఇంటికి తీసుకొచ్చారు. దానితో పాటే ఇంటి దగ్గర నాటిన మామిడి చెట్టు మొదట్లో.... నరికిన కొమ్మల్ని తీసుకొచ్చి పడేశారు. మానానమ్మ ఎందుకు ఏడ్చిందో, ఎందుకు వాటిని తీసుకొచ్చి అక్కడ పడేసిందో అప్పుడు నాకర్థం కాలేదు. పెళ్ళయి ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత మా చెల్లెలు చనిపోతే ఆ శవాన్ని నాముందుకు తెచ్చినప్పుడు అర్థమ య్యింది. ప్రేమలు, ఆప్యాయతలు, ఆఖరి చూపులు మనుషులకే కాదు మానులకీ ఉంటాయని....

“నానమ్మ రాత్రుళ్లు నిద్రపోయేది కాదు... ఒక్కోరోజు అన్నం కూడా తినేది కాదు... నానమ్మది మంగమ్మ శపథం అనుకున్నాను, కాదు అది పేగు బంధం. కన్న బిడ్డను కసాయి వాడు కత్తికోకండగా కర్కశంగా నరికేస్తే... ఒక తల్లి పడే వేదన అది. కడుపులో ఉన్న పిండాన్ని ఖండఖండాలుగా నరికినప్పుడు కంసుడిని ఏమీ చేయలేక దేవకి పడిన వేదన అది. కానీ నానమ్మ దేవకి కాదు అందుకే తన బిడ్డను పొట్టన పెట్టుకున్న వాళ్ళను పట్టుకొని, పెద్దమనుషులకు అప్పగించే వరకూ నిద్రపోలేదు. పెద్ద మనుషులు సమస్యను పరిష్కరించే దిశగా వాళ్ళకు తప్పేస్తే ఆ డబ్బులు తీసుకో కుండా వాళ్ళ చేత తోటలో ఐదు మొక్కలు నాటించి... ఐదు నెలలపాటు నీళ్ళు పోయించి... పోయిన మొక్కకు బదులుగా ఈ ఐదు మొక్కలను పెంచి ఇవ్వమని అడిగింది. దాదాపుగా ఈ విషయం మీద వారం రోజుల పాటు పంచాయతీ జరిగింది. వారం రోజుల తరువాత నానమ్మ ప్రశాంతంగా నిద్రపోయింది.”

*****

“నరికిన కొమ్మలన్నీ ఈ వారం రోజుల్లో ఎండిపోయాయి. చెట్టు మొదట్లో ఉన్న ఆ ఎండిన కొమ్మల్ని తీసుకొస్తూ నానమ్మ మామిడి చెట్టువైపు చూసింది. అప్పటి వరకు ఉన్న పూత, పిందెగా మారడాన్ని చూసి నానమ్మ మళ్ళీ కన్నీటి పర్యంతమైనది. మా వెంకటలచ్చిమి అమ్మమ్మ ఎదిగిన కొడుకు దూరమైతే ఆవిడ పడిన దు:ఖం నాకు మా నానమ్మ లో కనిపించింది. పాపిష్టోళ్లు

పొట్టన పెట్టుకోకుండా ఉంటే ఈ చెట్టు కూడా కాయలు కాసేది. వాళ్ళ పుణ్యమాని పోయిలోకి పుల్లలుగా మారింది. ఎదురు గుంజలు పాతి, వాటికి కట్టి, చుట్టూ కంచె వేసి, రోజు నీళ్ళు పోసి, రెక్కలు ముక్కలు చేసుకొని పెంచితే .... అన్నప్పుడు నాకర్థమయ్యింది. వేగంగా వీచే గాలిని తట్టుకొని మొక్క ఎదగాలంటే ఏదో ఒక ఆధారం కావాలి. ఆ ఆధారమే ఎదురు గుంజలు. ఎప్పుడో అడిగిన ప్రశ్నకు ఇప్పుడు సమాధానం దొరికింది."

"మనిషి చస్తే పూడ్చడానికి, కాల్చడానికి తప్ప దేనికీ పనికిరాడు. అదే మొక్కలైతే బ్రతికితే ఫలిస్తాయి, ఫలాలి స్తాయి. చస్తే ఇలా... పనికొస్తాయి అంటూ పోయిలో పెట్టి నాకోసం పులగం బువ్వ వండింది."

*****

ఉదయం లేచే సరికి అందరూ హడావుడిగా ఉన్నారు. అమ్మ, పిన్ని వాళ్ళు క్యారేజి కడుతున్నారు. పారలు, గడ్డ పారలు, తట్టలు... బాబాయిలు రెడీ చేస్తున్నారు. పసుపు, కుంకుమ, అగరువత్తులు, కొబ్బరికాయలు... అన్నీ నానమ్మ రెడీ చేస్తుంది. నేను పిన్ని దగ్గరికి వెళ్ళి....

"ఏంటీ... అంతా హడావుడిగా ఉన్నారు" అని అడిగితే

అందరం చేలోకి వెళ్తున్నం అన్నారు."

"ఏ చేలోకి..."

"నీకు తెలియదులే..."

"నాకు తెలియని చేనేముంది..."

"నీకు తెలియదని చెప్పాను కదా.... అరిపించకు"

అంతలోనే నానమ్మ

“వాడికి తెలియకపోవడమేమిటి... అన్నీ తెలుసు తెలియకపోతే వాడికే చెప్పాలి కదా! రేపు ఇదంతా వీడిదే కదా!!!”

“నేను మీ కోసం కొన్న మూడు ఎకరాల్లో ఈ రోజు మామిడి తోట వేస్తున్నాం నాన్నా...! అందరం అక్కడికే వెళ్తున్నాం. నువ్వు కూడా తొందరగా బయలుదేరు... రేపు నువ్వే ఈ తోటను చూసుకోవలసింది. అర్థమయ్యిందా!!”

మొత్తం మీద వారం తరువాత తోట ఒకరుపాన్ని సంతరించుకుంది.

*****

ప్రతిరోజూ నేను స్కూలుకి వెళ్ళడం... నానమ్మ తోటకి వెళ్ళడం... నేను స్కూల్ నుంచి వచ్చాక ఎప్పటికో నానమ్మ వచ్చేది. వచ్చి స్నానం చేయడం, ఒకముద్ద అన్నం తిని పడుకోవడం ఇదే నానమ్మ నిత్యకృత్యం అయ్యింది. ఒక్కోరోజు నేను పడుకున్నాక వచ్చేది. అలా ఒకే ఇంట్లో ఉన్నా నానమ్మకు నాకు దూరం పెరగడం మొదలైంది. క్రమంగా..., మాష్టారు చెప్పే చదువుల్లో నేను ... నానమ్మ చేసే పనుల్లో మామిడిలోట ... ఎదిగిపోయాం.

*****

“మొదటికాపు చేతికొచ్చింది. నానమ్మ పడిన కష్టం ఫలించింది. బాగానే కాసిందట అందరూ అంటుంటే నేనూ వింటున్నాను. చదువు తప్ప నాకేమి తెలియదు. కానీ నానమ్మ ఇదంతా నీదేరా... నువ్వే జాగ్రత్తగా చూసుకోవాలి అంటుంటే అప్పుడేమీ తెలియలేదు కానీ ఇప్పుడనిపిస్తుంది. నేనెలా చూసుకోవాలి, అసలు నాకు తోట ఎటుందో కూడా తెలియదు. ఎప్పుడు తీసుకెళ్లమన్నా నువ్వెందుకు తోటలోకి... నోరుమూసుకొని స్కూల్ కి వెళ్ళు అనే వాళ్ళు. అలాంటిది నేనెలా ఇదంతా చూసుకోగలను అందుకే ఆరోజు నోరుమూసుకొని స్కూల్ కి వెళ్లకుండా నోరుతెరచి అడిగాను. ఇదంతా నేను చూసుకోవాలంటే అసలు తోట ఎక్కడ ఉందో, ఎలా ఉందో నాకు తెలియాలి కదా అన్నాను. నాన్న మాట వినకుండా నానమ్మ అ రోజు నన్ను కూడా తోటకు తీసుకెళ్లింది. ఆ తోటను చూస్తే మాటలు రాలేదు. ఆ క్షణం అడుగు కదల్లేదు. అసలు నేను ఎక్కడ ఉన్నానో

నాకర్థం కాలేదు. నాకు ఆ చెట్టుకు ఆకులు కనిపించలేదు అన్నీ కాయలే... విరగ కాసింది. నిండు నెలలతో ఉన్న స్త్రీ మూర్తి నా కన్నుల ముందు సాక్షాత్కరించిందా ?! అనిపించింది."

*****

ప్రతిరోజూ ఇంట్లో గొడవలు .... కోడళ్లలో ఒకరికొకరికి పడేది కాదు ... వాళ్ళ గొడవలతో విసిగిపోయిన నానమ్మ అందరికీ ఇళ్ళు కట్టించి వేరు కాపురాలు పెట్టించింది. అన్నీ పంచుకున్నారు. నానమ్మ పెంచిన తోటతో సహా...!

కలిసుండి విడిగా ఉన్న వాళ్ళంతా.... విడిపోయి కలిసుంటున్నారు. కావాలని నానమ్మను, తాతయ్యను వేరు చేశారు. అమ్మ మాత్రం దగ్గరకు తీసుకుంది. నానమ్మకు నాతోనే ఎక్కువ ఉండాలని ఆశ. ఇన్నాళ్ళు మా కోసం కష్టపడిన నానమ్మకు కాస్త సుఖాన్ని అందించాలనుకున్నాం. అంతలోనే మాయదారి రోగం నానమ్మతో స్నేహం చేయటం మొదలుపెట్టింది. కొద్దికాలంలోనే తనతో పాటు నానమ్మను కూడా దేవుని దగ్గరకు తీసుకెళ్లింది.

*****

నానమ్మ పెంచిన మామిడి తోట ఎలా ఉందో తెలియదు. తోటను కడుపున పుట్టిన బిడ్డలా చూసుకున్న నానమ్మ ఎక్కడికెళ్లిందో తెలియదు. కాలం మారిపోతుంది. కాలంతో పాటే మనుషులూ మారిపోతున్నారు. మేమూ మారిపోయాం. ఉద్యోగాలతో ఊళ్లోదిలి వెళ్లిపోయాం ... నానమ్మ మమ్మల్ని వదిలేసి వెళ్ళినట్లుగానే మేమూ తోటనొదిలేసి వెళ్లిపోయాం... నానమ్మ నామీద పెట్టుకున్న ఆశల్ని అడియాసలు చేస్తూ అవసరాలకి అనుగుణంగా ఊసరవెల్లిలా రంగులు మార్చుకుంటూ నానమ్మ పెంచిన తోటని అమ్మేసి, వచ్చిన డబ్బును బ్యాంకుల్లో దాచేసి ఏసి రూముల్లో చల్లదనాన్ని కొనుక్కుంటూ జీవితాన్ని శ్మశానం వైపు నడిపిస్తున్నాం."

"ఏ పెళ్ళికో, పేరంటానికో, చుట్టాలనో, స్నేహితులనో చూడటానికో వెళ్లినప్పుడు మా మనసుల్లాగానే పాడుబడిన మా ఇంటికి వెళ్ళినప్పుడు 'నానమ్మనాటినమామిడిచెట్టు'ను చూసి రెండు కన్నీటి చుక్కలు రాల్చి బరువైన హృదయాలతో భారంగా అక్కడినుంచి వెళ్లిపోతాం. బయటికి వెళ్ళాక విలువల్ని మరిచిపోయి యాంత్రిక జీవితాల్లో యధావిధిగా మునిగిపోతాం..."

నానమ్మ వెళ్లిపోయింది ఈ లోకం నుంచి... మేమూ వెళ్లిపోయాం మా ఊరి నుంచి... కానీ నానమ్మ నాటిన మామిడి చెట్టు మాత్రం

అలానే మిగిలిపోయింది... తనవారికోసం... ఒంటరిగా....




ఆమె నవ్వింది.

గలగలా గోదారిలా -

ఉరకలెత్తే జలపాతంలా -

మెల్లగా - మనోహరంగా - తెరలు తెరలుగా - అలలు అలలుగా

అదే అమాయకత్వం

అలా గలగలా నవ్వగలిగే అదృష్టం ఎందరికుంటుంది?

రాజి       మళ్ళీ నవ్వింది - మెల్లగా మెలమెల్లగా - విరిసీ విరియని గులాబిలా - ముత్యాల పలువరుస తలుక్కుమనేలా--

ఆ నవ్వే కదా నన్నిలా ఫ్లాట్ చేసింది.

ఆమె       ముందు       మౌనిలా నిలబెట్టేసింది.

మాట రాని మూగవాడిలా నన్ను కట్టిపడేసింది - గత ఏడాదిగా

ఇంతకీ ఆమె ఏమడిగింది?

" మాధవ్!       నన్ను పెళ్ళిచేసుకుంటావా?"

ఎంత సింపుల్ గా అడిగింది.

ఎంత అమాయకంగా అడిగింది - ఎలాంటి సంకోచం లేకుండా

స్ట్రైట్ గా అడిగేసింది. అడిగేసి అంతే నిర్మలంగా నవ్వేసింది.

ఒక్క క్షణం నివ్వెరపోయాను.

"ఏం మాధవ్!       ఏమంటావు? మన కొలిగ్స్; చుట్టుపక్కలవాళ్ళు ఆల్రెడీ డిసైడయిపోయారు. పెళ్ళెప్పుడని అడుగుతున్నారు."

మళ్ళీ అదే చెదరని నవ్వు - చెదిరిన ముంగురులను సవరించుకుంటూ –

ముక్కుసూటితనం ... గలగల మాటలు....కలుపుగోలుతనం ...తనెక్కడున్నా సందడే సందడి.

* * *

" మాధవ్ గారూ! ఈవిడ ఈ రోజే జాయిన్ అయ్యారు. మీ పక్క సీట్లో కూర్చోమన్నారు మేనేజర్ గారు " మా కొలీగ్ ఇంట్రడూస్ చేశారు.

వెను తిరిగి చూశాను.

"గుడ్ మార్నింగ్ సార్! నా పేరు రాజీ ...రాజేశ్వరి ! " ముకు ళిత హస్తాలతో - చక్కని చిరు నవ్వుతో ఓ అందాలరాశి ఎదురుగా -

చిలక పచ్చని చీరలో మెరుపు తీగ లా –

పదహారణాల తెలుగుదనం ఉట్టిపడేట్లు చక్కని అవయవ సౌష్టవంతో పోతపోసిన విగ్రహం లా -

బ్రహ్మదేవుడు చాలా జాగ్రత్తగా, నేర్పుగా, ఓర్పుగా తీర్చిదిద్దిన శిల్పంలా -

అచ్చం బాపు బొమ్మలా –

క్షణం పాటు రెప్పవాల్చడం మర్చిపోయాను.

"హాయి ! వెల్కం ప్లీజ్. బి సీటెడ్ " అన్నాను తేరుకొని,

అద్భుతమైన సౌందర్యం !!! ఇరవై ఏండ్లు కూడా నిండినట్లు లేదు. కాలేజ్ నుండి ఇప్పుడే బయటపడినట్లుంది.

సీట్లో పొందికగా కూర్చొంది.

"ఫ్రెష్ అప్పాయింట్మెంటా?" అడిగాను.

"అవును సార్. ఫస్ట్ అప్పాయింట్మెంట్."

"ఫైన్. చాలా అర్లీగా జాబ్ సంపాదించినట్లున్నవే !" అన్నాను.

"యస్ సార్! డిగ్రీ ఫైనల్ మొన్ననే రాశాను."

తర్వాత వాళ్ళ పారెంట్స్ ను పరిచయం చేసింది.

వాళ్ళు కూడా నాతో అట్టే కలిసి పోయారు.

అద్దెకు ఇల్లు చూసిపెట్టమన్నారు.

ఇంతలో కనకయ్య టీ తీసుకొచ్చాడు. వాళ్ళకూ ఇప్పించి కనకయ్య కు ఆ పని పురమాయించాను.

కనకయ్య మా ఆఫీస్ కు కాఫి, టీ సప్లై చేస్తుంటాడు. ఆ వూర్లోనే పుట్టి పెరిగాడు. ఏదో చిన్న వ్యాపారం చేస్తుంటాడు.

ఏడాది క్రితం నేను జాయిన్ ఇనప్పుడు వాళ్ళ ఇంటి ప్రక్కనే నాకు రూం చూసి పెట్టాడు. ఆ చిన్న వ్యాపారానికి చేదోడు వాదోడుగా; మా ఆఫీస్ కు కాఫి, టీ సప్లై చేయడానికి నేనే పురమాయించాను. దానికి తోడు పార్టీస్ కు; ఫంక్షన్స్ కు అతని చేత నే చే యిం చే వాడిని. తక్కువ ఖర్చుతో క్వాలిటి మైంటైన్ చెయ్యడంవల్ల మా ఆ ఫీస్ లో అందరికి బాగా నచ్చింది. దానికి తోడు నేను బ్యాచ్లర్ అవ్వడంవల్ల నాకు భోజనం చేయమని చెప్పి ఒక చిన్న మెస్ లాంటిది ఏర్పాటు చేశాను. నా ఒక్కడితో ప్రారంభమైన మెస్ ఇప్పుడు సుమారు 15-20 కోసం నడుస్తోంది. అందుకే అతనికి నేనంటే గురి. సెలవుల్లో; ఆదివారాల్లో నా కాలక్షేపం కనకయ్యే.కనకయ్య కు నా మాటంటే వేదం. సాయంత్రానికల్లా వాళ్ళ ఇంటి ప్రక్కనే ఓ ఇల్లు అద్దెకు రెడి చేశాడు. దగ్గరుండి వాళ్ళకు కావాల్సిన ఏర్పార్ట్ లు చూశాడు. ఆ రాత్రి మెస్ లోనే భోంచేశాం.

ఏర్పాట్లు చూసి చాలా మురిసిపోయారు రాజి అమ్మానాన్నలు. పోటీ పడి మరీ థాంక్స్ చెప్పారు. వాళ్ళు ఊహించని రీతిలో ఏర్పాట్లు చక చకా జరిగిపోయే సరికి చాలా ఆనందపడిపోయారు.

'థాంక్స్ మాధ వ్ గారు! ఇంత తొందరగా మాకు అన్ని ఏర్పాట్లు చాల చక్కగా చేయించారు. ఇంతకీ మీకు మంచి శిష్యుడే దొరికాడు. " రాజి నవ్వుల మధ్య అంటుంటే ; మా వాడికి సందు దొరికింది నన్ను పొగడడానికి.

అలా మొదలెడితే మా వాడికి అద్దు అదుపు ఉండదు. ఎంత వారించినా నోరు మూతపడదు. నేను రాకముందు అతని పరిస్థితి; నేను చేసిన సాయం ఇంతకు అంత చెప్పడం మొదలెట్టాడు. ఎంతో మంది ఉన్నా నాలాగా హెల్ప్ చేసింది ఎవరూ లేరట.

అంతా చెప్పాక, “ మీకెలాంటి సాయం కావాలన్నా అడగండి. మొహమాటం పడకండి సార్ లాగా” అని అభయం కూడా ఇచ్చేశాడు.అతని దృష్టిలో నాకు చాల మొహమాటం. అదీ నిజమే.

రాజేశ్వరి మంచి బ్రిలియంట్. ఏకసంధ్యాగ్రాహి. ఏ పనైనా నిమిషాల్లో చేసేసేది. అనతి కాలంలోనే పనిలో నైపుణ్యం సంపాదించి

పై అధికారుల ప్రశంసలు అందుకొంది. ఆఫీసులో ఎక్కువ సేపు గడిపేది. ఎవరే పని చెప్పినా కాదనకుండా చేసేది.

ఆఫీసులో సీటు, ఇళ్ళు ప్రక్కప్రక్కనే కావడం వల్ల ఆఫీసుకు పోవడాలు, రావడాలు కలిసే చేసేవాళ్ళం. నాకు ఆఫీసుకు అర గంట ముందు, ఆఫీసు ఐన తర్వాత అరగంట ఉండే అలవాటు. పెండింగ్ వర్క్ అటెండ్ అయ్యేవా ణ్ణి. ఆమెక్కూడా అదే అలవాటయ్యింది. ఆఫీసు సర్కులర్స్, డి పార్ట్ మెంట్ టెస్ట్ లకు కలిసే చదివేవాళ్ళం. అలా మిగతా కొలీగ్స్ కన్నా నా దగ్గర చనువు పెరిగిందావిడకు.

మేము జూనియర్లవడం; మిగతా వారంతా చాలా సీనియర్లవడం వలన అప్పుడప్పుడు వారి పన్లు కూడా మా కప్పగించేవారు. అవి పూర్తిచేయడానికి లేట్ సిటింగ్స్ అలవాటయింది. నాతో పాటూ ఆమె ఉండేది - పని నేర్చుకోవడానికి

ఇక కుటుంబ విషయానికొస్తే, ఆ ఇంట్లో రాజేశ్వరే చిన్న అమ్మాయి. ఆమెకు ఒక అక్క, ఒక అన్న ఉన్నారు. ఇద్దరూ చదువుకొంటున్నారు. తండ్రికి ఈమధ్యే హార్ట్ ప్రాబ్లంతో ప్రైవేట్ ఉద్యోగం మానేశాడు. లక్కీగా అదే సమయంలో ఈమెకు ఈ ఉద్యోగం రావడం ఆ కుటుంబానికి ఎంతో ఊరట. ప్రస్తుతానికి ఆమె కుటుంబానికి ఆమె జీతమే జీవనాధారం.

కుటుంబానికి చిన్నపిల్ల కాబట్టి వాళ్ళింట్లో అందరికీ ముద్దే. ఇంట్లో ఏకైక సంపాదనాపరురాలయి నప్పటి నుంచి మరీను. వాళ్ళమ్మయితే కాళ్ళు కింద పెడితే కందిపోతుందేమో అన్నంత అపురూపంగా చూసుకునేది. రాజీ పరిస్థితి కూడా ఇంచుమించు అలాంటిదే ... చాలా సున్నితం - శారీరకంగా, మానసికంగా కూడా -

ఆమెకు అన్ని రంగాల్లోనూ మంచి అవగాహన ఉంది. పైగా సివిల్ కు ప్రిపేర్ అవుతోంది. మా మాటల్లో రాజకీయాలు, సంగీతం, సాహిత్యం, సినిమాలు ...ఒకటేమిటి అన్నీ చోటుచేసుకునేవి. ఆమెకు అవగాహన లేని సబ్జెట్ అంటూ ఏమీ లేదు. ఏ టాపిక్ పైనైనా అనర్గళంగా మాట్లాడగలదు. అభిప్రాయాలు నిర్ధిష్టంగా, ఖచ్చితంగా ముక్కుకు సూటిగా ఉండేవి. ఇక మా ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలొస్తే టైమే తెలిసేది కాదు. తన వాదనలో పస తగ్గినప్పుడు చూడాలి ఆమె ఉడుకుమోత్తనం! వెనక్కు తగ్గడం చాలా వరకూ నా వంతే అయ్యేది. ఇంత చిన్న వయసులో అంత తెలివితేటలుండడం నిజంగా అమోఘమే!

నాకు షేక్స్పియర్ అంటే ఇష్టం. ఆమెకు మిల్టన్ అంటే ఇష్టం. నాకు ఘంటసాల అంటే ఇష్టం. ఆమెకు బాలు అంటే ఇష్టం. నాకు ఆత్రేయ అంటే ఇష్టం. ఆమెకు వేటూరంటే ప్రాణం. మా వాదన ప్రతివాదనలు ఏ పదిన్నర, పదకొండు వరకో సాగేది. చుట్టుప్రక్కల వారికి కూడా మంచి కాలక్షేపం. భోంచేసి ఎనిమిదన్నర, తొమ్మిదింటికో మాఇంటి ముందు ఆరు బయట పెద్ద

అరుగు మీది కొచ్చేసేవారు. హాయిగా మంచి కాలక్షేపం చల్లని గాలిలో ... వెన్నెల వెలుగుల్లో . రోజుకో టాపిక్. పాటలు, అంత్యాక్షరి చాలా హుషారుగా పాల్గొనేవారు. టైమే తెలిసేది కాదు.

చివరికి మా జంటను చూసి చాలా మంది అపోహ పడే స్థాయికి వెళ్ళిపోయింది.

ఒకరోజు కనకయ్య అన్నాడు - "మీరిద్దరూ ప్రే మించుకుంటున్నారని అందరూ అనుకొంటున్నారు."

ఒక్కసారిగా ఉలిక్కిపడి - "అలాంటి దేమీ లేదు" అన్నాను.

"తప్పేముంది. ఇద్దరూ చూడ ముచ్చటగా ఉన్నారు. ఒకే ఆఫీసులో పని చేస్తున్నారు. ఇద్దరి అభిరుచులు దాదాపు ఒకటే. ఆలోచించండి. అమ్మాయితో మాట్లాడమంటే మాట్లాడుతాను."

"నో ...నో..."

"ఎందుకు? ఆ ఫీ సులో కూడా అందరూ అనుకొంటున్నారు. మీరిద్దరూ పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని ... మేడ్ ఫర్ ఈచ్ అదర్ లా ఉంటారని ... "

"నాకలాంటి ఆలోచనేదీ లేదు కనకయ్యా!"

"పర్వాలేదు. ఇప్పుడైనా ఆలోచించండి. మంచి అమ్మాయి. అందానికి అందం... గుణానికి గుణం. మంచి ఉద్యోగం. పైగా మీరంటే ప్రేమ. ఎవడో తన్నుకుపోక ముందే చెప్పండి!" అన్నాడు.

"అంటే..."

"అంటే ఏముంది! అయినా ఇందులో ఆలోచించడానికేముంది? సలక్షణమైన పిల్ల. వంకర పెట్టడానికేమీ లేదు. ఎవడైనా కళ్ళకద్దుకొని చేసుకొంటాడు. నాక్కూడా మీ జంట బాగుంటుందనిపిస్తోంది"

కనకయ్య మాటలు నాలో పెను దుమారమే రేపింది.

ఇంతవరకు నాకలాంటి ఆలోచ నే లేదు.

మేమిద్దరం ఎన్నెన్నో మాట్లాడుకొన్నాం కానీ, ఇలాంటి టాపిక్ మా మధ్య ఎప్పుడు రాలేదు.

ప్రశాంతంగా ఉన్న చెరువులోకి రాయి విసిరి అలలు సృష్టించాడు కనకయ్య.

అతను చెప్పినట్లు కాదనడానికి కూడా ఎలాంటి కారణం లేదు.

అన్నీ బాగున్నాయి కాని ...? ప్రేమ...పెళ్ళి ల గూర్చి చాలా ఆలోచించాలి.

ప్రేమయితే ఇద్దరు చాలు.ఐతే పెళ్ళి విషయానికి వచ్చేసరికి చాలా చాలా ఆలోచించాలి. నా పరిస్థితులు వేరు.

నా కుటుంబ పరిస్థితులు ఆమె పరిస్థితులకు బిన్నమేమీ కాదు.

ఇంటికి పెద్దద కొడుకుగా - నలుగురి చెల్లెళ్ళ బాగోగులు చూసుకోవలసిన బాధ్యత నా పై ఉంది. నాన్న పోయి ఐదేళ్ళయింది. అమ్మను చూసుకోవాలి. అందర్నీ అలా వదిలేసి నా స్వార్థం చూసుకోలేను. నేనే వారికి ఆధారం. వారికి దారి చూపాల్సిన బాధ్యత నాకుంది. బాధ్యత పూర్తయ్యేంత వరకు ప్రేమ... పెళ్ళి ల జోలికి పోదలుచుకో లేదు.

ఎడతెరిపి లేని ఆలోచనలతో ఆ రాత్రంతా నిద్ర కరువయింది.

ఉదయం ఏడు గంటలకే రాజీ వాళ్ళమ్మ "నీతో కొంచం మాట్లాడాలి" అంటూ ఇంటికొచ్చింది.

వాళ్ళింటి పరిస్థితి, వాళ్ళాయన అనారోగ్యం, మిగతా పిల్లల చదువుల గూర్చి చెప్పుకొచ్చింది. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా సహాయం చేయమని ప్రాధేయపడింది. రాజీ చిన్న పిల్ల. మొండిది. ఎలాగైనా సామరస్యంగా, సున్నితంగా పరిష్కరించమని వేడుకొంది. ఆమె పరిస్థితి అర్థం చేసుకోతగ్గదే. ఆలోచించి ఎవరికీ ఇబ్బంది లేని పరిష్కార మార్గాన్ని సూచించాను. వెళ్తూ వెళ్తూ "థాంక్స్" చెప్పి వెళ్ళిందామె తృప్తిగా . మేం మాట్లాడుతున్నంత సేపు కనకయ్య అక్కడక్కడే తారట్లాడడం నా దృష్టి దాటిపోలేదు.

"నాకు విజయవాడ ట్రాన్స్ ఫర్ అయింది. వెంటనే రిలీవ్ చేయమని హెడ్డాఫీస్ ఆర్డర్స్. రేపు రిలీవ్ చేస్తారట." అంది రాజీ.

"కంగ్రాట్యులేషన్స్. నీ బాధలు చాలా వరకు తగ్గుతాయి."

"ఎందుకు"

"అందరూ కలిసి ఒకటిగా ఉండొచ్చు. మీకు ఖర్చులు తగ్గుతాయి."

"అంటే"

"అక్కడొక ఫ్యామిలీ ... ఇక్కడొక ఫ్యామిలీ మైంటెనెన్స్ కష్టం కదా! ఇప్పుడు అందరూ కలిసి ఉండొచ్చు. హాపియే కదా! "

"నాకు లేదు"

ఎందుకు"

"ఇక్కడి వాతావరణాన్ని, మిమ్మల్నందర్నీ వదిలి వెళ్ళడాని కిష్టం లేదు." ఋంగమూతి పెట్టింది.

"జాబ్ అన్న తర్వాత ట్రాన్స్ ఫర్స్ తప్పనిసరి రాజీ! మన కిష్టం ఉన్నా లేకున్నా తప్పదు" అనునయిస్తూ అన్నాను.

ఆమె కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

"జీవితమంటే అదే రాజీ ! అంతా మనమనుకున్నట్లు; మనం చెప్పినట్లు జరుగవు. ఎదురు చూడనివి, ఎదురు దెబ్బలు తప్పవు." " అయితే పోక తప్పదా?" అంది చిన్న పిల్లలా

"ఉద్యోగం కావాలంటే తప్పదు. మధ్య తరగతి జీవితాలంటేనే సర్దుబాట్లు" ఓదార్చాను.

రెన్నిమిషాల మౌనం తర్వాత - "మీనుంచి నా కింకా సమాధానం రా లేదు" అంది రాజేశ్వరి .

"ఏం సమాధానం"

"అదే మన పెళ్ళి విషయం"

నేనేం చెప్పాలో అర్థం కాక మౌనంగా ఉండిపోయాను - క్షణం పాటు .

"మౌనంగా ఉంటే ఏమనుకోవాలి. అర్థాంగీకారమా? లేక ..."

" రాజీ ! మనం కొంచెం మనసు విప్పి మాట్లాడుకోవాలి !" అన్నాను.

" చెప్పు" అంది.

"మనం ప్రాక్టికల్ గా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఒక విధంగా మనిద్దరం ఒకే పడవలో ప్రయణిస్తున్నాం."

"నాక్కావల్సింది పడవులు ...ప్రయాణాలు కాదు. సూటిగా సమాధానం" కరకు గా అంది.

"మనిద్దరి కుటుంబాలు మనపైన్నే అధారపడిఉన్నాయి. ఇలాంటప్పుడు మన స్వార్థం మనం చూసుకొని వారిని బలి చేయడం నాకు ఇష్టం లేదు."

"అంటే"

"అంటే ఏముంది? కుటుంబాలు కిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆదుకోవడం మన ధర్మం."

"ఇప్పటిలాగే ఆదుకొందాం. మన పెళ్ళి దానికి అడ్డని నేననుకోవడం లేదు."

"నీవు చిన్న పిల్లవు. చెప్పినా కొన్ని అర్థం కావు. మన పెళ్ళి ...నా చెల్లెళ్ళ, మీ అక్క పెళ్ళిళ్ళకు ఆటంకం కారాదు. ఎందుకంటే మనం జీవిస్తున్నది సమాజంలో ..."

"వెయిట్ చేద్దాం?" మధ్యలో అడ్డుపడుతూ అంది.

"ఎంతకాలం? బాధ్యతలు ఎప్పుడు తీర్తాయో తెలియదు. మధ్య తరగతి సమస్యలకు అంతం ఎప్పుడో చెప్పలేం."

"ఇదేనా ! మీ అఖరి సమాధానం"

"నీవు నాకంటే తెలివైన దానివి. మంచి భవిష్యత్తు ఉన్న దానివి. మనలాంటి మధ్య తరగతి జీవితాల్లో కొన్ని కొన్ని ఆశించ డం కూడా అత్యాశే అవుతుంది. ఇంతకు మించి నన్నేమీ అడక్కు. నాకు నా పెళ్ళికన్నా బాధ్యత ముఖ్యం. అర్థం చేసుకో! ఇక బయలు దేరదాం" మరో మాటకు అవకాశం ఇవ్వకుండా లేచి నిలబడ్డాను.

* *

రాత్రి - రైల్వే స్టేషన్లో రాజీ కు; వాళ్ళమ్మకు సెండాఫ్ ఇవ్వడానికి వెళ్ళాం - నేను కనకయ్యా

ఒక్క రోజులో రాజీ లో చాలా మార్పు కనపడింది. గల గలా, చలాకీగా, సందడిగా ఉండే రాజీ మౌనాన్ని ఆశ్రయించింది. నాకు తెలుసు అమెలో బడబాగ్ని రగులుతోందని ... అగ్ని పర్వతం ఎప్పుడైనా బ్రద్దలవ్వచ్చనీ... అయినా తప్పదు. పరిస్థితులతో రాజీ తప్పదు. పదిమంది సుఖం కోసం ఇద్దరి బాధ అంత పెద్దదేం కాదు. ఈ బాధను కాలం మార్చగలదేమో చూడాలి. కదలబోతుండగా -

నవ్వింది మళ్ళీ ... అలలు అలలుగా ... తెరలు తెరలు గా.

నొక్కి వదిలింది నా చేతిని.

తేలిక పడింది.

డోర్ దాకా వచ్చి, "నీ మేలును జన్మలో మర్చిపోలేను బాబూ!" అంటూ చేతులు జోడించింది.

ట్రైన్ కదిలింది.

నేను      చేతులూపి బయట పడ్డాం.




ఒకే స్కూలులో ఒకే తరగతిలో కలసి చదువుకుంటున్న ఆ ఇద్దరి స్నేహితుల మధ్య హఠాత్తుగా తగవు ప్రారంభమైంది. చిలికిచిలికిగాలివానగా మారినట్టు అది పెరిగి పెద్దదయింది.

“ నేను బాగా చదువుతా. పరీక్షల్లో అన్నింటిలో మంచి మార్కులొస్తాయి. క్లాసులో నేనే ఫస్ట్. కనుక నేనే గొప్ప...” అన్నాడు ఫణి. త్రిలోచన్ దానికి      అభ్యంతరం చెప్పాడు.

“ మార్కులు రావటం గొప్ప విషయమా ఏమిటి? పుస్తకాల్లో ఉన్నవే బట్టీపట్టి రాసెయ్యటమేగా. అదే బొమ్మలు వేయటం ఎంత కష్టం.     నేను ఏది     చూసినా     క్షణాల్లో     దాని బొమ్మ గీసెయ్యగలను. దీన్ని బట్టి నీ కంటే నేనే గొప్పవాడినని నిశ్చయంగా చెప్పగలను. ” ధీమాగా చెప్పాడు.“దానికినేను      ఒప్పుకోను.” అన్నాడు ఫణి.

“ చదువు అన్నింటి కంటె ప్రధానమైనది. విద్య లేని వాడు దేనికీ కొరగాడు” అన్నాడు.

" చదువు వచ్చిన వాళ్లు చాలా మందే ఉంటారు. కళాత్మక ప్రతిభ ఉన్న వాళ్లు తక్కువ మంది ఉంటారు "అంటూ త్రిలోచన్ ఆ మాటల్ని మధ్యలోనే అడ్డుకున్నాడు.

చాలా సేపటి వరకూ ఇద్దరూ ఎవరికి వారు తామే గొప్పవాళ్లమంటూ వాదించుకున్నారు. ఒక అంగీకారానికి రాలేకపోయారు. పెద్ద వాళ్ల దగ్గరికి వెళ్లి ఈ వ్యవహారాన్ని తేల్చుకోవాలనుకున్నారు.

ముందుగా ఫణి వాళ్లింటికి వెళ్లారు.

ఈ విషయం తెలియగానే ఫక్కున నవ్వింది ఫణివాళ్ల అమ్మ.

త్రిలోచన్ భుజం తట్టి " నువ్వే గొప్పవాడివిరా కన్నా" అంది. దాంతో ఫణికి కోపం వచ్చింది. అమ్మ తనను కాదని, తన స్నేహితుడ్ని మెచ్చుకోవటాన్ని భరించలేకపోయాడు. మూతి పెట్టి " నేను నీతో మాట్లాడను పో " అన్నాడు కోపంగా.

" మా ఇంటికి వెళదాం పదరా" .. త్రిలోచన్ పిలవగానే నాలుగిళ్లవతల ఉన్న వాళ్లింటికి బయలుదేరారు ఇద్దరూ

విచిత్రంగా త్రిలోచన్ వాళ్ళింట్లోనూ ఇలాంటి పరిస్థితే ఎదురయ్యింది.

త్రిలోచన్ వాళ్లమ్మ ఫణిని మెచ్చుకుంది. ' నువ్వు వీడిని చూసి నేర్చుకోవాలిరా. రోజంతా పిచ్చి బొమ్మలు గీసుకుంటూ కాలక్షేపం చేస్తావు" అంటూ సున్నితంగా మందలించింది కూడా.

త్రిలోచన్ నీరుగారిపోయాడు. అప్పటి వరకూ ఉన్న హుషారంతా మాయమయిపోయింది.

" మన టీచర్ని అడుగుదాం. ఆవిడేం చెబితే అదే తుది నిర్ణయం."... అన్నాడు.

అది సబబుగా అనిపించింది ఫణికి.

తమ ఇళ్లలో విషయం ఎలాగూ తేలలేదు. కనీసం ఇలాగయినా ఒక అభిప్రాయానికి రావచ్చనిపించింది.

శర్వాణి టీచర్ కి పిల్లల మనస్తత్వం బాగా తెలుసు. ఇద్దరి తగువు విని " పరీక్షలు దగ్గర పడుతున్నాయి. చదువుకోకుండా ఏమిటీ పిచ్చివాదనలు"... అంటూ కసురుకుంది.

" అది కాదు టీచర్. మీరు తేల్చిచెప్పాల్సిందే. మా ఇద్దరిలో ఎవరు గొప్పవాళ్లో..?" గట్టిగా చెప్పారు.

" మీరిద్దరు మంచి స్నేహితులు. అనవసరంగా ఇలాంటి వాదనలు చేసుకుని పట్టుదలలు పెంచుకుంటే ఒకరంటే మరొకరికి ద్వేషం పెరుగుతుంది. దాని వల్ల చివరికి ఇద్దరూ నష్టపోతారు" హితవుగా చెప్పింది.

" మీ ఇద్దరిలో ఎవరు గొప్పవాళ్లలో ఇప్పుడే తేల్చి చెప్పేస్తా. వచ్చి ఈ బల్ల మీద కూర్చోండి."

ఆమె పక్కనున్న బల్లమీద ఇద్దరు చేతులు కట్టుకుని కూర్చుని ఆమె చెప్పేది శ్రద్ధగా వినసాగారు.

" ఇప్పుడు ఎండలో మీరిద్దరూ వచ్చారు. ఎండ చుర్రుమంటోంది కదా?" అడిగింది.

అవునన్నట్టుగా ఇద్దరూ తలాడించారు. ఆ విషయాన్ని ఆమె ఎందుకు ప్రస్తావించిందో వారికి అర్థం కాలేదు.

" ఎండ చుర్రుమంటోంది అంటే... సూర్యుడు తన ఉద్యోగం చేస్తున్నట్టు లెక్క. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇలాగే ఉద్యోగం చేస్తాడు. రాత్రి కాగానే ఉద్యోగం మానుకుంటాడు. చీకటి ఆవరిస్తుంది. అప్పుడు చంద్రుడుతన పని ప్రారంభిస్తాడు."

శర్వాణి చెప్పుకుపోతోంది. ఇద్దరూ ఆమె మాటల్ని శ్రద్ధగా వినసాగారు.

“ పగలు సూర్యుడు… రాత్రి చంద్రుడు .. ఎవరి బాధ్యతల్ని వారు నిర్వర్తిస్తున్నారు. అంతే తప్ప మాలో ఎవరు గొప్ప అని తగవులాడుకోవటం లేదు”

అంటూ ఒక నిమిషం ఆగి మళ్లీ చెప్పటం కొనసాగించింది.“సూర్యుడు వెలుగులు పంచుతాడు. చంద్రుడు వెన్నెల ప్రసాదిస్తాడు. ఈ రెండూ కరవైనప్పుడు మానవాళి చీకట్లో మగ్గుతుంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.. సూర్యచంద్రులు ఇద్దరూ సృష్టికి అవసరమైనవాళ్లే. ఇద్దరూ గొప్పవాళ్లే” …

ఆమె చెప్పటం పూర్తికాలేదు. తమ ప్రశ్నకి సరైన సమాధానం లభించిందనిపించింది. వాళ్ల గుండెల్లో గూడుకట్టుకున్న అసూయ మాయమైంది కూడా. ఒకరికొకరు ఆత్మీయంగా అనిపించారు.

ఇద్దరూ ఒకరి భుజాలపైన మరొకరు చేతులు వేసుకుని బయటకు నడిచారు. ఈ దృశ్యాన్ని చూసి తృప్తిగా అనుకుంది శర్వాణి…“ స్వార్థం అనే పురుగు వీళ్ల మెదళ్లను తొలచకుండా ఈ స్నేహం ఇలాగే కలకాలం కొనసాగాలి”



ఎడతెగని ఆలోచనలతో తలపగిలిపోయేలా వుంది వసుధకు. అటు ఆఫీస్ లో పని ఒత్తిడి , ఇటు ఇంట్లో పని, పిల్లల చదువులు... దానికి తోడు భర్త ఆలోచనలు.... వీటన్నిటి మధ్యా ఉక్కిరిబిక్కిరి అవుతుంది తను. అసలు,... నిన్న మొన్నటి దాకా ఎంత అందమైన జీవితం తనది. అందరూ ఈర్ష్య పడేలా ఎంతో సంతోషం గా... ముఖం లో చిరునవ్వు.. ప్రశాంతత తప్ప బాధ మచ్చుకైనా కనిపించకుండా వుండేది. ప్రేమగా చూసుకునే భర్త, రత్నాల్లాంటి ఇద్దరు అబ్బాయిలు, నీకేంటే.. మీ ఆయనది గవర్నమెంట్ జాబ్... అసలు నువ్వు జాబ్ చేయాల్సిన అవసరం కూడా లేదని ..... తోటి వాళ్ళూ, స్నేహితురాళ్ళూ అంటూంటే, పొంగిపోయేది తను. అలాంటిది భర్త ఇలా మారుతాడని తనను తప్ప పరస్త్రీని కలలో కూడా రానీయడని నమ్మకం పెంచుకున్న తన అభిప్రాయం మార్చేలా వేరే అమ్మాయి వలలో పడతాడని కలలో కూడా ఊహించలేదామె, ఎదురింటి ఆంటీ చెప్పేదాకా...

ఇలా ఆలోచిస్తూ వుండగా...

అమ్మాయ్ వసూ! అంటూ వచ్చింది ఎదురింటి రాజేశ్వరి ఆంటీ.

రండాంటీ! అంటూ ఆహ్వానించింది వసుధ.

ఒక గ్లాసు పంచదార.. ఆ చేత్తోనే నాలుగు ఉల్లిపాయలు వుంటే ఇవ్వమ్మా! సాయంత్రం అంకుల్ తో తెప్పించి ఇస్తాను అంది.

భలే వారే ఆంటీ! వెంటనే యిచ్చెయ్యాలా ఏమిటి? నాకు అవసరమైనప్పుడు నేనే అడుగుతాలే అంది వసుధ.

మా తల్లే... అంటూ... పరీక్షగా వసుధను చూస్తూ ఏంటమ్మా అదోలా వున్నావు కళ్ళన్నీ పీక్కుపోయాయి. ఏమైంది... అని అడగ్గానే, వలవలా ఏడ్చేసింది వసుధ,

ఆంటీ! అంటూ ఆమెను పట్టుకుని,

అయ్యో ! ఏంటమ్మా ఏమైంది .. చెప్పు మళ్ళీ అడిగింది వసుధను ఓదారుస్తూ

నేను ఊరునుంచి తిరిగి వచ్చాక, మొన్న మీరు చెప్పిన విషయంలో ఆరా తీసానని కోపం వచ్చి నానా మాటలు అన్నారాంటీ! ఇంట్లో రాత్రి పెద్ద గొడవ జరిగింది.

పిల్లలు లేచి వింటే బాధపడతారని నేనే సర్దుకుపోవాల్సి వచ్చింది, అంటూ వెక్కిళ్ళు మధ్య తన బాధ వెళ్ళబోసుకుంది వసుధ,... అంతేనమ్మా! ఏం చేస్తాం.. ఆడవాళ్ళుగా పుట్టిన పాపానికి మనమే సర్దుకుపోవాలి. ఏది ఏమైనా ఈ మగవాళ్ళని నమ్మకూడదు, గొడవ అవుతుంది కదా, నేను చెప్పిన విషయం వదిలెయ్యకు తల్లీ! నీకు అండగా వుంటాను, ఏదైనా అనరాని మాట మీ ఆయన అన్నా... నిన్ను కొట్టాలని ప్రయత్నించినా వెంటనే మా ఇంటికి వచ్చెయ్... తర్వాత నేను చూసుకుంటాను అని అభయమిచ్చింది రాజేశ్వరి. సరే ఆంటీ అని తలాడించిన వసుధతో, వస్తానమ్మా! వంట అవ్వలేదు... జాగ్రత్త.. అని చెప్పి వెనుదిరిగింది రాజేశ్వరి ఆంటీ వెళ్ళిన వైపే ఆరాధనగా చూస్తూ మనసులో అనుకోసాగింది వసుధ.

ఎంత మంచి మనసు ఆంటీది, ఆంటీ లాంటి పెద్దవాళ్ళు అండ ఏంతో అవసరం మహిళలకి ముఖ్యంగా, తన భర్త నిజ స్వరూపం తనకు తెలియడానికి కారణం ఆంటీనే!

భర్త నైట్ డ్యూటీకి వెళ్ళగానే వచ్చేస్తుంది తన దగ్గరకు. రాత్రి పదిన్నరదాకా తనకు బోలెడు కాలక్షేపం, ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంది ఆంటీ దగ్గర.

అంతకుముందు,

పిచ్చిదానిలా తన ఏ.టి.యం కార్డు భర్త దగ్గరే వుంచేసేది, ఏదైనా కావాలంటే భర్త కొనేవాడు. ఆ కార్డుతో నాకు పనేముందిలే అనుకునేది తను ..

కానీ...

భార్య సంపాదన ఇంట్లోకి ఖర్చుపెట్టడం తగదనీ, ఎంత మాత్రమూ ఏటిఏం కార్డు భర్త దగ్గర వుంచకూడదని , అంతే కాకుండా భర్త సంపాదనలో ప్రతి పైసా ఎలా ఖర్చు అవుతుందో ఆరా తీయాలని తెలుసుకోవాలనీ తనకు ఉపదేశించిన పరమ గురువు రాజేశ్వరి

ఆంటీ,

అంతేనా..

రాత్రి తమింట్లో జరిగిన యుద్ధానికి కారణం ఆంటీ చెప్పిన విషయమే అనుకుని జరిగింది గుర్తు చేసుకుంది వసుధ.

ప్రతీ సంవత్సరం వెళ్ళినట్టుగానే దసరా సెలవులకని పుట్టింటికి వెళ్ళి వచ్చింది. వచ్చిన రోజు రాత్రి భర్త నైట్ డ్యూటీకి వెళ్ళగానే తన దగ్గరకు వచ్చింది ఆంటీ.

చూడమ్మా వసుధా! నేను ఎందుకు చెబుతున్నానో అర్ధం చేసుకో తల్లిలాంటిదాన్ని... ఇకపై నువ్వు అన్ని రోజులు మీ ఆయన్ని వదిలి పుట్టింటికి వెళ్ళకు అంది..

ఏమైందాంటీ! అని అడిగిన తనతో అన్ని విషయాలు నేను నా నోటితో చెప్పలేనమ్మా, నువ్వే అర్ధం చేసుకోవాలి... నీ మంచి కోరే చెబుతున్నాను.. అని వెళ్తూ ఒక కిలో బెల్లం తీసుకుని వెళ్ళింది తనని అడిగి. అదిగో అప్పట్నుంచి అనుమాన బీజం నాటుకుంది భర్త విషయం లో ఆ తర్వాత...

క్షుణ్ణంగా భర్తను పరిశీలించసాగింది, వసుధ

నిజమే! ఆంటీ చెప్పిన నెగెటివ్ కోణాలన్నీ తనకు అర్ధమవసాగాయి. భర్త పట్ల ఇంతకు ముందు ప్రతిరోజు సాయంత్రాలు... గుడికో .. సినిమాకో ఫ్యామిలీ అంతా కలిసి వెళ్ళేవారు. అలాంటిది, బైటకు తీసుకెళ్ళడం మానేసాడు భర్త, పైగా ఫోనొస్తే .. సిగ్నల్స్ సరిగా లేవంటూ బాల్కనీలోకెళ్ళి రహస్యంగా మాట్లాడుతున్నాడు. తను పుట్టింట్లో వుంటే నాలుగైదు సార్లు ఫోన్ చేసే మనిషి ఈ సారి కేవలం రోజుకి ఒక్కసారే మాట్లాడాడు.. అంతేనా ఇంటి పనులు అన్నింటిలో సాయం చేసే భర్త వైఖరిలో మార్పు కనిపిస్తుంది... అనుకుంటూ అన్ని రకాలుగా నెగెటివ్ ఆలోచించసాగింది వసుధ.

అప్పటునుంచి స్టార్ట్ అయ్యింది ప్రశాంతం గా వున్న ఇంట్లో భయంకరమైన వార్.

భర్త మీద అనుమానంతో ఎప్పుడూ నవ్వుతూ ఆరోగ్యం గా వుండే వసుధ చిక్కిశల్యమై పేషెంట్ లా మారింది. పిల్లల పట్ల తరచూ కోపం ప్రదర్శిస్తూ... ఇంట్లో మనశ్శాంతి లేకుండా చేస్తుంది.

భార్యలో మార్పు గమనించిన శ్రీధర్ అయోమయం లో పడ్డాడు.ఎంతో మెచ్యూర్డ్ గా ఆలోచించి అన్ని విషయాలలో అనుకూలం గా స్పందించే భార్య ఇలా అనుక్షణం తనని సాధించటమూ, తన ప్రతీ చర్య పట్ల అనుమానం గా ఆరాతీయటమూ, డబ్బు విషయం లో ... యింత వరకూ మనది.. మనము అనే వసుధ ప్రతీ విషయం లోనూ ముఖ్యం గా జీతం విషయం లోనూ నీదీ... నాదీ.. అంటూ భేధ పరచి మాట్లాడమూ తట్టుకోలేకపోతున్నాడు.

పిల్లల స్కూలుకీ.. వసుధ ఆఫీసుకీ దగ్గరగా వుంటుందని కొత్తగా అపార్ట్ మెంట్ లోకి మారిన తరువాతే సమస్యలొస్తున్నాయని గ్రహించాడు. అసలేం జరిగి వుంటుందబ్బా.. అని ఆలోచిస్తున్న శ్రీధర్ కి మర్నాడే సమాధానం దొరికింది. వసుధ ఆఫీస్ కు వెళ్ళాక వాషింగ్ మెషిన్ లో బట్టలు తీసి ఆరవేస్తుండగా అటువైపు బట్టలు ఆరేస్తున్న రాజేశ్వరిని చూసి .. అయ్యో! ఇదేంటయ్యా! ఎంత మీ ఆవిడ ఉద్యో గం చేస్తున్నా ఆవిడ బట్టలు నువ్వే ఆరెయ్యాలా, ఏం ముందే లేచి మీ ఆవిడే ఆరేసుకోవచ్చుగా, పాపం నీకెంత కష్టం ఇలాంటి పనులు చెయ్యాలంటే అంది. వివేకమూ, లోకజ్ఞానం వున్న శ్రీధర్ .. అదేమిటండీ...! మన పనులు మనం చేసుకుంటే తప్పేముందీ. ఇద్దరు పిల్లలతో , ఇంటి పనులు చేసుకుంటూ ఉద్యోగానికి వెళ్ళే ఆమెకు ఈ మాత్రమన్నా సాయం చేయకపోతే ఎలా? అని ఆమె నోటికి తాళం వేశాడు. అప్పుడే ఫ్లాష్ లా ఆలోచన వచ్చింది శ్రీధర్ కి.

అంతకు ముందు కూడా ఒకటి రెండు సార్లు వసుధ గురించి నెగెటివ్ గా మాట్లాడింది ఆంటీ తన దగ్గర.

నువ్వు నైట్ డ్యూటీకి వెళ్ళగానే ఎవరితోనో గంటల కొద్దీ ఫోన్ లో మాటలాడుతుందనీ, పిల్లలని చదివించేటప్పుడు బాగా కొడుతుందనీ చెప్పింది. తనకు తెలుసు.. తన పుట్టింటి వారితోనూ... ముఖ్యం గా వసుధ చెల్లాయి రమ్య తో ఫోన్ ఎక్కువగా మాట్లాడుతుంది. తను నైట్ డ్యూటీకెళ్ళాక ఫ్రీ గా వుంటుంది. కాబట్టి ఆ టైం లో తన వాళ్ళతో మాట్లాడి వుండవచ్చు, అని అర్ధం చేసుకున్నాడు అంతేకాకుండా,ఇద్దరు పిల్లలకూ స్కూల్లో మంచి ర్యాంకులు రావాలన్నా తాపత్రయం తో కొప్పడి వుండవచ్చు అని సరిపెట్టుకున్నాడు తప్ప ఆ విషయం గుర్తుంచుకోలేదు.

కానీ అమాయకత్వమూ.. ఎదుటి వాళ్ళ మాటల్ని నమ్మే స్వభావమూ గల వసుధ.. ఆంటీ మాటల వల్ల యిలా మారివుంటుందని గ్రహించాడు శ్రీధర్. సరైన సమయం కోసం నిరీక్షించసాగాడు.

ఆ మర్నాడే శ్రీధర్ ఆశించిన సమయం వచ్చింది.

సాయంత్రం బైటికెళ్ళి తిరిగొచ్చాక శ్రీధర్ తో యుద్ధానికి దిగింది వసుధ. విషయమేమిటంటే,

శ్రీధర్ కి వచ్చిన ఇరవై వేలు ఏమయ్యాయని ఆమె గొడవ.

నాకు బోనస్ వచ్చిందని నీకు చెప్పింది ఎదురింటి రాజేశ్వరి ఆంటీయే కదూ! అని అడిగాడు శ్రీధర్, ఎందుకంటే రాజేశ్వరి ఆంటీ భర్త కూడా శ్రీధర్ ఆఫీస్ లోనే చేస్తారు.

ఆ.. అవును.. అయితే ఏంటట? ముందు ఆ డబ్బు ఏం చేశారో తేల్చండి? అంటూ తడబడ్డప్పుటే అర్ధమయిపోయింది శ్రీధర్ కి, ఇదంతా ఎదురింటావిడ చలవే అని.

కోపం తెచ్చుకోకుండా, ఓర్పుగా.. అనునయం గా చెప్పాడు భార్యకి.

వసుధా!

చదువుకున్నదానివి, అన్నీ తెలిసిన దానివి, కొంచెం నిదానంగా ఆలోచించు. మనం ఇక్కడకు రాకముందు ఎలా వుండేవాళ్ళం, ఇప్పుడేలా వుంటున్నాం ...

అంతేకాదు,

ఆంటీ చెప్పే మాయమాటలకు, ప్రలోభాలకు పడిపోయి నువ్వు పప్పులూ, పంచదార.. నూనె అన్నీ కూడా సమర్పించుకుంటున్నావు...మళ్ళీ అవి రావని తెలిసినా అవునా! అన్నాడు.

.. ఆ.. ఇరవై వేలు ఏమయ్యాయనేగా నీ డౌటు.. ఇదిగో నాకు బోనస్ వచ్చిన రోజే మనకు బాగా పరిచయమున్న స్వర్ణాంజలి నాయుడు గారి షాపులో వచ్చే నెలలో నీ పుట్టినరోజు కానుకగా ఇవ్వాలనుకుని ఆర్డర్ చేసిన డైమెండ్ రింగ్ తాలూకు... అడ్వాన్స్ బిల్లు అంటూ రశీదు చూపించాడు.

ఆలోచనలో పడింది వసుధ.

నిజమే! వచ్చిన నాటి నుంచే ఆంటీ తీసుకెళ్ళిన ఒక్క సరుకూ తిరిగి ఇవ్వలేదు.

ఆవిడ వచ్చినప్పుడు ... ఆమె మాటలు తనకు నచ్చినట్టుగా, అనుకూలం గా వుండడంతో ఆమె ఏదడిగినా, అంతడుగినా యిచ్చేస్తుంది తను. కనీసం, ఇప్పటి వరకూ ఒక నెలవారీ సరుకులు ఇచ్చి వుంటానని తెలుసు వసుధకు.

భార్య ఆలోచనలో పడిందని తెలుసుకున్న శ్రీధర్ ఆఖరి అస్త్రం వదిలించాడు.

సరే! వసుధా... మనింట్లో గొడవకు ఆంటీనే కారణం అని నేను నీకు ప్రాక్టికల్ గా ప్రూవ్ చేస్తాను... అన్నాడు.

ఏమనాలో తెలిక మౌనం గా వున్న వసుధతో ప్లాన్ చెప్పాడు శ్రీధర్..

తరువాతి రోజు ప్లాన్ లో భాగం గా ఆ ఊరు లోనే వున్న శ్రీధర్ కజిన్ సిస్టర్ సుధను బైక్ మీద ఇంటికి తీసుకువచ్చాడు.. ముందుగానే అన్నీ వివరం గా చెప్పి , వసుధ ఆఫీస్ కెళ్ళిన సమయం లో ..

వాళ్ళు చెప్పులు విప్పి ఇంట్లోకి వెళ్తుండగా ... రాజేశ్వరి ఆంటీ డేగ చూపులు పసిగట్టాడు శ్రీధర్.

ఒక అరగంట టీవి ని చూసి, టీ.. త్రాగి ఇద్దరూ వెళ్ళిపోయారు.

ఆఫీస్ నుంచి వసుధ ఎప్పుడు వస్తుందా అని గుంటనక్కలా ఎదురుచూసిన ఆంటీ, వసుధ రావడం తోనే... గబగబా హాల్లోకి వచ్చి వుంటే ఇవ్వు తల్లి... అంది.

సిద్ధం గా వున్న వసుధ ... ముందు విషయం చెప్పాడాంటీ! అంది.

అమ్మాయ్! నువ్వు ఆఫీసుకి వెళ్ళగానే మీ ఆయన ఎవతినో ఇంటికి తెచ్చుకుని తలుపులు మూసుకుని ... అమ్మో వద్దులే నా నోటితో ఆ పాపం చెప్పలేనమ్మా.. ఒకటే ఇకఇకలూ.. పకపకలూ...

..ఏది ఏమైనా నువ్వు కొంచెం జాగ్రత్త పడాలమ్మాయ్.. అవసరమైతే పోలీసుల సహాయం తీసుకో.. నేనే సాక్ష్యం... అంది.

సరే ఆంటీ.. ఇప్పుడే ఎస్. ఐ గారికి ఫోన్ చేస్తున్నా.. విషయం మీరే చెప్పండి... అంటూ నెంబర్ డయల్ చేసి ఫోన్ చేతికిచ్చింది వసుధ. ఆమ్మో ఇదేమిటి... ఏదో మాట వరుసకు అన్నాను. నాకేం తెలిదు... బాబోయ్.. మీ గొడవలేవో మీరు చూసుకోండి, మధ్యలో నన్ను లాగొద్దు.. అంటూ సెల్ ఫోన్ విసిరేసింది కంగారుగా.

ఓకే... ఆంటీ.. ఇకనుంచి మా గొడవలేవో మేం పడుతాం.. దయచేసి ఇకపై మా ఆయన గురించి చెప్పినదం తా ఫోన్ లో రికార్డు చేసాను. ఏదైనా సమస్య మా ఇద్దరి మధ్యా వస్తే .. ఖచ్చితం గా ఆ రికార్డు నేను ఎక్కడ అందించాలో అక్కడ అందచేస్తాను, అనగానే పాలిపోయిన ముఖంతో అక్కడినుంచి జారుకుంది రాజేశ్వరి ఆంటీ.

సమస్య పరిష్కారమవడం తో .. భర్తకు సారీ చెప్పి ... వసుధా, శ్రీధర్ సంతోషం గా వుండసాగారు, మునుపెటిలా..అక్కడ వుండబుద్ధికాక, వేరే ఇల్లు మారారు... రాజేశ్వరి ఆంటీ, వాళ్ళు తమ అవసరాల తీర్చుకోవడానికి కల్లబొల్లి మాటలు చెప్పి , కాపురాలలో చిచ్చు పెట్టే




బడి గంట గణ గణ మ్రోగింది..

అది ఇంటర్వెల్..

పుట్టలోనుండి చీమలు ఉన్నఫళంగా బయటికి వచ్చినట్లు పిల్లలంతా బిల బిలమంటూ ఉరుకులు పరుగులతో పరుగెత్త సాగారు. స్వల్ప విరామం పూర్తి కాగానే అక్షథ యధావిధిగా ఐదవ తరగతికి వెళ్ళింది. తనకు గణిత శాస్త్రం అంటే మక్కువ. పిల్లలకు ఓర్పుగా.. నేర్పుగా చెప్పడంలో దిట్ట.

గదిలోనికి అడుగు పెట్టగానే పిల్లలంతా లేచి నిలబడి వినయంగా విష్ చేసారు. కూర్చోమ్మంటూ టీచరు నుండి ఆదేశం అందగానే తమ తమ స్థానాలలో తిర్గి కూర్చున్నారు.

రమేష్ ఒక్కడే అలాగే నిలబడి ఉండి పోయాడు. తన రెండు కళ్ళ వెంట ధారాళంగా కన్నీరు..

అక్షథ రమేష్ దగ్గరికి వెళ్ళింది. లాలనగా దగ్గరికి తీసుకుంది.. బుజ్జగిస్తూ విషయం ఆరా తీయసాగింది. రమేష్ చెప్పాలా.. వద్దా.. అని తటపటాయించ సాగాడు. అయినా చెప్పక తప్పదు.. ఇది మామూలు విషయం కాదు. అని జ్ఞప్తికి రాగానే బిగ్గరగా

ఏడ్చేశాడు. పిల్లలంతా బిక్కు బిక్కు మంటూ చూడ సాగారు. ఏమయ్యిందో ఎవ్వరికీ తెలియదు.. అక్షధకు తెలుసు రమేష్ ఏం చెప్పబోతాడో..! కాని అది అతడి నోట వినాలని.. సహనం వహించింది. రమేష్ ఏడుస్తూనే నెమ్మదిగా అసలు విషయం చెప్పాడు. పిల్లలంతా నిర్ఘాంత పోయారు.

రమేష్‌ను తన టేబుల్ వద్దకు నెమ్మదిగా నడిపించుకుంటూ వెళ్ళింది.

“ ఇప్పుడు ఒక చిన్న కథ చెబుతాను” అనగానే తరగతి గది అంతా నిశ్శబ్దం ఆవహించింది. పిల్లల చెవులు నిక్క పొడ్చుకున్నాయి.

“జవహర్లాల్ నెహ్రూ గారి పుట్టిన రోజున మనం ‘చిల్డ్రన్స్ డే’ జరుపుకుంటాం.. మీకందరికీ తెలిసిందే.. ”

“యస్ టీచర్..” అంటూ పిల్లలంతా ముక్త కంఠంగా కోరస్ పలికారు.

“సైలెన్స్..” అంటూ సంజ్ఞ చేసి తిర్గి చెప్పనారంభించింది.

“ఒక సారి నెహ్రూ గారు సభలో ఉపన్యసిస్తూ ఉండగా సభ సహాయకుడు ఒక చిన్న చీటీ తెచ్చి ఇచ్చాడు. దాన్ని చూసి చదువుకొని తిర్గి జేబులో పెట్టుకొన్నాడు. తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు. సభ అనంతరం చీటీలో ఉన్న విషయం.. నెహ్రూ తల్లి గారు పరమపదించారు. అయినా అంత గుండె నిబ్బరంగా సభకు ఆటంకం కల్గించనందుకు నెహ్రూ గారి మనో స్థైర్యానికి అందరూ ఆశ్చర్య పోయారు..

విషయమేమిటంటే మనం విధుల్లో ఉన్నప్పుడు కర్తవ్య పాలన చేయాలి గాని స్వంత పనులకు ప్రాముఖ్యత ఇవ్వడం.. వాటి కోసం సెల్ ఫోన్లలో మాట్లాడటం నేరం. అందుకే మా ఉపాధ్యాయులమంతా మా సెల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి పెడ్తాం. పాఠశాల ముగియగానే తిర్గి ఆన్ చేస్తాం..” అంటూ పక్కనే నిలబడి ఉన్న రమేష్‌ను చూసింది. వాడు తల దించుకొని వింటున్నట్లు గమనించింది అక్షధ. వాడి కన్నీటి బొట్లు నేలపై రాలుతునే ఉన్నాయి..

ఇప్పుడు మీకు ఇంద్రజాలం చేసి చూపుతాను. అంతా రడియేనా?..” అంటూ ప్రశ్నించగానే పిల్లలంతా అత్యుత్సాహంతో ఎగిరి

గంతులు వేసినంత పని చేసారు. పిల్లల ముఖాలు వేయి ట్యూబ్ లైట్లు వెలిగాయి.

పిల్లలందరి బ్యాగులన్నింటిని తెప్పించి టేబుల్‌పై పెట్టించింది. రమేష్ కూడా వెళ్ళి తన బ్యాగు తెచ్చి పెట్టాడు. బ్యాగులన్నింటిని టేబుల్ క్లాత్ తో కప్పింది.. పిల్లలంతా గుండెలు బిగ బట్టి చూడసాగారు.

"రమేష్ నీ క్లోజ్ ఫ్రెండ్ పేరు చెప్పు" అంటూ అడిగింది. కాసేపు ఆలోచించి "దిలీప్" అన్నాడు.

అక్షధ చిరు నవ్వు నవ్వింది. పిల్లలకు ఏమీ అర్థం కావడం లేదు.

"నేను ఈ మధ్యనే ఒక మాయ మంత్రం నేర్చుకున్నాను. అది ఇప్పుడు ప్రదర్శించ బోతున్నాను.." పిల్లలో ఉత్కంఠ పెరిగింది.

తన హాండ్ బ్యాగులో నుండి చిన్న మంత్ర దండం తీసింది. దిలీప్‌ను పిలిచింది. దిలీప్ కంగారు పడ్తూ వచ్చాడు.

"దిలీప్.. నీకు కూడా రమేష్ అంటే చాలా ఇష్టం కదూ..!" అంది. అవునన్నట్లు తలూపాడు దిలీప్.. అతడి మనసులో భయం ఆవహించింది. "దిలీప్ ఈ మంత్రదండంతో 'అబ్రకదబ్రా..' అనుకుంటూ మీ బ్యాగులన్నింటి చుట్టూ మూడు సార్లు తిప్పు.. అప్పుడు రమేష్ పోగొట్టుకున్న వస్తువు నీ బ్యాగులోకి వస్తుంది. దాంతో మీరిద్దరు ప్రాణ స్నేహితులని ఋజువవుతుంది.. రమేష్ ఏడుపూ ఆగి పోతుంది" అంటూ మంత్ర దండాన్ని దిలీప్‌కిచ్చింది.

దిలీప్ మదిలో అగులు బుగులు కాసాగింది. గుండె చిక్కబట్టుకొని మంత్రం చదువుతూ మూడు సార్లు తిప్పాడు.. హెచ్ ఎం. చెప్పినట్లు బ్యాగులపై కప్పి ఉన్న టేబుల్ క్లాత్ తొలగించాడు. దిలీప్ తన బ్యాగులో చెయ్యి పెట్టి రమేష్ పోగొట్టుకున్న వస్తువు బయటికి తీశాడు.. అది సెల్ ఫోన్.. పిల్లలంతా ఆశ్చర్యపోయారు. రమేష్ ముఖంలో ఆనందం వెల్లి విరిసింది. కళ్ళు బండిచక్రాలయ్యాయి.. కాని అందులో హెచ్.ఎం. ఏమంటుందో అనే భయం లేకపోలేదు.. దిలీప్ హృదయం తేలిక పడ్డట్లు గమనించింది అక్షధ.

"నన్ను క్షమించండి టీచర్.. ఇక ముందు ఇలాంటి తప్పుడు పనులు చేయను.." అంటూ లెంపలు వేసుకోసాగాడు రమేష్.

“ఈ వయసులో మీకు సెల్ ఫోన్ అనవసరం. దాన్ని పాఠశాలకు తేవడం నేరం.. ఈ సంఘటన మన పాఠ శాలలో మొదటి సారిగా జరిగింది. ఇకముందు ఇలాంటి సంఘటనలు జరుకకుండా అన్ని తరగతులకు నోటీస్ పంపిస్తాను. ఈ ఫోన్ ఆఫీసులో ఉంటుంది. ఇంటికి వెళ్ళే ముందు తీసుకో రమేష్.. మొదటి సారి కనుక క్షమిస్తున్నాను..” అంటూ పిల్లలను తమ తమ బ్యాగులను అంద జేసింది. రమేష్, దిలీప్ మౌనంగా వెళ్ళి తమ స్థానాలలో కూర్చున్నారు. అక్షధ పాఠం చెప్పడంలో నిమగ్నమైంది.

బడి ఆనాటి ఆఖరి గంట మోగింది..

స్టాఫ్ అంతా వెళ్ళి పోయాక అక్షధ హెచ్.ఎం. బయలు దేరింది. తన వెనకాలే పిల్లిలా ఏమో చెబుదామని వస్తున్న దిలీప్‌ను గమనించగానే అప్రయత్నంగా అక్షధ పెదవులు విచ్చుకున్నాయి. తనకు తెలుసు దిలీప్ ఏమి చెప్పబోతున్నాడో..

‘దిలీప్ ఇక జన్మలో తప్పు చేయడు.. ఏదో పిల్లకాయ చేష్టలు.. పైగా సెల్ ఫోన్ ఆకర్షణ.. పొరబాటు చేశాడు.. పశ్చాత్తాప పడ్తున్నాడు.’ స్వల్ప విరామ సమయంలో రమేష్ బ్యాగులో నుండి సెల్ ఫోన్ దిలీప్ తీసి తన బ్యాగులో పెట్టుకోవడం తాను చూసింది. పిల్లలముందు అతడిని దోషిగా నిలబెట్టి దండిస్తే.. అవమాన భారంతో అతడిలో అందరి మీద కసి పెరుగుతుందే తప్ప మార్పు రాదు.. పైగా రమేష్, దిలీప్‌ల స్నేహం చెడి పోతుంది..

సమయస్ఫూర్తిగా ఇంద్రజాలం చేయడం మూలాన రమేష్, దిలీప్‌ల స్నేహ బంధం మరింత గట్టి పడ్తుందని నమ్మింది.. తన నమ్మకాన్ని వమ్ము చేయకుండా దిలీప్ పశ్చాత్తాపంతో కన్నీళ్ళ ప్రక్షాళితుడవుతూ వస్తూ ఉండటమే దానికి తార్కాణం..

అక్షధ మనసు కాస్తా తృప్తి పడింది.

విద్యార్థుల కదలికలు ఉపాధ్యాయులకు నిత్యం ఒక నూతన పాఠం.*

వ్యక్తుల విషయం తస్మాత్.. జాగ్రత్త!!




రఘురామయ్య పడక కుర్చీలో కూర్చొని దేవరకొండ బాలగంగాధర తిలక్ రాసిన 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటిలోని ' పోస్ట్ మెన్' కవితను చదువుతున్నాడు...

"అయ్యా! ఉత్తరం..." అని పోస్ట్ మెన్ ఉత్తరం తీసి ఇవ్వబోయాడు రఘురామయ్యకు...

"నూరేళ్ళయ్యా... ! మీకు... మీ గురించి రాసిన కవిత ఒకటి చదువుతున్నాను... ఎంత అద్భుతంగా రాశాడో తిలక్...

ప్రేమలేఖలు... శుభలేఖలు... ఆరోగ్య, అనారోగ్య సమాచారాలు... తీపివార్తలు, చేదువార్తలు ... ఒకటేమిటి రెండేమిటి... అన్నిటినీ చేరవేసి ఏమీ ఆశించని నిస్వార్థ మూర్తులని అబ్బో... ఎంత గొప్పగా రాశాడో..."

"సరే ఏమిటీ నాలుగు రోజులనుంచి ఊళ్ళోకి వచ్చినట్టు లేవు... "

"అవునయ్యా..."

“సెలవు పెట్టావా?”

“కాదయ్యా…”

“మరి…”

“జీతాలు పెంచమని మా పోస్టల్ డిపార్ట్ మెంట్ వాళ్లందరం స్ట్రైక్ చేశామయ్యా…”

“ఫలితాలు బావున్నాయా?”

“ఫరవాలేదండి..”

“ఇంతకీ ఎక్కడి నుంచి ఉత్తరం…”

“పెద్దమ్మాయిగారి దగ్గర్నుంచి…”

పోస్ట్ మెన్ వెళ్లిపోయాడు …. రఘురామయ్య ఉత్తరాన్ని చించాడు….. “నాన్నా! బావున్నావా ? నిన్ను చూడాలని ఉంది…. ఇద్దరు కూతుళ్ళకి పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపేసి తాపీగా వాలు కుర్చీలో కూర్చొని ఏ పాత పుస్తకాలో చదువుతూ కాలక్షేపం చేసే నీకేమవుతుం దిలే … బాగానే ఉండి ఉంటావు”

“ఎంతమంచి వాడివి నాన్నా? ఈ లోకంలో నీకంటే గొప్ప తండ్రి ఇంకెవరూ ఉండరేమో! మా చిన్నప్పుడే అమ్మపోయినా మళ్ళీ పెళ్లి చేసుకోకుండా మాకోసం నీ జీవితాన్ని త్యాగం చేశావు చూడు… ఎవరు చేయగలరు నాన్నా! అంత గొప్పత్యాగం. ఆడపిల్లనని అత్తారింటిలో మాటలు పడకూడదని నాకు వంట నేర్పించావు… ముగ్గులేయడం నేర్పించావు… ఆడపిల్లగా ఇంట్లో చేయాల్సిన అన్ని పనులూ నేర్పించావు. నా నడకలు చూసి నాట్యం నేర్పించావు… గొంతు బావుందని సంగీతం నేర్పించావు… తెలివిగలదానినని కంప్యూటర్స్ నేర్పించావు… ఇవన్నీ నేర్పించి కూడా అర్థం పర్థం లేని సంప్రదాయాలకు, కట్టుబాట్లకు

కట్టుబడి ఉండమన్నావు. అందుకే నీ కోసం అన్నీ భరించి, సహించి ఉంటు న్నాను. నువ్వు నన్ను గుండెలమీద కుంపటని ఏరోజూ అనుకోలేదు, గుండెల్లో పెట్టుకొని చూసుకున్నావు. కానీ నువ్వు వదిలింది మాత్రం అనునిత్యం రగిలే నిప్పుల కుంపట్లోనే... ఆశ్చర్యంగా ఉందా నాన్నా?!"

"నీ అల్లుడు ఆజానుబాహుడు, అరవిందనేత్రుడు అని నీకు తెలుసు. ఆయన రూపం అలాంటిది. శ్రీ రామ చంద్రుడని అందరికీ చెబుతుంటావు కదా! సకలగుణాభిరాముడని సంబరపడిపోతావు కదా! అవి నేను చెప్తేనే నీకు తెలిసాయి. కానీ అవి నిజాలు కావు నాన్నా... 'నీ సంతోషం కోసం నా వ్యథలను దాచి అల్లిన కథలవి, నా కథల నుంచి నీకు పంచిన సుధలవి...' ఇప్పటికీ నేను చెప్పేదానిని కాను, కానీ నేను ఇక్కడ ఉండలేకపోతున్నాను నాన్నా! ఎలా పెంచావు నన్ను, ఎండ కన్ను సోకకుండా పెంచావు... వెన్నెల్లో గోరు ముద్దలు తినిపిస్తూ పెంచావు... ఒళ్ళో నిదుర పుచ్చుతూ పెంచావు... బళ్ళో బెత్తం తగలకుండా పెంచావు... బడంటే గుర్తొచ్చింది, బళ్ళో మాష్టారు ఏనాడూ నన్ను ఎండలో నిల్చోబట్టలేదు. కానీ మీ అల్లుడు రోజూ నన్ను ఎండలో... ఎందుకో తెలుసా 'నిప్పుల్లో దూకిన సీత నిగ్గు తేలి వచ్చిందట నాన్నా?' మిట్ట మధ్యాహ్నం ఎండలో ఒంటి కాలి మీద ఎంతసేపు నిలబడితే నేను అంత గొప్ప పతివ్రతనట. ఆడపిల్ల ఆలనా పాలనా చూడటానికి అమ్మ లేదు కదా! అందుకే నీ పెంపకాన్ని శంకిస్తున్నాడు. నన్ను ఏమన్నా పడతాను కానీ నిన్ను, నీ పెంపకాన్ని ఏమైనా అంటే మాత్రం నేను తట్టుకోలేను అందుకే ఇప్పటి వరకూ... నిలుచుంటూనే ఉన్నాను. ఇక నాకు ఓపిక లేదు నాన్నా! నువ్వు చెప్పు ఏంచేయమంటావు. ఇంకా అలానే నిలుచోమంటావా!? ఇన్నాళ్లు ... కనిపించకుండా... కళ్ళల్లో నీళ్లని, కడుపులో కష్టాన్ని దాచుకున్నాను. నా వల్ల కావడం లేదు నాన్నా...!!! కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందంటారు. నా కష్టాలు నీ కాళ్ళ మీద పడాలనే... నీ కళ్ళు నా కష్టాల మీద పడాలనే...

"పుట్టబోయే నా బిడ్డచేత నిన్ను తాతయ్యా..! అని పిలిపించాలనుకున్నాను. కానీ నీ బిడ్డకు తండ్రి ఎవరు అని నీ అల్లుడు అడిగితే... ఊహించని ప్రశ్నవేసిన ఆయనకు ఏం చెప్పాలో అర్థం కాక మౌనంగా ఉంటే, ఎంతమంది ఉన్నారు? ఎవరి పేరు చెప్పాలా అని ఆలోచిస్తున్నావా ? కొంపతీసి నాపేరు చెప్పవు కదా! అని ఆయన అనేసరికి నిలువునా నరకాల నిపించింది నాన్నా! కానీ అలా చేస్తే పుట్టింటి గౌరవం నట్టేట్లో కలుస్తుందని... అందరూ నిన్నే... పిల్లల్ని కంటే సరిపోదు పెంచడం తెలియాలి అంటారని ఆలోచించాను! తప్పు ఆయనదే అయినా... నువ్వే కదా..! భర్తే సర్వస్వం అని, భర్తే లోకమని చెప్పావు అందుకే నీకోసం ఆయన్ని ఏమీ చేయలేక నేనే చచ్చిపోవాలను కుంటున్నాను. ఏం చేయమంటావు నాన్నా! నువ్వే చెప్పు."

*****

ఒక రోజు ఏం జరిగిందో తెలుసా...

“ఒసేయ్…”

“ఒసేయ్… నిన్నేనే పిలిచేది”

“యావండి…      వస్తున్నాను”

“ఒక్కసారి పిలిస్తే పలకవా…      వినిపించదా… చెవుడా… లేక పొగరా…”

“లేదండి వంటగదిలో ఉన్నాను”

“నేను ఇక్కడే ఉన్నాను కదా!      మరి రావడానికి ఇంత ఆలస్యం…”      అదోలా నవ్వాడు…

కళ్ళల్లో నీళ్ళు కళ్ళల్లో కుక్కుకొని …. మౌనంగా ఉండిపోయాను

“సరెసరెలే… ఆ ఏడుపాపి      వెళ్ళి ఓ కప్పు కాఫీ తీసుకురా…”

కాఫీ తెచ్చి ఇచ్చాను… కాఫీలో కాఫీ పొడి ఎక్కువైనదని మీదికి విసిరి కొట్టాడు… చెయ్యి అడ్డం పెట్టుకుంటే      అంతా కాలి బొబ్బలొచ్చాయి. ముఖం మీద పడితే      అందం పోతుందనా? అందం పోతే మగాళ్ళు ఎవరూ నీవైపు చూడరనా? చెయ్యి అడ్డుపెట్టావు… ఇలా మాట్లాడాడు మీ సుగుణాభిరాముడు… ఆ మరునాడే నువ్వొచ్చావు అడిగితే      పొరపాటున చేయి జారి కాఫీ ఒలికిందని చెప్పాను. అంత నిర్లక్ష్యమైతే ఎలా అని నువ్వు కూడా నన్నే తిట్టావు. ఎంతో అనుభవం ఉన్న నువ్వు అంత చిన్న విషయాన్ని కూడా గ్రహించలేకపోయావా నాన్నా?!      ఇంకో విషయం చెప్పనా? లక్షణంగా నువ్వు పెట్టిన ‘సులక్షణ’ అనే పేరుతో ఆయన నన్ను ఏరోజూ… పిలవ లేదు. పెళ్ళైన తరువాత నా ఇంటి పేరే కాదు నాపేరు కూడా మారిపోయింది. ఇక్కడ నాపేరు ‘ఒసేయ్’. నువ్వు వచ్చిన ప్పుడు అమ్మా! సులక్షణా…      అనగానే నన్ను      కాదేమో అనుకుంటాను. అందుకే పలకడానికి కాస్త సమయం పడుతుంది. అది నువ్వు చాలా సార్లు గమనించి అంత పరధ్యానమైతే ఎలా తల్లీ! అనేవాడివి గుర్తుందా !?

“నా పేరునే కాదు నా గతాన్ని కూడా నేను మరిచిపోతున్నాను నాన్న! నువ్వు తోడుగా ఉండి గుర్తు చేస్తావ నుకుంటున్నాను… ఏంచేయమంటావు చెప్పు నాన్నా!?”

*****

‘మరో రోజు ఏం జరిగిందో తెలుసా?’

తొలి ఏకాదశికి తీసుకెళ్దామని ఇంటికొచ్చినప్పుడు ఒకతన్ని చూసి ఎవరీ జంగురు బిల్లి మొహమోడని నువ్వడి గావు గుర్తుందా? ఆయనగారి స్నేహితుడని చెప్పాను ఇంతకీ అతనెవరో తెలుసా…

స్నేహితురాలని ఒకమ్మాయిని తీసుకొచ్చాడు. ఆవిడకి కావలసిన అన్ని ఏర్పాట్లు నన్నే చూసుకోమన్నాడు. అతిధిదేవోభవ అని నువ్వు చెప్పిన మాటలు గుర్తొచ్చి ఆవిడకి ఏలోటూ రాకుండా చూసుకున్నాను. కానీ ఆవిడ అతిధి కాదు నాన్నా నాకు సవితని ఆ రాత్రి గడుస్తుంటే తెలిసింది. మరునాడు ఉదయానే ఆయన్ని నిలదీశాను. ఏం మాట్లాడ లేదు… ఇద్దరూ బయటికెళ్లిపోయారు. సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారు మరో మగ మనిషితో… ఎవరని నేను అడగ లేదు… కానీ ఆయనే దగ్గరకొచ్చి ఈ రాత్రి కూడా నేను తనతోనే ఉంటాను… నువ్వు ఒక్కదానివే ఉండలేకపోతే వీడితో ఉండు అని తనదారిన తను వెళ్లిపోయాడు. నన్ను వాడికి వదిలి… అప్పుడు వాడు చూసిన చూపులు… తలచుకుంటేనే అసహ్యం కలుగుతుంది. నీకు తప్ప ఎవరికి చెప్పగలను? నిన్ను తప్ప ఎవరిని అడగగలను? భర్త ఏం చెప్తే అది చేయమ న్నావు కదా! ఏం చేయమంటావు చెప్పు నాన్నా !?

*****

“వంటలు చేయడం నేర్పించిన నువ్వు వాటిలో విషం కలపడం నేర్పించలేదే… ?”

“ముగ్గులు వేయడం నేర్పించిన నువ్వు ఆముగ్గులలోనే వాడిని ముగ్గులోకి దించి అగ్గి పెట్టడం నేర్పించలేదే….?”

"నువ్వు కరాటే నేర్పించ కపోయినా... కూచిపూడి నేర్పించావు. ఆ నాట్యంతోనే వాడి నరాల్ని తెంచవచ్చని, నువ్వు నేర్పించిన సంగీతంతోనే వాడిని శ్మశానానికి చేర్చవచ్చని నువ్వు చెప్పకపోయినా, తెలుసుకున్న నాకు...   నీ మాటలు... నువ్వు చెప్పిన కట్టుబాట్లు... మాత్రం అవకాశం ఇవ్వడం లేదు నాన్నా...?"

"కాలంతో పాటుగా ముందుకెళ్లాలని కంప్యూటర్స్ నేర్పించావు కానీ   కాలం ఎప్పుడో, ఎక్కడో ఆగిపోయింది!   అక్కడి నుంచి ముందుకు పోవడం లేదు, ఎందుకంటే ముందుకు తీసుకెళ్ళాల్సిన మాలాంటి వాళ్ళు   మీలాంటి వాళ్ళ కోసం కాలంతో పాటే ఆగిపోయారు... నువ్వు నేర్పినవన్నీ నిరర్ధకాలుగానే మిగిలిపోయాయి. నా జీవితానికి   అర్ధకాలనే మిగిల్చాయి." ఇన్ని నేర్పింది నువ్వే   కదా... ఇప్పుడు కూడా ఏం చేయమంటావో నువ్వే చెప్పు నాన్నా !?"

"నా చుట్టూ ముళ్ళకంచెలే ఉన్నాయి ఎటు వెళ్లాలన్నా కష్టంగానే ఉంది. అత్తారిల్లు వదిలి బయటికి వచ్చేద్దామనుకుంటున్నాను, నా కాళ్ళ మీద నేను నిలబడి బ్రతకాలనుకుంటున్నాను... పెళ్ళికి ముందు తండ్రి, పెళ్లయ్యాక భర్త, ఆ తరువాత కొడుకులు ఆడదానికి తోడని మన వాళ్ళు శాసనాలు చేశారు కదా! వాటిని మార్చేద్దామనుకుంటున్నాను? జన్మనిచ్చావు కదా! ఈ జన్మకు తోడుగా ఉండి దారి చూపిస్తావా ?"

"పెళ్ళి   కుదిరిన తరువాత మిమ్మల్ని అందరినీ వదిలి దూరంగా కొత్త మనుషుల మధ్యలోకి, కొత్త వాతావరణం లోకి వెళ్లాలంటే ఎంత భయపడ్డానో మీకు తెలుసు కదా? ఆ భయంతో నాకు జ్వరం కూడా వచ్చింది. అప్పుడు అన్ని పనులు పక్కన పెట్టి నా పక్కనే ఉన్నావు. నా కోసం ఎన్ని నిద్రలేని రాత్రులు   గడిపావో కదా! పెళ్ళైన తరువాత కూడా నాకు జ్వరం వచ్చింది... 'జ్వరం లేని రోజు ఉంటేనే కదా.....!!!' 'ఇక్కడ నీలా నాకు తోడెవరూ లేరు... నాకోసం నిద్రలేని రాత్రులు గడపకపోయినా నేను నిద్ర పోయే వరకయినా తోడుగా ఉండేవారు లేరు. సరికదా అందరూ నిద్రపోయాకే 'నిద్ర నాలోకి రావాలి... నేను నిద్రలోకి పోవాలి...' ఈ రోజుతో పోల్చుకుంటే   ఆ రోజు అలా ఉంది నిజంగా   నా జీవిత మేనా అనిపిస్తుంది. 'ఎన్ని మార్పులు నాన్నా? నా జీవితంలో... పెళ్ళైన నాలాంటి ఆడవాళ్ళ జీవితంలో...' అందరి బతుకులూ ఇలానే ఉంటాయా?"

"మీ అల్లుడిని చూస్తుంటే చాలా సందర్భాలలో నాకు ఎవరు గుర్తొచ్చారో తెలుసా...? నువ్వే..."

ఇప్పుడు ఈ ఉత్తరం చదువుతుంటే నీకు బాగా గుర్తురావలసిన వాళ్ళు ఎవరు చెప్పనా...? అమ్మే..."

"అవును ఆయనలో నాకు నువ్వు కనిపిస్తున్నావంటే   నాలో నీకు తప్పకుండా అమ్మ కనిపించాలి. అమ్మ అనారోగ్యంతో చనిపోయిందనుకున్నాను, కాని అది వాస్తవం కాదు   నీ ప్రవర్తనతో అమ్మ ఆరోగ్యాన్ని అనారోగ్యంగా మార్చి   నువ్వే తనను

చంపేశావు. ఉరిపోసి చంపడం, కిరోసిన్ పోసి తగలబెట్టడం, గోడకేసి తల పగలకొట్టి కాలుజారి పడిందని చెప్పడం.... ఆరోగ్యాన్ని అనారోగ్యంగా మార్చి చంపేయడం.... ఆడవాళ్లని చంపడానికి మగవాళ్ళకు ఎన్ని మార్గాలో కదా నాన్నా! ఇలా అన్నానని బాధపడకండి... ఇది నిజం.. ఇదే నిజం... అని చెప్పడానికి అమ్మ చనిపోయిన రోజు మీరు వదిలిన కన్నీటి చుక్కలు... ఇప్పుడు వదులుతున్న కన్నీటి చుక్కలే అందుకు సాక్ష్యం... కూతురిగా ఒక ఆడదానిని అమితంగా ప్రేమిస్తున్న మీరు భార్యగా మీ జీవితంలోకి వచ్చిన ఆడదానిని అణువంతో, ఆవగింజంతో ఎందుకు ప్రేమించరో అర్థం కావడం లేదు. మీరు మంచి భర్త కాలేకపోయినా మంచి తండ్రి అయ్యారు. గమనించారా నాన్నా? ప్రతిరోజూ పేపర్లో, న్యూస్ ఛానళ్ళలో మగవారి చేతిలో బలైపోయిన ఆడవాళ్లే కానీ ఆడవాళ్ళ చేతిలో బలైపోయిన మగాళ్ల గురించి చదివారా?"

"ఇంతకీ మీకు చెప్పొచ్చే విషయమేమిటంటే... నాకు బ్రతకాలనుంది... అది నీతో, ఇక్కడ నేను ఉండలేను. పదునెక్కిన మగాడి గొడ్డలికి తన మెడను ఇచ్చేసిన విజయవాడ శారదా కాలేజ్ శ్రీలక్ష్మి... యాసిడ్ దాడికి బలైన వరంగల్ స్వప్నిక, ప్రతీక... మగ మృగాల చేతిలో మసిగా మారిన ఆయేషా... ఢిల్లీ నుంచి గల్లీ వరకు కంటతడి పెట్టించిన నిర్భయ... ఒక్కసారిగా ప్రాణాలు కోల్పోయారు. కానీ నేను ప్రతినిముషం బ్రతకడం కోసం ప్రతిక్షణం చస్తూనే ఉన్నాను... ప్రతిరోజూ... బ్రతకడం కోసం చావడం, చస్తూ బతకడం నాకొద్దు... శరీరానికైనా, మనసుకైనా గాయమైతే నొప్పిగానే ఉంటుంది... తట్టుకోవచ్చు... కానీ, గాయం మానకముందే మళ్ళీ గాయమైతే... మళ్ళీ మళ్ళీ గాయమైతే... ఎలా ఉంటుందో ఊహించండి... నా పరిస్థితి అదే... ఇప్పుడు నేను మరణపు అంచుల మీద నుంచి ఈ లేఖ రాస్తున్నాను. మీ రాకడ ఆలస్యం కావచ్చేమో కానీ... నా పోకడ మాత్రం ఆలస్యం కాదు. మీరు వచ్చే లోపే నేను వెళ్లిపోతే నా దహన సంస్కారాలు కూడా మీ చేతుల మీదుగానే, నేను పుట్టి పెరిగిన ఊరిలోనే జరగాలి. ఇది నేను మీకు రాసే చివరి లేఖ... ఈ లేఖ అందిన వెంటనే దయచేసి నన్ను ఈ నరకం నుంచి తీసుకెళ్లగలరు... మీరు ఆలస్యం చేసినా... లేక నచ్చచెప్పడానికి ప్రయత్నించినా నా ప్రయాణం మాత్రం ఆగదు... లక్షణంగా పెంచిన నీ.... సులక్షణ నీకు దక్కాలన్నా.....

*****

ఉత్తరం చదువుతుండగానే ఫోన్ మోగింది...

రఘురామయ్య గుండెల్లో అలజడి మొదలయ్యింది... పోస్టల్ స్ట్రైక్ వల్ల నాలుగు రోజులు ఆలస్యంగా చేరిన ఉత్తరం నగ్న సత్యాల్ని తనకు చేరవేశాయి... ఇప్పుడు ఈ ఫోన్... అనుమానంగానే.... భయం భయంగా ఫోన్ తీశాడు...

ఎవరూ మాట్లాడటం లేదు...

“హలో… హలో…” ఎక్కడో దూరంగా… చాలా చిన్నగా …. ఒక ఏడుపు వినిపిస్తోంది …

“మామయ్య గారు నేను…”

“విషయం రఘురామయ్యకు అర్ధమయ్యింది. ‘ఉరుమురిమి మంగళం మీద పడ్డట్టు’ కాసేపు రఘురామయ్య పోస్టల్ వాళ్ళను తిట్టుకున్నాడు… జీతాలకోసం పోస్టల్ వాళ్ళు చేసిన స్ట్రైక్, నా కూతురి జీవితాన్ని మార్చేసింది… నా కూతురు లాంటి వాళ్ళు ఇంకా ఎంతమంది ఇలా…. అనుకుంటూ కూతురు శవాన్ని తీసుకురావడానికి బయలుదేరాడు…. చిన్న కూతురు సంసారం గురించి ఆలోచిస్తూ….”




అది - 2099 డిసెంబర్ 31 సాయంత్రం 5.37 సమయం.

సూర్యుడు అస్తమించాడనో; ఉదయించాడనో; చంద్రుడు వచ్చేడనో చెప్పడానికి ఆధారాల్లేవు.

వాతావరణం చల్లగా ఉందనో;     ప్రకృతి సుందరంగా ఉందనో అనడానికి అవేంటో ఎవరికీ తెలియవు.

అసలు అలాంటి పదాలు ఈ తరం వారికి గుర్తు లేవు.

గాలిలో తేమ...వచ్చే ఇరవై నాలుగ్గంటల్లో జల్లులతో కూడిన వర్షం     పడుతుందనో; వాతావరణం పొడిగా     వుంటుందనో చెప్పడానికి వాతావరణ కేంద్రాన్ని మూసేసి చాలా ఏళ్ళయింది.

ఇప్పుడు వాతావరణమంతా ఎప్పుడూ పొగమంచు నిండిన     పొల్ల్యూషన్ పొరతో కప్పబడి ఉంటుంది. పెద్దగా మార్పులేవీ ఉండవు. అంతలో ఫోన్ మ్రోగింది.

ఈజిట్! ప్రకాష్!"

"యా"

"దిస్ ఈజ్ డాక్టర్ శివం ఫ్రం శివం ఇంటర్నేషనల్ హాస్పిటల్, తుళ్ళూరు"

"చెప్పండి డాక్టర్!"

"రాధాక్రిష్ణ గారు మీకేమవుతారు?"

"గ్రేట్ ...     గ్రేట్ గ్రాండ్ ఫాదర్ సార్! ఏమైంది ?"

"మీకో గుడ్ న్యూస్"

"చెప్పండి."

"ఆయన కోమా నుంచి బయట పడ్డాడు"

"ఈజిట్! నాకు చాలా చాలా హాప్పీగా ఉంది."

"అవునండి! ఇది ప్రపంచంలోనే పదహారవ వింత. సుమారు యాభై సంవత్సరాల తర్వాత కోమా నుంచి బయట పడడం "

"నేనిప్పుడే బయలుదేరుతున్నాను డాక్టర్!"

"త్వరగా రండి."

ఫోన్ పెట్టేసిన ప్రకాష్ కు ఈ న్యూస్ చాలా ఎక్సైటింగా ఉంది. త్రిల్లింగ్ గా కూడా ఉంది.

సుమారు యాభై సంవత్సరాలకు ముందు తనకు తాతకు తాత అయిన రాధాక్రిష్ణకు ఆక్సిడెంటై కోమాలోకి వెళ్ళిపోయాడు. వెంటనే హాస్పిటల్లో చేర్పించాడు తాతయ్య. కానీ రోజులు గడిచినా; వారాలు గడిచినా, నెలలు నెలలు గడిచినా ప్రయోజనం లేదు. కోమాలోంచి బయటపడేంత వరకు హాస్పిటల్లోనే ఉంచాలని తాతయ్య చివరి కోరికట. అలాగే మా నాన్న పోతూ పోతూ నన్ను కూడా కోరడం జరిగింది. ఖర్చులు భారమైనా తప్పని పరిస్థితి. అయితే ఆ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందిప్పుడు. రీసర్చ్ కోసం ఆయన్ని మెయింటైన్ చేస్తోంది. ప్రకాష్ గాలిలో తేలిపోతున్నాడు. త్వరలో తనకు తాతకు తాతను చూడబోతున్నాడు. తాతకు తాతను చూసే అదృష్టం ఎందరికి ఉంటుంది. ఊహే ఎంత హాయిగా ఉంది. తన తరం వారికి ఎవరికి లేని అదృష్టమది. మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది.

రెండు వాటర్ ట్యూబ్స్ నోట్లో వేసుకున్నాడు. మల్టి ప్రూఫ్ డ్రెస్ వేసుకున్నాడు. ఆక్సిజన్ సిలిండర్ భుజానికి తగిలించుకున్నాడు.

కొడుకు కుమార్ ఇంకా స్కూల్ నుంచి రాలేదు. వాడికి ఫోన్ లో విషయం చెప్పి ఇంటికి తాళం వేసి కారు స్టార్ట్ చేశాడు.

అంతక్రితమే ఆన్ చేసిన మల్టి ఫ్రూఫ్ మిషన్ మెల్లగా పనిచేయడం ప్రారంభమయింది. ఎదురుగా రోడ్ అంతా పొల్ల్యూష న్ తో బ్లాకై ఏమీ కనిపించడం లేదు. హెడ్ లైట్ కాంతికి రోడ్ పైన పొల్ల్యూషన్ తెర విచ్చుకుంది. ఇప్పుడు రోడ్ అస్పష్టంగా కనిపిస్తోంది. కారు టేకాఫ్ కు రెడీ అయింది.

ఇంతలో ఎక్కడినుంచి వచ్చిందో దోమల దండు కారు ను చుట్టేసింది. అలెర్ట్ అయిన ప్రకాష్ వెంటనే మస్కిటో గ్యాస్ లీక్ చేశాడు. దెబ్బకు పారిపోయాయి. కొన్ని చచ్చి కింద పడ్డాయి.

ప్రకాష్ ఏదో పాట హం చేస్తూ హుషారుగా కారును ముందుకు పోనిచ్చాడు.

అతనికి గాలిలో తేలిపోతునట్లుంది. చాలా గమ్మత్తుగా ఉంది. ఈ మాడ్రన్ యుగంలో గట్టిగా అరవై ఏండ్లు బ్రతకడమే గొప్ప. అలాంటిది - తన గ్రేట్... గ్రేట్ గ్రాండ్ ఫాదర్ ఇన్నేళ్ళకు కోమా నుంచి బయట పడడం థ్రిల్లింగా ఉంది. అద్భుతంగా ఉంది. అవును. ఇంతకీ ఆయన వయసు ఎంతుంటుంది? 150...200 ఏళ్ళు? దాటి ఉంటుందా? చాలా ఎక్సైటింగా ఉంది.

ఎదురుగా ఎలుకలు రోడ్ దాటుతున్నాయి. అవి ఇంచుమించు ఏనుగు సైజుల్లో ఉన్నాయి. స్లో చేసి అవి వెళ్ళిన తర్వాత కారుని పోనిచ్చాడు ప్రకాష్.అన్నీ అంతరించిపోతున్నా ఈ దోమలు, ఈగలు, ఎలుకలు ఎలా బలిసిపోతున్నాయో ఎవరికి అంతు పట్టడం లేదు. ఆలోచిస్తూనే హాస్పిటల్ చేరుకున్నాడు ప్రకాష్. అక్కడి పరిస్థితి చూసి విస్తుబోయాడు. అప్పటికే ఈ వార్త దావానలంగా ప్రపంచమంతా వ్యాపించింది. ప్రజలు, దేశవిదేశాల్నించి అప్పటికే శాస్త్రవేత్తలు, డాక్టర్లు, మీడియా ప్రతినిధులు గుమిగూడి ఉన్నారు. అంతా గోలగోలగా ఉంది. అరుపులు, కేకలు, హర్షాతిరేఖాలతో ప్రదేశమంతా మారుమ్రోగిపోతోంది. పోలీస్ రంగప్రవేశంతో కొద్ది సద్దుమనిగినా ప్రపంచంలోని పదహారవ వింత చూడబోతున్నామన్న ఆనందం ప్రతి ఒక్కర్ని నిలవనీయడం లేదు.

ఎలాగో పోలీస్ ల సహాయంతో లోనికెల్లి డాక్టర్ శివాన్ని కలిశాడు ప్రకాష్.

టైట్ మల్టిసేఫ్టి ఫుల్ ప్రూఫ్డ్ ; స్పెషల్లి ప్రొటెక్టెడ్ ఐ సి యూ లోకి తీసుకెళ్ళాడు ప్రకాశాన్ని డా.శివం.

"మిస్టర్ రాధాక్రిష్ణా ! సీ యువర్ గ్రేట్... గ్రేట్ గ్రాండ్ సన్ !"

శరీరమంతా బ్యాండేజ్ లతో ముఖం మాత్రం కొద్దిగా కనపడుతోంది.

ప్రకాశానికి ఆనందంతో నోట మాటలు పెగలడం లేదు.

"హౌ ఆర్ యూ గ్రేట్ గ్రాండ్ పా?" ప్రకాష్ రాధాక్రిష్ణ మొహంలో మొహం పెట్టి మెల్లగా గొణిగాడు.

రాధాక్రిష్ణ మొహం విప్పారింది. కళ్ళు మెల్లగా తెరిచాడు. మాట్లాడడానికి ప్రయత్నించాడు గానీ పెగలడం లేదు. నీరసంగా ఉన్నట్లుంది.నర్స్ సెలైన్ బాటల్ సరి చేసింది. అయినా లాభం లేదు. మెల్లగా కళ్ళు మూతలు పడుతున్నాయి. "సారీ మిస్టర్ ప్రకాష్! ఆయన బాడీ ఈ వాతావరణానికి అడ్జస్ట్ కాలేకపోతోంది. వుయ్ హేవ్ టు ట్యూన్ హిజ్ బాడి టు ద ప్రెజెంట్ అట్మాస్ఫియర్."

ప్రకాష్ ఆనందమంతా ఒక్కసారిగా ఆవిరైపోయింది.

"అడ్జస్ట్ కాకపోవడం ఏమిటి డాక్టర్?" ఆందోళనగా అడిగాడు.

"అవును ప్రకాష్ గారూ! అప్పటి అట్మాస్ఫియర్ కు ఇప్పటి అట్మాస్ఫియర్ కి ఏదో తేడా ఉంది. అది స్టడీ చేయాలి."

"ఎంత కాలం పడుతుంది సార్!"

" చెప్పలేం. వుయ్ ట్రై అవర్ లెవెల్ బెస్ట్. మీకు మళ్ళీ ఫోన్ చేస్తాం. వెళ్ళి రండి."

"అలాగే సార్!" అంటూ సెలవు తీసుకున్నాడు ప్రకాష్ నిరుత్సాహంగా.

ఇంతలో ఫోన్ రింగ్ అయింది.

"హల్లో!"

"హల్లో! డాక్టర్ శివం! ఐయాం డాక్టర్ ఫెడరిక్, డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసర్చ్ అండ్ డెవలప్ మెంట్, న్యూయార్క్. వాట్ ఈస్ ద లేటెస్ట్ డెవలప్ మెంట్ "

"హిజ్ బాడీ ఈజ్ నాట్ రెస్పాండింగ్ టు ద ప్రెజెంట్ ఎన్విరాన్ మెంట్ డాక్టర్"

" ఓ! టేక్ ద అసిస్టన్స్ ఆఫ్ రినౌండ్ సైంటిస్ట్స్. స్కాలర్స్, ప్రొఫెసర్స్; హువెవెర్ యు వాంట్ ఫ్రం అక్రాస్ ద గ్లోబ్. హీ ఈజ్ వెరీ ఇంపార్టెంట్ ఫార్ అవర్ రీసర్చ్ యాం గిల్. మనీ ఈజ్ నాట్ క్రైటేరియా. ఓ కే!"

"ఓ కే సార్!"

"బీ క్విక్"

ఫోన్ కట్ అయింది.

శివం మెదడు పాదరసంలా పనిచేయడం ప్రారంభించింది. దీన్నొక సవాల్ గా తీసుకొని పనిచేస్తున్నాడు మొదట్నించి. డాక్టర్ ఫెడరిక్ దీని పైన చాలా ఆశలు పెట్టుకున్నాడు. ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదు. ఈ ప్రయోగం సక్సెస్ అయితే; భవిష్యత్ లో మానవ కళ్యాణానికి దోహద పడుతుంది.

మరో పదినిమిషాల్లో అతని ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి. ఫోన్లోనే మంతనాలు జరిపాడు. మరో అరగంటలో రిస్క్యూ టీం తయారయింది. టీం లో ఒక సైకియాట్రిస్ట్, మెటలాజికల్ డిపార్ట్ మెంట్ డైరెక్టర్, రిప్యూటెడ్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ లకు సంబంధించిన ఫేమస్ పర్సనాలిటీస్ ఉన్నారు. పది మంది ఉన్న రిస్క్యూ టీం సభ్యులు మూడో రోజు ఉదయానికల్లా

తుళ్ళూర్ ఇంటర్నేషనల్ ఏర్ పోర్ట్ లో దిగారు. మరో గంటలో రిస్క్యూ టీం సభ్యులంతా వార్ రూంలో సమావేశమయ్యారు. పది గంటల మేధో మధనం తర్వాత వార్ రూం తలుపులు తెరుచుకున్నాయి.

అక్కడొక యుద్ధ వాతావరణం నెలకొంది. మనిషి మేధో శక్తికి - సృష్టి రహస్య చేధనానికి మధ్య యుద్ధం.నాలుగు రోజుల అవిరామ కృషి ఫలితంగా రాధాక్రిష్ణ మెల్లగా కళ్ళు తెరిచాడు. మెడిసన్స్ కు రెస్పాండ్ అవుతున్నాడు. ఈ వాతావరణానికి అలవాటు పడుతున్నాడు. అప్పటికీ; ఇప్పటికీ వాతావరణంలో కలిగిన భారీ మార్పుల వివరాలతో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఈ వాతావరణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఒక్కొక్కటిగా వివరిస్తున్నారు. అవంతా జీర్ణించుకోవడానికి అతని మెదడు పూర్తిగా సహకరించడం లేదు.అయినా వాళ్ళ ప్రయత్నం మానడం లేదు. మెదడులోకి ఫోర్స్ గా ఇంజెక్ట్ చేయడానికి శాయశక్తులా ట్రైనింగ్ ఇస్తున్నారు.

మిస్టర్ రాధాక్రిష్ణా! జాగ్రత్తగా వినండి. గ్లోబలైజేషన్ ఫలితంగా మానవుడు సంపాదన మోజులో పడి పర్యావరణాన్ని విస్మరించాడు. చెట్లు కొట్టేశాడు. అడవులు నరికేశాడు. జంతువులను చంపేశాడు. ఫలితంగా వర్షాలు ఆగిపోయాయి. భూగర్భ జలాలు అంతరించాయి. పంటలు లేవు. పరిశ్రమలు విపరీతంగా పెరిగాయి. వాటి ద్వారా కాలుష్యం పెరిగింది. శబ్ద కాలుష్యం, నీటి కాలుష్యం, గాలి కాలుష్యం ... ఇలా రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోయి స్వచ్ఛ మైన నీరు, గాలి దొరకడం దుర్లభమయిపోయింది. భూమిపై సుమారు యాభై అడుగుల వరకు కాలుష్య పొర దట్టంగా కూరుకుపోయింది. చివరికి ఈ కాలుష్య ప్రభావం వల్ల సూర్య కాంతి కూడా భూమిపై పడడం మానేసింది. అందుకే పగలు కూడా చీకటి గానే ఉంటుంది. ఫలితంగా విష పురుగులు, క్రిములు, కీటకాలు విజృంబిస్తున్నాయి. ఏమాత్రం ఏమారుపాటైనా ప్రాణాలకే ముప్పు. వాతావరణమే విషపూరితం అయిపోయింది. నదులే కాదు సముద్రాలు కూడా ఎండిపోయాయి. పంటలు పండవు. మంచి నీళ్ళు దొరకవు. మంచి గాలి దొరకదు. మీ కాలంలో గాలి, వెలుతురు, నీరు స్వచ్ఛంగా ఉండేది. ఫ్రీ గా దొరికేవి. ఇప్పుడు అన్నిటికీ పే చేయాలి. “ డాక్టర్ హర్ష ఆగేడు.

రాధాక్రిష్ణ కదలడం గమనించాడు. ఏదో వినరానిది విన్నట్లు కళ్ళు ఆశ్చర్యానికి గురి అయ్యాయి. ఏదో చెప్పడానికి పెదవులు కదిలాయి కానీ మాట రాలేదు. అలిసిపోయినట్లుగా మెల్లగా అతని కళ్ళు మూతలు పడ్డాయి.

ఆక్సిజన్ ట్యూబ్ సవరించి గది బయటికొచ్చారందరూ.

ఆ రాత్రంతా రాధాక్రిష్ణ ఉలికులికి పడడం నర్స్ గమనించింది. ఉదయమే డాక్టర్ కి విషయం చెప్పింది.

పది గంటలకి మళ్ళీ కౌన్సెలింగ్ మొదలయింది.

"రాధాక్రిష్ణ గారూ! హౌ డు యు ఫీల్ ? ఎనీ ప్రాబ్లం?"

రాధాక్రిష్ణ ఏదో గొణిగాడు. ఏదో చెప్పాలని లేవబోయాడు.

"నో ...నో. మీరిప్పుడు లేవకూడదు. మీరు మామూలు పనులు చేసుకోవడానికి మరికొంత టైం పడుతుంది. అంతవరకు మేము చెప్పేది జాగ్రత్తగా విని మైండ్ లో నిక్షిప్తం చేసుకోండి.ఓ కే!" డాక్టర్ శివం అనునయంగా చెప్పాడు.

"రైట్. నిన్న వాతావరణంలో మార్పుల కారణంగా భూమి పై పడ్డ పెను మార్పులను వివరించాను. ఫలితంగా మనిషి జీవితం ఎంతో ప్రభావితమయింది. స్వచ్ఛమైన గాలి, నీరు లేక పశుపక్ష్యాదులు నశించిపోయాయి. యావత్ ప్రాణకోటి విలవిలలాడాయి. వృక్షాలు ఎండిపోయాయి. అయినా కూడా వీటిని తట్టుకొని ఒకటి అరా అక్కడక్కడా కనిపిస్తున్నాయి. బతికున్న ప్రాణులు కూడా పూర్తిగా విషపూరితమయ్యాయి. సైంటిస్ట్స్ పరిశోధనలు చేసి మనిషి కి కావల్సిన స్వచ్ఛమైన గాలి, నీరు లాబ్స్ లో తయారు చేస్తున్నారు. ఎంత ప్రయత్నించినా మనిషి కి కావల్సినంత ఉత్పత్తి చేయలేకపోతున్నారు. పంటలు, ఆహార ధాన్యాలు లేవు కనుక మనిషి బ్రతకడానికి కావాల్సిన శక్తి కోసం 'ఫుడ్ క్యాప్సూల్స్'' కనిపెట్టారు. ఈ క్యాప్సూల్స్ ఆహారానికి ప్రత్యామ్నాయం కాకపోయినా బ్రతకడానికి పనికి వస్తాయి. దీని పైన ఇంకా ప్రయోగాలు జరుగుతున్నాయి." ఆగాడు డాక్టర్ హర్ష.

రాధాక్రిష్ణ కళ్ళు పెద్దవయ్యాయి. పెదవులు అదరసాగాయి. పిడికిలి బిగుసుకున్నాయి. ఛాతి ఎగిసెగిసి పడులోంది. శ్వాస ఆడడం ఇబ్బందవులోంది. నర్స్ ఆక్సిజెన్ ట్యూబ్ మార్చింది.

కంప్యూటర్ లోని విద్యుత్ తరంగాలు ఒక్కసారి ఫ్లక్ట్యు యేట్ అయ్యాయి. డాక్టర్ శివం కంప్యూటర్ని మానిటర్ చేస్తూ నర్స్ కి ఆదేశాలిస్తున్నాడు.

పది నిమిషాలకి రాధాక్రిష్ణ మత్తులోకి జారుకున్నాడు.

"దశాబ్దాలుగా ప్రకృతి ప్రమాద ఘంటికలు మ్రోగిస్తూనే ఉంది. అయినా మానవుడు పెడ చెవిన పెట్టాడు. ఒక్కొక్కటిగా జంతు జాతి, పక్షి జాతి నశిస్తూ వచ్చాయి. వివిధ రకాలైన కాలుష్యాలు కబలిస్తున్నా మనిషి నిద్ర నటించాడు. గ్లోబలైజేషన్ వెంట పరుగులు తీశాడు. ఇప్పుడు మనిషి మనుగడకే పెను ముప్పు పొంచి ఉంది. మనిషి స్వేచ్ఛగా జీవించలేనప్పుడు ఎవరికోసం ఈ అభివృద్ధి? ఎవరి కోసం ఈ పరుగులు? " రాధాక్రిష్ణ మనసులోని ఉక్రోషం పెదవి దాటలేదు.

కంప్యూటర్ని కాకుండా మనసును చదివే నేర్పే ఉండి ఉంటే డాక్టర్ శివానికి ఆ మాటలు వినపడి ఉండేవి.

ఆ రోజు సాయంత్రం రెస్క్యూ టీం ఎమర్జెన్సీ మీటింగ్ లో పరిస్థితిని సమీక్షించింది. కౌన్సిలింగ్ కి అతడి మెదడు ఎలా రియాక్టవుతుందో అబ్జర్వేషన్ లో ఉంచమని డాక్టర్ బృందానికి ఆదేశాలు వెళ్ళాయి. రాత్రంతా అబ్జర్వేషన్ లో ఉంచి రికార్డ్ చేశారు. మెదడు రియాక్ట్ అవుతోందని రిపోర్ట్స్ అందగానే రిస్క్యూ టీం , డాక్టర్స్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కౌన్సిలింగ్ కంటిన్యూ చేయడానికి నిశ్చయించారు. ఉదయం పది గంటలకి మళ్ళీ కౌన్సిలింగ్ మొదలయింది. రాధాక్రిష్ణ పరిస్థితి నిన్నటికన్నా మెరుగయింది. కళ్ళలో కాంతి వచ్చింది.

"రాధాక్రిష్ణా గారూ! ఇంతవరకూ మనం పర్యావరణంలో వచ్చిన పెను మార్పులు; ఫలితంగా అనివార్యంగా మానవ జీవితాల్లో ఏర్పడ్డ సంక్షోభం ..తన మేధో శక్తితో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న విధానాన్ని మాట్లాడుకున్నాం. ఇలాంటి సమయంలో మానవ జాతిని కాపాడుకోవడానికి మనమంతా కృషి చేయాలి. మనం చాలా ప్రమాదంలో ఉన్నాం. ఎందుకంటే మన ప్రాణాలకు క్షణం క్షణం ముప్పు పొంచి ఉంది. మన ప్రాణాలు చాలా విలువైనవి. వాటిని కాపాడుకోవడం మన విధి. లేకుంటే మానవ జాతే అతి త్వరలోనే అంతరించే ప్రమాదం ఉంది. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. ఈ ప్రకృతి వైపరీత్యం గూర్చి ప్రతి ఒక్కరికి అవగాహ న కలిగించాలి. అన్ని జాగ్రత్తలూ తీసుకుని మనతో పాటు మన భవిష్యత్ తరాలను బ్రతికించాలి. రాధాక్రిష్ణ గారూ" ఆగాడు డాక్టర్ హర్ష.

రాధాక్రిష్ణ కళ్ళు మెల్లగా తెరిచి హర్షను సూటిగా చూసి మళ్ళీ మూసుకున్నాడు.

హర్ష చెప్పడం మొదలెట్టాడు.

" ఇప్పుడున్న పరిస్థితుల్లో మనం చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మాములుగా బ్రతడానికే యుద్ధం చేయాల్సిన పరిస్థితి. అర్థం చేసుకోండి ! జాగ్రత్తగా వినండి. మొదటిది గాలి. వెలుపల గాలంతా కలుషితమయి విషతుల్యమైపోయింది. బయటికి వెళ్ళేటప్పుడు మల్టీప్రూఫ్ డ్రెస్ కంపల్సరీ. లేకుంటే బయట నిలబడ్డ అర నిమిషంలో కలుషిత విషవాయువుల వల్ల ప్రాణాలు

పోతాయి. మరో నిమిషంలో బాడీ పూర్తిగా గాలిలో కలిసిపోతుంది. మనకేమీ మిగలదు. అంత విషపూరితం బయటి గాలి. అందుకే మనకు కావాల్సిన గాలిని చిన చిన సిలిండర్ రూపంలో ఇస్తుంది ప్రభుత్వం. అలాగే 'ఫుడ్ కాప్స్యూల్స్'' కూడా నెల నెలా కూపన్ రూపంలో ప్రభుత్వమే అలాట్ చేస్తుంది. వాటర్ ట్యూబ్స్ కూడా ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. అన్నీ జాగ్రత్తగా; పొదుపుగా వాడుకోవాలి. ఎందుకంటే వాటి ప్రొడక్షన్ కు కూడా కొన్ని పరిమితులున్నాయి. వీటిని వాడడం వల్ల కూడా కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయని ఈ మధ్యే ప్రూవ్ అయింది. ఆల్టర్నేటివ్ కోసం సైంటిస్ట్స్ అహోరాత్రులు ప్రయోగాలు చేస్తున్నారు. " ఆపేడు హర్ష.

రాధాక్రిష్ణ పిడికిలి బిగిసింది. పళ్ళు పటపటా కొరికాడు. కళ్ళు ఎర్రబడ్డాయి కోపంతో. వెంటనే ఒళ్ళు చల్లబడింది.

కంప్యూటర్ లో డేంజర్ బల్బ్ వెలిగింది. డాక్టర్ టీం కంగారుపడి రంగంలోకి దిగింది.

సుమారు అరగంట రెస్క్యూ టీం ప్రయాస పలితంగా రాధాక్రిష్ణ మళ్ళీ కళ్ళు తెరిచాడు.

అతని మనసంతా అదోలా ఉంది. ఎందుకిలా అయింది? మానవ జాతి ప్రమాదం అంచుల్లో ఎందుకుంది? దీనికి కారకులెవరు? ఎవరిని నిందించాలి? దీన్నంతా ఆపడానికేం చేయాలి? ఏదైనా చేయాలి...అదీ వెంటనే ...వెంటనే చేయాలి? ఏం చేయాలి...ఏం చేయాలి??? రాధాక్రిష్ణ మస్తిష్కమంతా ఆలోచనలు ...ఆలోచనలు. ఏదో చేయాలి...ఏదో చేయాలి???

ఏదో చెప్పాలని చూశాడు. మాటలు పెగలడం లేదు.

వ్రాసి చూపడానికి పెన్,పేపర్ కావాలని సైగ చేశాడు.

"పెన్నులు, పేపర్లు పోయి చాల కాలమయింది రాధాక్రిష్ణ గారూ! మీరేమైనా చెప్పదలుచుకుంటే ఆ కీ బోర్డ్ పైన టైప్ చేయండి" హర్ష కీ బోర్డ్ ను చూపించాడు.

నొసలు చిట్లించి అదోలా చూసి కళ్ళు మూసుకున్నాడు రాధాక్రిష్ణ.

మెల్లగా మత్తులోకి జారుకున్నాడు. నిశ్శబ్దంగా మిగిల్నందరూ బయటికొచ్చారు.

అర్ధరాత్రి దాటిన తర్వాత రాధాక్రిష్ణకు మెలకువ వచ్చింది. మళ్ళీ అవే ఆలోచనలు ఎడతెరిపిలేకుండా.

క్విక్... బ్రింగ్ బ్యాక్ నార్మల్సీ. మనిషి మనుగడకే ముప్పు వాటిల్లినప్పుడు సైన్స్ ఎంత డెవలప్ అయినా ఉపయోగమేమిటి ? ఇలాంటి ప్రపంచంలో నాకు బతకాలని లేదు. నా కీ బతుకొద్దు. ఇలాంటి బతుకొద్దు. “

తనకు తగిలించిన ఒక్కొక్క పరికరాన్ని లాగి పడేస్తూ విసురుగా లేచి నిలబడ్డాడు. స్టాఫ్ పట్టుకోవడానికి ప్రయత్నించారు కాని ఉపయోగం లేకపోయింది. అతనికి అంత శక్తి ఎక్కడినుంచి వచ్చిందో ...అందర్నీ విదిలించుకొని వడివడిగా వీధిలోకి పరిగెత్తాడు. "నా కీ బతుకొద్దు...నా కీ బతుకొద్దు" అరుస్తూ నిటారుగా నిలబడ్డాడు. అందరూ నిశ్చేష్టులై చూస్తుండగానే రాధాక్రిష్ణ బాడీ అదృశ్యమై గాలిలో కలిసిపోయింది."నా కీ బతుకొద్దు...నా కీ బతుకొద్దు" అందరి చెవ్వుల్లో గింగురుమంటున్నాయి.

*******************************

"నా కీ బతుకొద్దు...నాకీ బతుకొద్దు" గట్టిగా అరుస్తూ ఉలిక్కి పడి లేచాడు ప్రకాష్

భయంలో వణకిపోయాడు. ఒళ్ళంతా చెమటలో తడిసి ముద్దయింది. నాలుక పిడచకట్టుకుపోయింది.

చుట్టు అంతా పరిశీలనగా చూశాడు . అంతా మాములుగానే ఉంది. మనసు కుదుట పడింది.

భయంకరమైన కల ...ఇంకా వణుకు తగ్గ లేదు.

"పర్యావరణం-పరిణామాలు" సైన్స్ మాగజైన్ లో వ్యాసం చదువుతూ అలానే నిద్ర పోయినట్లు గుర్తు. ప్రకృతి హెచ్చరికల్ని మనం పట్టించుకోకపోతే జరగబోయే వైపరీత్యం కల రూపంలో సాక్షాత్కరించినట్లయింది. ఒక్కసారిగా ఒళ్ళు జలదరించిందిశబ్దానికి భార్య ఉమ లేచి కూర్చుంది." ఏమయిందండి! పీడ కలేమైనా వచ్చిందా?" అంటూ మంచి నీళ్ళు అందించింది."అవును పీడ కలే.." గడ గడ నీళ్ళు తాగి చెమటలు తుడుచుకున్నాడు ప్రకాష్ . "నీకే కాదు... మాకూ వద్దు అలాంటి బతుకు గ్రాండ్ పా! ! అవును. ఏదో వెంటనే చేయాలి. వేగంగా దూసుకొస్తున్న ఈ దుష్పరిణామానికి వెంటనే అడ్డుకట్ట వేయాలి. పర్యావరణాన్ని రక్షించాలి. లేకుంటే ముందు తరం మనల్ని క్షమించదు. " ప్రకాష్ కృతనిశ్చయానికి వచ్చాడు.

తన కలను ఒక వీడియో తీసి సోషియల్ నెట్ వర్క్ లో పెట్టాడు. పర్యావరణాన్ని కాపాడడానికి సలహాలు; సూచనలు ఆహ్వానించాడు. ప్రపంచం నలు మూలలనుంచి లైక్ మైండెడ్ మేధావులు, విద్యార్థులు, యువత, విజ్ఞానవేత్తలు ముందుకు వచ్చారు. ఒక మహోన్నత ఆశయం ఉద్యమం రూపంలో ఊపిరిపోసుకుంది. రండి. మనమూ చేతులు కలుపుదాం.




బస్సు షెల్టర్ లో ఒక మూలన ముడుచుకుని పడుకున్న లచ్చి సూర్యకిరణాలు మీద పడడంతో కళ్ళు తెరిచింది. దట్టంగా పట్టిన మబ్బుల చాటునుంచి కొంచెం కొంచెం గా ఎండ వస్తోంది. రాత్రంతా వర్షంలో తడవడం వల్లో ఏమో ఒళ్ళు వేడిగా వుండి నీరసంగా వుంది. ఊరేమిటో, తల్లిదండ్రులెవరో తెలియదు. ఆదరించేవారు లేక అడుక్కుంటూ కాలం గడుపుతోంది. ఎవరు పెట్టారో మరి తనకి లచ్చి అనే పేరు . ఊహ తెలిసిన దగ్గర్నుంచి అడుక్కోవడమే తన వృత్తి. పేరులో లక్ష్మి, తీరులో దరిద్రం. తన పేరుకి జీవితానికీ పొంతన లేదు. అమాయకంగా నవ్వుకుంది.

ఒక్కోసారి ఎక్కువ తిరక్కుండానే తినడానికి ఏదో ఒకటి దొరుకుతుంది. ఒక్కోసారి రోజంతా తిరిగినా కనీసం టీ తాగడానికి కూడా వచ్చిన డబ్బులు సరిపోవు. అప్పుడు తెలుస్తుంది ఆకలి బాధ. బట్టల్ని పిండినట్లుగా పేగులన్నింటిని ఎవరో గట్టిగా మెలితిప్పుతున్నట్లు, ఆ బాధ కంటే ప్రాణాలుపోవడమే మంచిదనిపించేది. ఇంకా కొంచెం సేపు పడుకుంటే బాగుండనిపించింది. లేవాలని అనిపించట్లేదు. కానీ తప్పదు. కూటికి గడవని వాళ్ళకి ఎక్కువసేపు పడుకునే హక్కు లేదు. మూలుక్కుంటూనే లేచింది. అయిదనిపించినట్లుగా ముఖం కడుక్కుంది. రెండు రోజుల క్రితం తినగా మిగిలిన అన్నం మీద కాగితాన్ని కప్పి వుంచింది. ఆకలిగా అనిపించి కాగితం తీసి చూసింది. పాచిపోయిన వాసన గుప్పుమని తగిలింది. ఆకలిని తట్టుకుంది కానీ ఆ వాసనకు కడుపులో దేవినట్టయింది.

అన్నం అవతల పడేసి గిన్నె శుభ్రంగా కడిగి అక్కడ నుండి లేచింది. యాయే లచ్చి ఎళ్తన్నావా? రాతిరంతా జరం, ఒళ్లు బాగా కాలిపోయింది. తగ్గిందా ఇప్పుడు..." అని అడిగాడు బయటి నుంచి వస్తున్న ముసలతను. వెళ్ళేదల్లా ఆగి ఆయన వైపు చూసి నవ్వి "ఒల్లు ఏడిగానే వుంది, నీరసంగా కూడా వుంది. అయినా తప్పదుగా తాతా..." అంది. కూసుంటే తగ్గే నీరసం కాదు తాతా ఇది..." అంది. సరే నీ ఇట్టం ...అన్నట్లు చెయ్యూపాడు తాత.

నాలుగు రోడ్ల కూడలి వచ్చిపోయే వాహనాల రొదతో గజిబిజిగా వుంది. సిగ్నల్ పడింది. ఒక్కొర్నీ దాటుకుంటూ ముందుకు వచ్చి "బాబూ... ధర్మం సేయండి బాబూ..." అంటూ అడగసాగింది లచ్చి. చామన చాయగా వున్నా ముఖం కళగా వుంది. ముఖం కళగా వున్నా ఆకలి వల్ల నీరసం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది, ఆగి వున్న ఒక స్కూటరతని దగ్గరికెళ్ళి బాబూ... ఆకలిగా వుంది ధర్మం సేయండి బాబూ.. అన్నం తిని రెండు రోజులయింది బాబూ... అంటూ దీనం గా అడగసాగింది. కనీసం ముఖం కూడా చూడకుండానే పో అన్నట్లు చెయ్యేత్తాడు. కొంతమంది లేదన్నట్లు ముఖం చిట్లించి సమాధానం చెప్తున్నారు.

కాళ్ళు తడబడుతున్నాయి నీరసంతో, నడవలేక నడవలేక నడుస్తూ అందర్నీ అడుగుతూ ముందుకెళ్తోంది లచ్చి. ఆగి వున్న కారతన్ని అడిగితే రూపాయి తీసి గిన్నెలో వేశాడు. డమరుకాన్ని మోగించినట్లుగా చప్పుడు చేస్తూ అటూ ఇటూ దొర్లింది రూపాయి. "దయగల మారాజు ... సల్లంగుండాలి..." అంటూ నోటికొచ్చినదీవెనలిస్తూ ముందుకెళ్తోంది.

ఆ రోడ్డు నుండి పక్కరోడ్డుకెళ్ళింది. కాళ్ళల్లో సత్తువలేక నడవడానికి సహకరించట్లేదు. దానికి తోడు ఇందాకటివరకు అంతో ఇంతో చురుక్కుమనిపించిన ఎండ పోయి ఆకాశం రంగు మార్చుకుంది. వాన రాకడ ప్రాణం పోకడ తెలియదన్నట్లుగా ఏ నిముషం ఐనా వాన వచ్చేట్లుగా వుంది. లచ్చిలో తొందర ఎక్కువయింది. ఇంతసేపు కాళ్ళరిగేలా తిరిగినా ఒక్క రూపాయికి మించి రాలేదు. ఈ రోజు కూడా పస్తు తప్పేట్లు లేదు. దానికి తోడు వాన పడక ముందే వెళ్ళాలన్న ఆరాటం లచ్చిని మరింత తొందర పెట్టసాగింది.

"ధర్మం సేయండి బాబూ.. పున్నెముంటుంది... అన్నం తిని రెండు రోజులయింది బాబూ..." అంటూ అందర్నీ అడుగుతూనే వుంది. ఎప్పుడు గ్రీన్ లైట్ వెలుగుతుందా, ఎప్పుడెప్పుడు ఆ ట్రాఫిక్ లోంచి బయటపడి ఇంటికి వెళ్దామా అన్న ఆలోచనలో వున్న జనం లచ్చిని పట్టించుకునే స్థితిలో లేరు. అప్పటికే మధ్యాహ్నం దాటిపోయింది. కడుపులో ఎత్తులేక పేగులు అల్లాడుతున్నాయి. తను అడుక్కోవడం మొదలుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకూ చాలాసార్లు రెడ్ లైట్ పడింది. గ్రీన్ లైట్ పడింది. వెళ్ళేవాళ్ళు వెళ్తున్నారు. వచ్చేవాళ్ళు వస్తున్నారు. అంత దీనం గా అడుక్కుంటున్నా ఒక్కరూ కూడా తన వంకా చూడట్లేదు, రూపాయి ధర్మమూ చేయట్లేదు.

చల్లగా మొదలయిన గాలి కాసేపటికి ఉధృతం గా మారింది. చిన్న చిన్న తుంపరలు పడసాగాయి. ఆఖరి ప్రయత్నం గా ఆగివున్న స్కూటర్ దగ్గరికెళ్ళి "ధర్మం సేయండి బాబూ..." శానా ఆకలి గా వుంది బాబూ....! రెండు రోజులనుంచి

అన్నం తినలేదు బాబూ... ఒక్క రూపాయి ధర్మం సేయండి బాబూ... " కడుపులోని పేగులన్నిటినీ బయటికిలాగి లేని ఓపిక తెచ్చుకుంటూ అడిగింది లచ్చి.

లచ్చి వంక ఎగాదిగా చూశాడు స్కూటరతను. నోటిలో వున్న జర్దా కిళ్ళీని తుపుక్కున ఉమ్మేసి "ఏం పాపా... అంత ఆ........ఖ.....లి....గా వుందా? ఆకలి అన్న పదాన్ని సాగదీస్తూ ఎర్రగా గారలు పళ్ళు బయటపెట్టి వెకిలిగా అడిగాడు. నల్లగా వున్నా లచ్చిలోని వింత ఆకర్షణ అతన్ని నిలువెల్లా కుదిపేస్తోంది.

అవును బాబూ... అన్నం తిని రెండు రోజులయింది. శానా ఆకలిగా వుంది బాబూ... పున్నెముంటుంది మీకు. ధర్మం సేయంది బాబూ..." ప్రాణమంతా ఒక్కటిగా చేర్చి దీనం గా అడిగింది లచ్చి. "అలా పక్కకొస్తే కావలసినంత ధర్మం చేస్తా... వస్తావా? " పక్క అనే పదాన్ని ఒత్తి పలుకుతూ కళ్ళను వింతగా మూస్తూ తెరుస్తూ మైకంగా అడిగాడు.

ఒక్కసారిగా లచ్చి కళ్ళు ఎర్రబారాయి. పట్టరాని కోపం తో ఒళ్ళు నిలువెల్లా కంపించిపోసాగింది. తుపుక్కున ఉమ్మేసి అతని వంక కోపం గా చూస్తూ ఇట్టా అడిగినందుకు నీలాంటోడి సెంప పగలగొట్టడానికి కూడా నా కాళ్ళకు సెప్పులు లేకుండా సేశాడు ఆ భగవంతుడు. ఏం బాబూ... నీ మగతనానికి ఇంట్లో ఆడోళ్ళు సరిపోట ల్లేదా.. అడుక్కునే వాళ్ళు కూడా కావాలా? నా తలరాత బాగోక పొట్టసేత్తో పట్టుకుని రోడ్డున పడ్డాను. కానీ మానం అమ్ముకోడానికి రాలేదు బాబూ... పక్కన నుంచుంటేనే మా వాసన భరించలేక ముక్కు మూసుకుంటారు. మరి మాతో కాపరం ఎట్టా సేత్తారు. బాబూ... మీకంటే ఈది క్కుక్కలు నయం. సీ...నీ.... బతుకు సెడ... అడుక్కునేదైనా సరే ఆడదైతే సాలు.... అర్రులు సాసుకుంటూ ఎనకాలబడుతారు. ఎదవ బతుకని ఎదవ బతుకు..." తిట్టుకుంటూ అక్కడినుండి కదిలింది లచ్చి.